Digitized in 2006
by
Thrinaina Informatics Ltd, Secunderabad, A.P., India.
(http://www.thrinaina.com)

From the original owned by
Sundarayya Vignana Kendram
and its partner Institutions

as part of the
British Library Endangered Archives Programme
supported by the
Lisbet Rausing Charitable Fund

Except for individual research purpose
any reproduction should be made with
written permission from the

Sundarayya Vignana Kendram,
1-8-1/B/25/A, Bagh Lingampally, Hyderabad - 500 044
Andhra Pradesh, India

COPYRIGHT STATEMENT

The copyright laws of the United States (Title 17, United States Code) and of India (Copyright Act of 1957) govern the making of photocopies or other reproductions of copyrighted material including foreign works under certain conditions. In addition, the United States extends protection to foreign works by means of various international conventions, bilateral agreements, and proclamations.

Under certain conditions specified in the laws, libraries and archives are authorized to furnish a photocopy or other reproduction. One of these specified conditions is that photocopy or reproduction is not to be used for any purpose other than private study, scholarship, or research. If a user makes a request for, or later uses, a photocopy or reproduction for purposes in excess of "fair use," that user may be liable for copyright infringement.

These institutions reserve the right to refuse to accept a copy order if, in their judgment, fulfillment of the order would involve violation of the copyright laws of the United States or India.

శేషాద్రిశర్మ, జనమంచి, 1882-1950

శ్రీరామవనవాసనాటకము

చెన్నపురి, 1925

Record no. 390

Śēṣādriśarma, Janamañci, 1882-1950

Śrīrāmavanavāsanāṭakamu

Cennapuri, 1925

Record no. 390

SUNDARAYYA VIGNANA KENDRAM
1-8-1/B/25/A, Bagh Lingampalli
Hyderabad – 500 044, Andhra Pradesh, India

Bibliographic Record Target

శేషాద్రిశర్మ, జనమంచి, 1882-1950.

శ్రీరామవనవాసనాటకము / జనమంచి శేషాద్రిశర్మ విరచితము.- చెన్నపురి : వావిళ్ల రామస్వామిశాస్త్రులు అండ్ సన్స్, 1925.

87 p. ;21 cm.

Record no. 390

Śēṣādriśarma, Janamañci, 1882-1950.

Śrīrāmavanavāsanāṭakamu / Janamañci Śēṣādriśarma viracitamu.- Cennapuri : Vāviḷla Rāmasvāmiśāstrulu aṃḍ Sans, 1925.

87 p. ;21 cm.

Record no. 390

35 mm microfilm

Image placement: IA (IIA) IB IIB   Date filming began:

సారస్వతనికేతనము
వేటపాలెం
పుస్తకము పేరు శ్రీరామవనవాసనాటకము
గ్రంథకర్త జనమంచి శేషాద్రిశర్మ
పుస్తకము సంఖ్య .... వర్గసంఖ్య ....

శ్రీరస్తు.

శ్రీరామప్రవాసనాటకము.

2621

కావ్యతీర్థ అభినవాంధ్రవాల్మీకి

జనమంచి శేషాద్రిశర్మ విరచితము.

Saraswata Niketanam.
Acc. No.
Vetapalem.

చెన్నపురి:

వావిళ్ల. రామస్వామిశాస్త్రులు అండ్ సన్స్ వారిచే

ప్రకటితము.

1925

All Rights Reserved.

Printed
at the 'VAVILLA' Press,
Madras—1925.

విజ్ఞప్తి.

రసికజనశేఖరులారా !

విచిత్రపాదుకాపట్టాభిషేకము వ్రాసినపిదప రామాయణమంతయు నాటకములుగా రచింపవలయు ననుబుద్ధి జనించెను. అది సముచితమే యని మిత్రులును బురికొల్పిరి. ఇట్లుండ నీపురంబున నెలకొన్న సుప్రసిద్ధన్యాయవాదులలో నొకరగు మ॥ రా॥ శ్రీ. బి. పి. దేవరాజులునాయఁడు బీ.ఏ., బి.యల్., గారు 'దీనరక్షక'నామంబున నొకనాటకసంఘమును స్థాపించి సన్మతులఁ గొందఱ ఖేలనమునకై యందుఁ జేర్చి సంగీతమున నాఱితేఱిన మ॥ రా॥ శ్రీ. యం. రాఘవేంద్రాచార్యులవారి నుపాధ్యాయులనుగా నియమించి నాటకముల నాడింప మొదలిడిరి. ఒకనాఁడు ప్రస్తావవశంబున నాతో "పాదుకాపట్టాభిషేకానంతరగాథలఁ గొన్ని నాటకములుగా రచించిన మేలని తోఁచెడు. ఆపని శ్రేయోదాయకముగాన నట్లుచేసిన నీసభవారు వానిని బ్రదర్శింతురని సాదరముగా మందలించిరి. నిష్కపటముగా వా రిట్లు పురికొల్పుటయు, నా కంతకుముందే యీయూహ జనించుటయు, మిత్రు లట్లే చెప్పియుండుటయు నివియన్నియు నొకదాని కొకటి తోడుకాఁగా నచిరకాలముననే యీనాటకము వ్రాయుట తటస్థించెను. వ్రాసిన కొలఁదిదినములకే దీనరక్షకసభ్యసుహృదయులు దీనిం బఠించి ప్రదర్శించుటయుఁ సంభవించెను.

నాటకముల వ్రాయుటకే కొంద ఱవతరించిరనియు, వారుతప్ప నొరులు వానిని వ్రాయ నధికారులుగారనియు, వ్రాసినను అవి బాగుండవనియు నొకపిచ్చియూహ యీప్రాంత్యముల వ్యాపించి, యాయూహ సమంజసరీతి నలరాడునని కొందఱు చంకలుతట్టుచున్న యీసమయమున శ్రీనాయఁడుగా రట్టి వెఱ్ఱియూహలకుం జోటీయకుండుట సముచితమని యెంచుచున్నాఁడను. అవలక్షణనాటకములు వ్రాయుటకన్న వూరకుండుటయే గౌరవమని భావించుచున్నాఁడను.

శ్రీరామచంద్రుఁడు చిత్రకూటమును వదల నెంచినది మొదలు సుగ్రీవునకుఁ బట్టాభిషేకము జరగినంతదనుకఁ గలకథ యిందుఁ గొలఁదిమార్పులతో వ్రాయఁబడినది. వాలి మృతి నొందఁగాఁ దార విలపించుట మొదలగురంగస్థలమునఁ బ్రదర్శింపఁదగని విషయము లిందుఁ గొలఁదిమార్పులచే నుచితరీతి వ్రాయఁబడినవి. ఇట్టి యధికారమును బూర్వులే ప్రసాదించియున్నారుకదా.

ఇందుఁ గొన్నిపాటలు చేర్పఁబడినవి. అవియన్నియు దీనరక్షక సభోపాధ్యాయులగు బ్రహ్మశ్రీ. యం. రాఘవేంద్రాచార్యులుగారి సాయమున వ్రాయఁబడినవియేగాని నాయూహలిందేవియు లేవు

నాటకము ప్రదర్శింపఁగనే దానిని బరమాదరంబున ముద్రించిన నాపరమాప్తులు, ఆంధ్రగ్రంథోద్ధారకులు మ॥ రా॥ శ్రీ. వావిళ్ల వేంకటేశ్వరశాస్త్రులుగారు నాకృతజ్ఞతకుం బాత్రులు

లక్షణములమీఁఱక చేతనైనయట్లు దీనిని వ్రాసితిని. ఇందుఁ బ్రమాదమునఁబడిన దోషముల నాకుం దెల్పి నాచేతనే వానినిఁ దిద్దించి నాకుఁ జక్కనిపద్ధతి నేర్పఁ బండితాఖండలులం బ్రార్థించువాఁడ. ఇంతకన్న నెక్కువ వ్రాయఁదగిన విషయము లింకెవ్వియును లేవు. తక్కిననాటకములు త్వరలో వెలువడునట్లుచేయుట దీనరక్షక సభవారికృత్యమై యున్నది. వారట్లు చేయఁబ్రార్థించుచు విరమించెద.

ఇట్లు విన్నవించు విద్వత్పాద సేవకుఁడు,
జనమంచి శేషాద్రిశర్మ.

శ్రీ శ్రీ శ్రీ.

ఈనాటకమున వచ్చుపాత్రములు.

పురుషులు.

రాముఁడు	ప్రహస్తుఁడు
లక్ష్మణుఁడు	విభీషణుఁడు
మునిశిష్యులు	అకంపనుఁడు
చిత్రకేతుఁడు	మారీచుఁడు
విలాసుఁడు	జటాయువు
అత్రి	కబంధుఁడు
విక్రముఁడు	సుగ్రీవుఁడు
శ్రుతకీర్తి	హనుమంతుఁడు
రావణుఁడు	వాలి
జంభుఁడు	అంగదుఁడు
రక్తరోముఁడు	పురోహితులు
ప్రఘసుఁడు	

స్త్రీలు.

సీత	కుండిక
అనసూయ	శబరి
శూర్పణఖ	తార
కపాలిని	

అవసరమునుబట్టి యింకను గొందఱు వత్తురు.

కొన్ని సవరణలు.

పుట.	పంక్తి.	ఉన్నది.	మార్పు.
8	14	వనంబు♦బునకుఁ	వనం♦బునకుఁ
14	4	ముజ్జ్వలమ	ముజ్జ్వలము
16	20	కృత్యములకుకై	కృత్యములకై
58	8	భర్తృని♦నాదముల్లై	భర్తృనా.♦దానుకృతిగః
,,	27	సత్కార	సీత్కార
66	3	వనితఫాల	లలనఫాల
71	14	మహిమను	మహిమము
74	12	నన్న	నన్ను

ఇందుఁ బదాఱవపుటలో నాల్గవపంక్తిలో 'రయుండవచ్చును' అని ముగింపఁబడి అయిదవపంక్తిలో 'రాము' అని ప్రారంభింపఁబడినది. కాన నాల్గవపంక్తిలో నున్న 'రయుండవచ్చును' అనుదానివెంట అయిదవపంక్తిలోని 'మునిచంద్రులారా!' అను దానిని జేర్చి చదువవలయును. 'రాము' అనుదానిని వదలవలయును.

కృతజ్ఞత.

మహాశయులారా! ఈనాటకము పూర్తియయి చాలకాలము ముద్రింపఁబడకుండెను. దీనరక్షక సభాకార్యదర్శిగారగు మ-రా-రా శ్రీ పీటూరు ప్రకాశముపంతులు బి.ఏ., బి.యల్., గారు, (జిల్లాకోర్టు సిరస్తాదారుగారు, కడప) నన్నుఁ ద్వరపెట్టి ముద్రింపఁ జేసిరి. కావున వారి యెడఁ గృతజ్ఞుఁడనై దీనరక్షక సభాభివృద్ధిని గోరుచున్నాఁడను.

ఇట్లు విధేయుఁడు,
జనమంచి. శేషాద్రిశర్మ.

శ్రీరస్తు.

శ్రీరామవనవాసము.

నాంది.

శా. [1]శ్రీరమ్యాకృతిఁ గాంచి నిర్జరమునుల్ ♦ చిత్తంబులన్ సమ్మద
స్ఫారాంభోధినిమగ్నులై వినుతులన్ ♦ సల్పన్ మహాదైత్యులన్
ఘోరం జెండి యశంబు నిల్పి జనులం ♦ బూతాత్ములం జేయుచున్
గారుణ్యంబున వెల్గు రాఘవుని శ్రీ♦కాంతుం దలంతున్ మదిన్. 1

సూత్ర:—(నాంద్యంతమున నాలుగుప్రక్కలు కలయం జూచి మహానందముతో) ఔరా! ఏమి నాభాగ్యము. సభ్యు లింతలోనే రంగస్థలమునంతయు నలంకరించినారే. (చెవియొగ్గి విని) [2]వాద్యధ్వను లద్భుతానందమును శ్రోత్రముల కిచ్చుచు విజృంభించుచున్నవే. సంగీతకీర్తనములు చల్లగా వినఁబడుచున్నవి (పైకెగఁ జూచి) నాకోరికలు ఫలించునట్లు దుర్దినములు పోయి [3]దిగంగనా ముఖంబులు తెలివినొందినవి. (సభవంకకుఁ దిరిగి వినయముతో నంజలిం బట్టి) శారదోత్సవసందర్శనాకాంక్ష నిందుఁ జేరియున్న మహాత్ములారా! నేను నాట్యవేదకళాకోవిదుఁడను. నేఁడు నాకు నేదే నొకనాటకము నభినయింప నాజ్ఞయిందు (మిన్నువంకఁ జెవి యొగ్గి) ప్రస్తుతశారదోత్సవమునకుఁ దగినట్లు ప్రసిద్ధకవివిరచితంబగు నూత్ననాటక మొకటి యభినయింపు మనుచున్నారా?. ఏమి నాయదృష్టము. మిక్కిలి చక్కఁగాఁ గుదిరినది (ఇంచుక యాలోచించి) ఎందులకో యింకను మానటి రాక యున్నది? ఇంకను దడవుసేయుచున్నదేమో పిలిచిచూచెద. (ముందు నడిచి) ఆర్యా! త్వరగా రమ్ము.

నటి:—(ప్రవేశించి) ఆర్యపుత్రా! ఇదిగో వచ్చితిని.

సూత్ర:—ఏమి మనయదృష్టము! రంగస్థలమును జూడుము.

నటి:—నాథా! ఔను. ఏమో శ్రోత్రయుల్లాసము నానును గల్గుచున్నయది. ఇఁక నేఁ జేయఁదగు కృత్య మేది?

---

1. ఇరువది రెండుపదములుగలనాంది. ఇందు నాటకకథాబీజము సంసూచితము.
2. రంగప్రసాధన మనఁబరఁగు ప్రస్తావనాంగము.
3. ఋతుసమాశ్రయముచేత భారతీవృత్తి వర్ణితము.

సూత్ర:—సభ్యులు వేచియున్నవారు. ఆలస్యముచేయక సంగీతక మారంభింపుము.

నటి.—నాట్యసామగ్రియంతయు సిద్ధముగ నుంచితిని ఇపుడు మనము ప్రయోగింపఁదగు నాటక మెద్దియో విన్నఁగోరెద.

సూత్ర:—శ్రీరామవనవాస మను నూతనాంధ్ర నాటక మాడవలయు.

నటి:—ఇందలికథ నాకుం దెలియ రాకున్నదే.

సూత్ర:—జేలా! శ్రీరామవనవాస మనుదానికే యర్థము తెలియలేదా?.

నటి:—కొంచెమైనను అర్థము తెలియక కాదు ప్రశ్నించినది. మీరు చెప్పిన నందలి కథారహస్యము వెల్లడి యగు నని.

సూత్ర:—ఆర్యా! నీవు నెఱజాణవు. కానసే తెలియనిదానిని దెలిసినట్లు నటించుచు నావలననే చెప్పింపఁ బూనియున్నదానవు.

నటి:—నాథా! నీవలననేగదా నేఁ దెలిసికొనవలయు? ఇందులోఁ దప్పేమి?

సూ:—సెబాసు! మెచ్చవచ్చు నీసామర్థ్యము వినుము కథం దెల్పెద.

సీ. భరతాదు లిచటికి ♦ వత్తు రిందుండ రా
దని రాఘవుఁడు వనంబు ♦ బునకుఁ జనుట
మునుల నెల్లను గాంచి ♦ వినయంబునర్ వారి
భయము పోయెడురీతిఁ ♦ బ్రతినఁ గొనుట
పంచవటిం జేరి ♦ పాపిని శూర్పణ
ఖను వికృతాకార ♦ మునఁ బనుపుట
యంతట రావణుం ♦ డరుదెంచి మాయచే
జనకపుత్త్రిని గొని సరగఁ ♦ జనుట
తే. రామలక్ష్మణు లట సీత ♦ లేమి నెఱిఁగి
వనులఁ దిరుగుచుఁ బంపకుఁ ♦ జనుట యందు
నర్కపుత్త్రునితో మైత్రి ♦ నంది యతనిఁ
గాచుటయు నాది యగు కథల్ ♦ గలుగు నిందు.

నటి:—సంతోషము. సంతోషము కథ మిక్కిలి చక్కఁగా నున్నది. కాని నవీన నాటకమని కొందఱు తలంతురేమో యని మాత్రము భయము కలుగుచున్నది.

సూత్ర:—ప్రేయసీ! వినుము.

చ. సరసమతుల్ కథారసముఁ ♦ జక్క నెఱింగియె గారవింతు రా
తురపడి యబ్బ యబ్బ యని ♦ తోఁచినఫక్కిని మూర్ఖు లీసడిం

తురు భయమేల? రామకథ ♦ తోరపు వేడుక నించుఁ గాదె యో
సరసిరుహాక్షి! యీకృతియు ♦ సాధురసాకర మై చెలంగెడుర్. 3

నటి:—మహానందము. ఇంక నేఁ జేయఁదగినపనిని జేసెద. నాథా! మాటలసందడిలో మఱచితిని. ఈనాటక మొనరించిన దెవరు?

సూత్ర:—ఆర్యా! విను.

సీ. ఆంధ్రభూసురలస ♦ దన్వయజననంబు
మహితకాశ్యపగోత్ర ♦ మహిమయుతము
శ్రుతిసంహితాద్వైత ♦ మతసన్నివేశంబు
స్మృతిహితాచారసు ♦ స్థిరయశంబు
శుభతమాపస్తంబ ♦ సూత్రసంకథనంబు
చెలఁగు నయాచిత ♦ జీవనంబు
పండితపాదాభి ♦ వందనభాగ్యంబు
సత్కవితారస ♦ స్ఫారశక్తి
తే. యలరఁ గడపపురంబున ♦ నధివసించి
సత్పురాణాళిఁ గావ్యముల్ ♦ సరసరీతి
నాంధ్ర మొనరించి మించు శే ♦ షాద్రిశర్మ
దీని రచియించె శాస్త్రరీ ♦ తిని గడంగి.

నటి:—నాథా! పరమానందము. ఇక్కవియేకదా విచిత్రపాదుకాపట్టాభిషేక పాండవాజ్ఞాతవాసాది నాటకరాజముల నొనరించెను?

సూత్ర:—అవును.

నటి:—నా ప్రశ్నములకుఁ దగినయుత్తర మిచ్చితిరి. కథావిషయమునుఁ దెల్పితిరి. ఇంక మీరు చేయఁదగిన ముఖ్యకార్యమునకుం గడంగుఁడు.

సూత్ర:—(స్మరణ మభినయించి) ఆర్యా! చక్కఁగా జ్ఞాపకము చేసితివి? ఆపన్నవారకుండగు భగవంతునిం బ్రార్థించుచున్నాఁడ.

చ. దనుజులఁ జెండి వేదసము ♦ దాయముఁ గాచి నితంబినీజనా
[1]ర్తిని దొలఁగించి ధర్మ మొక ♦ రీతిని నిల్పి దురాత్ము లెల్లఁ ద

1 ఇది కథోద్ఘాతము. ప్రకృతకాలవర్ణనరూప మగుట నిది ప్రవర్తకము.

మ్మనిశము నొంప నేమనక ♦ యాత్రిని గుందు [1]మునీంద్రరక్షకై
జనిఁ గను సూర్యతేజ! గురు♦చాపధరా! మము నిప్పు డేలుమా. ౬

(లోపల ధ్వని)

రాక్షసబాధలఁ గుందుచున్న మునీంద్రులను గావ నే గురుచాపధరుండనై యున్నవాఁడ. ఎవ్వరికే నిప్పుడు బాధ కల్గిన వచ్చి తీర్చెద. భయపడకుఁడు. భయపడకుఁడు.

సూత్ర:—నేను జేసిన యాపన్నివారకస్తుతిని దనదిగానే భావించి మునీంద్రుల సంరక్షణమునకై శ్రీరాముఁ డిదిగో వచ్చుచున్నట్లున్నది. మన మనంతరకరణీయమునకుం బోవుదము. రమ్ము.

(అని యిరువురు నిష్క్రమింతురు)

ఇది ప్రస్తావన.

1 ఇదిగో యని నిర్దేశించుటచే నిది ప్రయోగాతిశయము.

ప్రథమాంకము.

(శ్రీరామలక్ష్మణులు సీతయుఁ బ్రవేశించుచున్నారు)

రాము:—లక్ష్మణా! తెలిసినదికదా భరతుని మనస్థితి. త్వరపడి యేమేమో పల్కితివి. వత్సా! అతఁడు పరమభక్తుఁ డని తలంపుము.

లక్ష్మ:—రామచంద్రా! ఎఱుఁగక యేమో పల్కి మీమనస్సునకు నొప్పి గల్గించితిని. క్షమింపుఁడు. త్వరపడి మాటలాడుట న్యాయము గాదనియు నేర్చుకొంటిని.

రాము:—నాయనా! క్షమించునంతటి తప్పేమి యిందున్నది. పెద్దవాఁడను గాన నీవు బుద్ధిమంతుఁడ వగుట హితము గ్రహింపఁగలవని తెలిపితిని.

౨. (పాట)

సీత:—ప్రాణేశా! సౌమిత్రి మీయం దత్యంతభక్తివిశ్వాసములు కలవాఁడు. మీ కేమైన నపకారము గల్గునేమో యని భయంపడి యట్లు పల్కెను. ఆసమయ మట్టిది. నాకుంగూడ నప్పు డట్లే తోఁచినది. తుదకు భరతుఁడు పరమభక్తుఁ డగుట తెల్లమాయె.

రాము:—జానకీ! వేల వౌట నీ కట్లు తోఁచినను దోఁపవచ్చును. సౌమిత్రి చిన్నతనము నుండియు భరతుని సౌజన్య మెఱిఁగియు నట్లూహించుటకుం గారణము నాకు రాజ్యము లేకపోవుటయే గాక భరతునినుండి ప్రాణభయముం గూడఁ గల్గునేమో యనుది నిర్ధారణము చేసికొనుటయే గాని వేఱొండు గాదు.

సీత:—పాదుకలం గైకొని భరతుఁడు పోవునప్పుడు నామన స్సెంతయుఁ బరితపించినది. ఏ మాతని దుఃఖము? వర్ణనాతీతము. పలుమాఱుం వచ్చుచుం బోవుచుం డిన మేలని తోఁచినది. ఇందు మన కేకష్టములు కలుగునట్లు లేదు. పర్వతము చెంతనున్నది. దానిశృంగారము చూచుటకు రెండుకన్నులు చాలకున్నవి. దుఃఖము తోఁచుటయే లేదు. చిత్రకూట మనుపేరు సార్థకముగ నున్నది. గుంపులుగాఁగూడి పరుగులిడు జింకకొదమలఁ జూచునప్పుడు నాకఖండామోదము కల్గుచుండును. జింకలఁ జూచుచుండవలయు నని నా కెంతయుఁ గుతూహలము కలదు. అది యీనాఁటికి ఫలించినది. పెక్కురంగులుగల మృగములను జూడవలయునని నాకుఁ గోరిక కలదు. అరణ్యము లింతమనోహరము లని యూహిం

చినదియు లేదు. ఎంతహాయిగా నున్నది? ఈచల్లగాలి హితముగా నున్నది. సహజసౌందర్యముకదా పర్వతము. ఇందే యుండిన మునివారు వచ్చుచుం బోవు చుందురు. మన కేకొఱంతలు నిటం గలుగవు.

రాము:—ప్రాణేశ్వరీ! నీ విన్నమాటలన్నియు నిశ్చయములే కాని నిన్న మునులు వచ్చి నాతో నేమిచెప్పిపోయిరి?. మన మిందే యున్న నావాగ్దానము ఫలించునా? మనధర్మము నెఱవేర్పవలదా?.

సీత:—(ముసి ముసి నవ్వు చిట్లించి) భూపాలశిరోమణీ! మునులమాటలు విని వారిని రక్షింపం బూనితిరి గాని మన కేవిధమున నపకారము చేయని రక్కసుల నుక్కడంపం బూనుట ధర్మమే యని నాకుం దోంచకున్నది మీమాటల కెదురాడితినని యాగ్రహింపక యీసందేహమును దీర్పవలయును.

రాము:—(చిఱునవ్వునవ్వి) సాధ్వీ! వినుము.

చ. మునివరు లెట్టి భీతియును ♦ బొందక యుండంగం గ్రూరచిత్తులౌ
దనుజులు గర్వమూని యిల ♦ దారుణకర్మము లొక్కరీతిం జే
యును దలపోయ నట్టి గతి ♦ నారసి చేయనివాండు రాజనం
జను నొకొ వానికంటె వన♦సత్వము మేలుగదా తలంపంగన్. 6

దుష్టశిక్షణము, శిష్టరక్షణము రాజధర్మములనియే పెద్దలు చెప్పుచుందురు. రఘువంశపు రాజులవ్వానిం జక్కంగా నిర్వహించియే తమయశశ్చంద్రుని నకలంకస్థితి [1]వెలయించిపోయిరి. కావున రాక్షసులం జంపుట మనకు విధి దోషంబినుమంతయును లేదు.

సీత:—ప్రాణేశ్వరా! ప్రశ్న మునుగనపుడు సమాధాన మీప్రశ్నమునకుం గలదా యని తోంచును. మీ రుత్తరము చెప్పినతర్వాతం బ్రశ్నమే యసంగత మని తోంచును.

రాము:—(సౌమిత్రిం జూచి) లక్ష్మణా! సీత కీతావు మనోహరముగం దోంచినట్లు తెల్ల మాయె. నీ తాత్పర్య మేమి?

3. (పాట)

లక్ష్మ:—రఘుకులతిలకా! ఈస్థలము విశేషాభిరామముగ నున్నదనియే నాభావము. భరద్వాజమునియాశ్రమ మీచెంతనే యున్నది. పుణ్యనదీవతంసయగు భాగీరథీనది యిందే యున్నయది. ఆహారమునకుం దగినఫలమూలాదులు సమృద్ధిగా దొరకు

1 కథాబీజమును గార్యకరణరూపమునం జెప్పుటచే నిది యుపక్షేపము.

చున్నవి. ఇందే యుండుదమని నాకును *దోంచుచున్నది. కాని మహామునుల కష్టములు తొలంగించుట రాజధర్మమగుట నదియు నుచితమనియే తోంచుచు న్నది. ఇదమిత్థమ్మని నిర్ణయించునధికారము మీయందే యున్నయదికదా?.

రాము:—వత్సా! నీ విన్నమాట నిశ్చయమే కాని యీస్థలమున నుండుట సముచితము గాదని తోంచుచున్నది. ఏలన యిది యయోధ్యకు సమీపముగ నున్నది మహారణ్యభాగమేయైనను నిషాదరాజగు గుహుండు మన చెంతకు వచ్చువారికెల్ల మార్గదర్శకుండై యున్నవాండు. విశేషించి మనయెడలం బ్రీతిగలవాండు భరతుండన్నను మునివృత్తిం గాలము గడుపనెంచినవాండు. రాజ్యభోగముల నించుకయు నొల్లండు. కావుంబట్టి తోంచినపుడెల్ల నిచటికివచ్చి మనలం జూచిపోవుటం దటస్థించును. అతనితోం దల్లులు బంధుజనులు మంత్రులు పౌరులు వత్తురు గదా. క్రమక్రమముగా నందఱు కొంతకాల మిందే యుండుటయు సంభవింపవచ్చును. లోకుల కిది వనవాసవ్రతముగాం దోంపదు. కావున మన మెటకేని పోయినచో నీచిక్కులు గల్గవు. ఇంతియ గాదు. మహామునులు ప్రతిక్షణమును మనరాకం గోరుచు నెదురుచూచుచుందురు. వాగ్దానము ఫలవంతముగం జేయుట రాజధర్మము. ఇవన్నియుం దలపోసి చూచినయెడల మనము దండకారణ్యమున కరుగుట లగ్గని తోంచెడిని. ఇంక నీయిష్ట మేమి?

లక్ష్మ:—రామచంద్రా! మీయిష్టమే నాయిష్టము. త్వరగాం బయన మగుటయే మంచిది. వదినెగారి యభిప్రాయ మేమో.

సీత:—ప్రాణనాయకా! మీ కెయ్యది యిష్టమో నాకు కార్యమే యిష్టము. అదియే నాకుం బెన్నిధి. తప్పక దానినే సంతోషమున నాచరించుదాన.

లక్ష్మ:—అన్నా! రామచంద్రా! వదినెగారితాత్పర్యము నాయభిప్రాయము మీయిష్టమును సర్వథా నెఱవేర్పనెంచుచున్నవి. మన [1]వనగమనమునకు ఫలము దుష్టదానవుల సంహరించుటయు, శిష్టులగు మహామునులను గాచుటయుంగదా. దండకారణ్యవాసము కొంచెము కష్టదాయకమే యైనను శాశ్వతకీర్తిప్రదము కావచ్చును. కావున మన మింకం దప్పక బయలుదేరుదము.

రాము:—వత్సా! చక్కనివిషయమును జెప్పితివి. మనము దండకారణ్యమున కరుగుట [2]శాశ్వతకీర్తి నిచ్చునని యే నాకును దోంచుచున్నది. మహారణ్యమగుటం గొన్ని

* బీజమునే విస్తరించి చెప్పుట నిది పరికరము.

1 ఇందుం గార్యబీజనిష్పత్తి చెప్పంబడుటచే నిది పరిన్యాసము.

2 బీజానుకూలసంఘటనప్రయోజనవిచారముచే నిది యుక్తి.

కష్టములు రాకమానవు. వాని నోర్చుకొన్నఁగాని మనజన్మము సార్థకము గాదు, కష్టముల నన్నింటిని మన మనుభవించుటకేకదా వచ్చితిమి.

లక్ష్మ:—మహాత్మా!

చ. కరమునఁ జాప ముజ్జ్వలము ♦ గా మెఱయఁగ విషవహ్నిఁ గ్రక్కు భీ
కరభుజగేంద్రుపోల్కిఁ గనఁ ♦ గాఁ దగియుండెడు ఘోరబాణముల్
[1]వరుస వెలుంగ నేభయము ♦ వాటిలునో రఘురామ! దానవో
త్కరములు నిల్చునే యెదుటఁ ♦ గావున నిప్పుడె పోవు టొప్పగున్.

రాము:—వత్సా! రఘుకులకుమారున కుచితమగుమాట పల్కితివి. ఈపలుకులచే జానకి మనఃఖేదము తొలఁగిపోవును. మహారణ్యమధ్యవాసమునఁ గష్టములే గలుగవను నిశ్చయముగల్గె ననుకొనియెదను.

సీత:—రామచంద్రా! మీచెంతనున్నపుడు నాకుఁ గష్టము [2]లెట్లు కల్గును?. సకలసుఖ సమృద్ధులు మిముఁ జూచుచుండునపుడెల్ల లభించుచునే యుండును. నాకోరిక లన్నియు మిమ్ముఁ జూచుచుండవలయు ననుటయేకదా!

రాము:—జానకీ! బాగుబాగు. నీవంటి సత్కళత్రముగలుగ నాకింకఁ గొదువ యేమి యుండును?. ఇఁక మనము బయలుదేరవలయు. కాలము సుఖకరముగా నున్నది. వాయు వనుకూలముగా వీచుచున్నది. (చూడ్కి నిగుడించి) లక్ష్మణా! చూడుమా

ర. (పాట)

మహర్షులు వచ్చుచున్నట్లున్నది. పూజాద్రవ్యములు కొనిరమ్ము.

లక్ష్మ:—రామచంద్రా! శాంతతపోధనులగు మహర్షులే వచ్చుచున్నవారు. ఇదిగో పూజాద్రవ్యములు తెచ్చెద. (అని తెచ్చియుంచును)

(మహామునులు ప్రవేశించుచున్నారు)

రాము:—తపోధనులారా! వందనము లర్పించుచున్నాఁడ ఈపీఠముల నలంకరింపుఁడు.

లక్ష్మ:—నమస్కరించుచున్నాఁడ. (అని యథాశాస్త్రముగఁ బూజించును)

మునులు:—(పీఠముల నలంకరించి) మహాపురుషా! రఘుకులోద్ధారకా! శాశ్వతయశంబు నొంది రాజధర్మము నవలంబించి వర్ధిల్లుదువుగాక. (అని యాశీర్వదింతురు)

రాము:—మహాత్ముల యాశిషము లమోఘములు. తమరాకకుం గారణము దెలుప వేఁడుచున్నాఁడను.

1 బీజానుగుణగుణవర్ణన మగుట నిది విలోభనము.
2 సుఖాగమరూపమగుట నిది ప్రాప్తి.

మునులు:—రామచంద్రా! మీ రీచిత్రకూటమునందు నివసించినది మొదలు క్రూరరాక్షసులు మమ్ము మఱింత బాధపెట్టుచున్నారు

రాము:—ఏల?

ముని:—మిమ్ము బలవంతపఱచి మే మిచటికి రప్పించితిమని.

రాము:—ఐనచో వారి కేమి యాగ్రహము?

ముని:—రాక్షసులఁ జంప మీరు కంకణము గట్టుకొంటిరని, మే మందులకుం గారణభూతుల మని వారి క్రోధము.

ఒకముని:—(మాట కడ్డమువచ్చి)

క. భీకరదానవుఁ డొకఁడు
నాకామరుం డాడుకొనుచు ♦ నాశ్రమముకడన్
భూకాంతా! యుండం గని
కైకొనిపోయెన్ వచింపఁ ♦ గలదే యింకన్. 8

రాము:—మునివర్యులారా! ఇట్టి ఘోరవార్తల నిఁకఁ జెప్పకుఁడు. కర్ణకఠోరములగు నీమాటల వినఁజాల (ఆగ్రహముతో) ఇఁక నా ప్రతిన నాలకింపుఁడు.

ఉ. మానుల నేఁచు పాతకులు ♦ మామకచాపవిముక్తతీవ్రబా
ణానలజిహ్వాలం గనలి ♦ యార్తిని దల్లడ మంది కాలునిం
గానఁగ నేగు వార లిటు ♦ గానియెడన్ మునులార! ప్రాణముల్
పూని చరింప నేను నృప ♦ పుత్త్రుఁడ నేని విశుద్ధిగా ధరన్. 9

మునులు:—రఘుకులోద్ధారకా! నీవాక్యము మాచింతలం బాపినది. మాపాలిటి భగవంతుఁడవు నీవే. నేఁటికి మావాంఛితములు నెఱవేఱినవి దుష్టరాక్షసులబాధ యాక్షణముతో నంతమొందినది. భూదేవి దుష్టరాక్షసభారవహనక్లేశమును ద్వరలో మానఁగలదు ఇఁక మేము నిలువరాదు తపోవిఘ్నము గాకుండఁ ద్వరలో మీరు రావలయు. నిన్నే నమ్మియున్నవారము. నీ కాయురారోగ్యవిభవములు క్రమక్రమముగా వృద్ధిఁబొందుఁగాక.

రాము:—మహామునులారా! మీ రింక నాతుర ముడిగి యాశ్రమముల కరిగి సుఖం బుండుఁడు నేనును బయనము చేయువాఁడ ఘోరకాంతారమూట మార్గము తెలియక యించుక యాలస్యమగు నేమో.

మునులు [2]మేము ముందరిగి రాక్షసబాధాపరీతస్వాంతులగు మునులకు మీశుభాగమన

1 బీజాగమమగుట నిది సమాధానము. 2 గూఢభేదనమగుట నిది యుద్భేదము.

మును దెల్పుదుము. మాశిష్యులు కొందఱు మీకుఁ ద్రోవఁజూపుదురు. కొలఁది క్రోశములు దాఁటినపిదప మార్గము సుగమమై యుండును.

రాము:—మహాప్రసాదము. మీ రింక సుఖముగా నరుగవచ్చు. తపోనియమముల కే కొఱంతయు లేకయుండవచ్చును.

రాము:—మునిచంద్రులారా! వెఱపువదలి నిశ్చింతముగా నుండుఁడు. మీమనోరథములు ఫలింపఁజేసెద. దుష్టరాక్షసు లీలోకమున నుండరని నమ్ముఁడు.

ముని:—సాధు! సాధు! మీరిచ్చిన యభయహస్తమే మాకుం బరమసాధనము.

(అని నిష్క్రమింతురు)

రాము:—లక్ష్మణా! మనకు మార్గము తెలియదని పరమాదరంబున మహర్షులు ఈశిష్యుల నుంచిపోయిరి. వీరి కిష్టభోజనము సమకూర్పుము. రేపు మనము పయనముచేయుదము. వీరు కొంతదూరము మనతో వత్తురుగదా. అవ్వలిత్రోవ సుగమమని మును తెలిపిచ్చిరి.

లక్ష్మ:—చిత్తము. తమయానతి నొనరించెద.

(అని నిష్క్రమింతురు)

మునిశిష్యులు.—

ఉ. భీకరమూర్తులౌ దనుజ♦వీరుల నుక్కడఁగింపఁజాలు నీ
వీఁకను దండకాటవిని ♦ భీతిని బొందకయున్న రాక్షసా
నీకము లక్ష్యమై యడఁగు ♦ నేఁ బరికించెదఁ దద్వధం బటం
చీకమలాప్తుఁ డెంచె నన ♦ నీగగనాగ్రముఁ జేరె రాఘవా!. 10

రాము:—(విని వారలం గాంచి) మీరింకఁ గాల్యకృత్యములకై యరుగుఁడు. నేనును దత్కార్యమునకై గడంగెద.

(అని సీతతో నిష్క్రమింతురు)

†(ఇది ముఖసంధి)

ప్రథమాంకము సంపూర్ణము.

---

† ముఖసంధి ప్రధానాంగసహితముగఁ జెప్పఁడినది.

ద్వితీయాంకము.

(తరువాతఁ జిత్రకేతుఁడను గంధర్వుఁడు వృద్ధమునివేషమునఁ బ్రవేశించుచున్నాఁడు.)

౫. (పాట)

చిత్ర:—(తెరలోఁ బరమానందముతో) ఇంద్రునియాజ్ఞచేఁ †గొలఁదిదినములనుండి తిరుగుచున్న నేను నేఁటికి దండకారణ్యము చేరఁగల్గి శుభకృత్యములఁ జూడఁ గల్గితిని. ఔరా!

తే. మఱుఁగుపడియున్న సురలక్ష్మి ♦ మమతమీఱఁ
[2]దనకు నిల్వను నీడనెం♦తయు నొసంగఁ
జాలు శ్రీరామచంద్రుని♦లీలఁ గాంచి
సంతసించుచు నున్నది ♦ స్వాంతమందు.

(ముందు నడచి మూడ్కి నిగుడించి) అదిగో నామిత్రుఁడగు పురందరసేవకుఁడు విలాసుఁడు వచ్చుచున్నాఁడు.

విలా:—(ప్రవేశించి) మిత్రమా! చిత్రకేతూ! నమస్కరించుచున్నాఁడను.

చిత్ర:—మిత్రుఁడా! వాంఛాసిద్ధిచే నిర్జరనాథసమ్మానమునంది వర్ధిల్లుము. నీవు వచ్చి యెంతకాలమాయె?. ఏమేమి విచిత్రములు కంటివి?. ఇంద్రునియాజ్ఞ నెంతమాత్రము నెఱవేర్చితివి?

విలా:—ఆర్యా! మూఁడుదినములనుండి తిరుగుచున్నాఁడను. అయోధ్య మొదలింత వఱకు సంచరించితిని. నాకార్యము సాగినదిలేదు. నీ వేమిచూచితివి?

చిత్ర:—వచ్చినపని వెంటనే యైనదన్నట్లు నేను వచ్చిరాకమునుపే శ్రీరాముని యత్యద్భుతకృత్యమును జూచితి

విలా:—ఆకృత్యవిశేషమును దెల్పుమా.

౬. (పాట)

చిత్ర:—సఖా! విను. చిత్రకూటమునుండి మునిశిష్యులు త్రోవచూపుచుండ సీతాలక్ష్మణులతో శ్రీరామమూర్తి దండకారణ్యమును బ్రవేశించి యీచెంతకు వచ్చి

---

1 మధ్యాహ్నవర్ణనముచే విచ్ఛిన్నమగు కథాంశమును మరల నిర్దేశించుటచే నిది బిందువు.

2 దేవతారాజ్యలక్ష్మికి శ్రీరామునందభిలాషను దెల్పుట నిది విలాసము.

చేరెను. మార్గ మింక సుగమముగ నుండునని మునికుమారులు మరలి యెటకో పోయిరి.

విలా:—అయ్యో! ఈప్రాంత్యముల కేల వచ్చెను. ఇందు విరాధుఁడు సంచరించు చుండు నని వినియుంటిమికదా! ఏమి తరువాతివార్త?

చిత్ర:—సఖా! అనుమానింపకుము. శ్రీరామమూర్తి భగవదంశసంభూతుఁడు. ఆయన చరిత్ర మతిమానుషము: *అత్యద్భుతము. సామాన్యమనుష్యుఁడని భావించి యనుమానించుచున్నావా యేమి?

విలా:—ఆర్యా! నిశ్చయమే. పొరపాటు గావించితి. అమీఁదిచరిత్రమెద్ది?

చిత్ర:—మునిశిష్యులు వెనుకకుఁ బోవఁగనే రామచంద్రుఁడు సీతాలక్ష్మణులతోఁ బయనము చేయుచుండునంతలో.

చ. కరమున రక్తపాత్రము ము♦ఖంబున నేనుఁగుగున్న మేను భీ
కరమగుమూఁపురంబున న♦ఖండతరార్చులఁ బ్రజ్వరిల్లు నీ
శ్వరుని త్రిశూలమట్లు కనఁ♦జాలు త్రిశూలమునొప్పుచుండఁగాఁ
బరుగున నొక్కరాక్షసుఁడు ♦ వచ్చి గ్రహించెను భూమిపుత్రికన్.

విలా:—అయ్యో అయ్యో! అమీఁద? అమీఁద?

చిత్ర:—రాక్షసుఁడు రాము నెఱుంగక జానకిం బట్టుకొని నవ్వుచుఁ బోవు చుండఁగా జానకి.

క. జనకునికూఁతుర శ్రీరా
మునిసాధ్విని నన్ను నితఁడు ♦ మూర్ఖుఁడు గర్వం
బునఁ బట్టె నేమిచేయుదు
నని రామునిఁ జూచి యేడ్చె ♦ నాతురపడుచున్. 3

విలా:—తరువాత? తరువాత?

చిత్ర:—లక్ష్మణుం డన్నా! ఇట్టిదుర్గతిని గాంచెఁగదా సీతయని దుఃఖింప నాతని నూఱడించి శ్రీరాముఁ డాతని బాణంబున నొప్పించెను. వాఁ డాగ్రహంబున సీతను విడలి రామలక్ష్మణుల నెత్తుకొని పరుగెత్తుచుండ సీత వాపోవఁ జొచ్చెను. అంత నాయన్నదమ్ము లిర్వురు విరాధుని రెండుబాహువుల ఖండించిరి. వాని మొండెము దొర్లుచుండ దాని నచ్చటఁ బూడ్చిరి. అంతలో నతఁడు గంధ

*దృష్టనష్టబీజానుసర్పణ మగుట నిది పరిసర్పము.

ర్వుఁడై తనశాపమును దెలిపి త్రోవఁ జూపి తనలోకంబున కరిగెను. ఆమొం డెము పొరలాడుతఁటి నలిగి చూర్ణమైన కొండ యదిగో భూమిసమమై యున్నది. చూడు.

విలా:—సంతోషము, సంతోషము. మని మిఁకఁజేయఁదగినపని యేది?

చిత్ర:—సఖా! శ్రీరాముఁడు సీతయు లక్ష్మణుండును అత్రిమునియాశ్రమంబునకుం బోవుచున్నారు. అచ్చటివింతలను జూడఁబోదము రమ్ము.

(అని యిర్వురు నిష్క్రమించుచున్నారు.)

(ఇది చూళిక)

పిదప శ్రీరాముఁడు సీతాలక్ష్మణులతో
నత్రిమునియాశ్రమమును బ్రవేశించుచున్నాఁడు.

రాము:—జానకీ! కన్నులపండువు చేయుచున్న యీయత్రిమునియాశ్రమము జూడుము. ఇది పరమపవిత్రమైనది. ఇందు.

చ. హరిణములుం బులుల్ గలిసి♦ యాడెడు నల్లదె యేన్గుగున్న భీ
కరమృగనాథు కేసరము♦ఖంబులఁ దొండముచేతఁ బట్టి యా
దరణము మీఱ నీడ్చెడి ము♦దంబునఁ బిల్లులనెక్కి మూషకో
త్కరము విహారముల్ సలుపఁ♦గాఁ దలపోసెడిజాడ యొప్పెడున్.

సీత:—ప్రాణేశా! అనసూయామహాదేవి యీమునీశ్వరుధర్మపత్నియే కదా. వారిరువురి మహిమములచే నఖిలజంతువులు విరోధములు లేకుండుట నొకయద్భుతమా.

౭. (పాట)

రాము:—(ముందుచూచి) భూపుత్రీ! మునీంద్రులు మనరాకఁ గాంచి శిష్యులకేమో యాజ్ఞాపించుచున్నట్లున్నది. త్వరగాఁ బోదము. (అని లోనఁ బ్రవేశించి) మునీంద్రా! అనసూయాదేవీ! రాముఁడు నమస్కరించుచున్నాఁడు. (అని సీతాలక్ష్మణులతో నమస్కరించును).

అత్రి:—శ్రీరామా! త్రిలోకవిఖ్యాతచరిత్రుఁడవై కులోద్ధారకుఁడవై నిరంతర శ్రీయుతుండవై వర్ధిల్లుము. లక్ష్మణా! సద్యశంబున వర్ధిల్లుము. జానకీ! పతివ్రతాశిరోమణి యనం బరఁగి ప్రకాశింపుము.

అన:—(ఆశీర్వదించి) జానకీ! అయోనిసంభూతా! ఇటఁ గూరుచుండుము.

సీత:—(భర్తతోఁ గూరుచుండును సౌమిత్రియుఁ గూరుచుండును.)

అత్రి:—రామచంద్రా! పితృవాక్యమును పాలింపఁబూని రాజ్యమును వదలి మునివేషధారివై యడవులకు వచ్చుట విన్నాఁడను. చూడఁగోరుచుంటిని. నేఁటికి మాయిరువురకు నేత్రోత్సవమైనది.

రాము:—మునీంద్రా! మీదంపతుల పాదధూళి మాయిరువురను బరమపవిత్రులనుగాఁ జేసినది. మేమిఁక ధన్యులము. మాకోరికలు ఫలించినవి. మాతపస్సులు పండినవి.

అత్రి:—లక్ష్మణా! నీభ్రాతృవాత్సల్యము సువ్యక్తమాయె. నీయశంబు జగంబున వర్ధిల్లుఁగాక.

లక్ష్మ:—మునీంద్రా! శ్రీరామచంద్రపాదారవిందములఁ గొల్చుచుండుటచే మీదర్శనమైనది. నావాంఛిత మిదియే, సర్వదా యీరీతిగనే యన్నకు సేవచేయునట్టి భాగ్యము నాకుం గల్గ నాశీర్వదింపుఁడు.

అత్రి:—అట్లే యగుఁగాక.

అన:—శ్రీరామచంద్రధర్మపత్నీ! పతినే దైవముగా భావించి రాజ్యసుఖములవదలి మహారణ్యములకు నీవు వచ్చినవార్త మునులవలన విని సంతసించితిని. ఇపుడు నిన్నుఁజూడఁగాఁ బరమానందమబ్బెను.

సీత:—తల్లీ! ఇట్లుచేయుట వనితలకు సహజధర్మమేగాని యిందులోఁ గ్రొత్త యేమున్నది?.

అత్రి:—ఇట్టిపల్కులు శ్రీరామునిపత్నివై జనకునకుం బుత్రివగు నీకు నర్హమే.

అన:—సాధ్వీ! నిశ్చయమే. ఇట్టియభిప్రాయము నీవంటియుత్తమకులప్రసూతలకుఁ దప్ప నెల్లరకుం గల్గునా?. ఇదిపూర్వజన్మపుణ్యఫలముకదా!.

సీత:—భర్త నెడఁబాయకుండుట సహజముగనే యున్నది. కాని వింత నాకేమియుం దోఁపలేదు.

అత్రి:—దశరథుకోడలనఁదగినమాటనే పల్కితివి. సంతోషము సంతోషము.

అన:—(నవ్వి) కుమారీ! ఈగుణము నీకీపుట్టువునమాత్రమే కల్గినదికాదు. అనేకజన్మసంసిద్ధము. సహజము. కాఁబట్టి నీకిది వింతగాఁ దోఁపలేదు.

రాము:—తల్లీ! ఈ జానకి మీయాశిషములకుఁ బాత్రురాలు. కాని స్తుతికి నర్హురాలు కాదు.

అత్రి:—రామచంద్రా! ఇవన్నియు నాశీర్వచనములేకాని స్తోత్రములుకావు.

సీత:—తల్లీ! అడవులకు రాఁబట్టియే పతివ్రతాశిరోమణివగు నిన్నుం జూడఁగల్గితిని. నాయీజన్మము పవిత్రమాయె. నానోములు ఫలించినవి ముందుఁగూడ నాకు శుభములే కల్గుచుండఁగలవు.

అన:—జనకపుత్రికవగు నీకిట్లు చెప్పఁదగియేయున్నయది. నీజన్మము స్వభావముచేతనే పరిశుద్ధమైనది. నీకు లభింపఁదగనివాంఛ లేవియున్నవి. ఆశ్రితావనదీక్షగల నీకేవిషయమున లోపముగలదు? ప్రతిజన్మమందు ననపాయినివై మహాపురుషుండగు శ్రీరామునిం గూడియుందువు.

సీత:—తల్లీ! ఈవరమే చాలును అమోఘవాక్కులుగల మీమాటలు ఫలించు ననియే నానమ్మకము.

అన:—జానకీ! ఇది వర మెట్లు లగును? స్వాభావికమేకదా. ఇందుఁ గ్రొత్తవిషయమేమియు లేదు.

సీత:—తమయాశీర్వచన మెట్లో అట్లే జరుగునని నాదృఢవిశ్వాసము.

అన:—రామపత్నీ! ఎందును గొఱంతలేకపోయినను వృద్ధురాలనుగానఁ గొన్నివరము లీయఁదలఁచితి. వానిని గ్రహింపవలయు

సీత:—తల్లీ! భర్తృహితములగువరములఁ గరుణించిన నవశ్యము శిరసావహించెద.

౮. (పాట)

అన:—జనకజరాజతనయా! నీవు ముడుచుకొనుపూవులు వాసనవీడక వాడక యెప్పటికిని క్రొత్తవిగనే యుండఁగలవు. చీరమాయక వన్నము తప్పక యలరారఁగలదు. నీవిభూషణము లెంతకాలమున్నను క్రొత్తవిగనే యుండఁగలవు.

౯. (పాట)

సీత:—సాధ్వీమతల్లీ! ఈవరములు నాప్రాణేశ్వరున కత్యంతసంతోషము నీఁజాలునవి కావున సమ్మదంబునం బరిగ్రహించితి.

అన:—రామచంద్రా! మీయనుకూలదాంపత్యమునకుఁ బరమానందము నందితి. ఈవనములకు మీరు వచ్చుట మఱింత యానందము నిచ్చెను. ఇఁక మానులకోర్కులు ఫలింపకపోవు. వనవాసవ్రతము నెఱవేర్చి రాజ్యమును బూజ్యభంగిఁ బాలింతువుగాక. నీసత్కీర్తి దశదిక్కుల వ్యాపించుఁగాక.

రాము:—†తల్లీ! జానకికి మీరొసంగినవరంబుల నాకిపుడిచ్చినయాశిషంబులు సామాన్యములుకావు. ఇట్టిమహిమగల మీదర్శనము చేసికొనుచు నిందుండఁ గోర్కిపుట్టుచున్నది రాజ్యమం దిచ్ఛ పొడముకున్నది.

అన:—వత్సా తండ్రియాజ్ఞను బాలింప నడవులకు వచ్చితివి. సంతోషించితి. ప్రాప్తమునఁ దండ్రియానతిఁ బాలింపవలదా?.

---

† రాజ్యవిషయకమగు ననిచ్ఛను దెల్పుటచే నిది విఘాతము.

రాము:—[1]తల్లీ! అటులైనఁ దమయానతినే శిరసావహించెద కాని తమపవిత్రచరణ సంసేవనయే రాజ్యమునకంటె నధికమని నాభావము.

అత్రి:—వత్సా! రాజ్యమును బాలించుచు నీవుండుటయే మాయిరువురకు నిష్టము.

రాము:—తల్లిదండ్రులమాట లనుల్లంఘ్యములు. తప్పక నెఱవేర్చెద.

అత్రి:—

క. సిరితో వైకుంఠంబునఁ, [2]బరమేశుఁడు విష్ణుమూర్తి ♦ పరఁగెడుగతి నీ
పురుసింహ వీతిఁ బొల్చెడు, తరుణంబునఁ జూడఁ నేను ♦ దలఁచెద రామా!

అన:—అట్టిశుభతమసమయము త్వరలో వచ్చుంగాక.

రాము:—మునీంద్రా! సాధ్వీమణీ! తమయానతి శిరసావహించి చేయువాఁడ సంశయ మించుకంతయు లేదు.

అత్రి:—నాయనా! మాయాతిథ్యమును గ్రహింపుము.

రాము:—మీ యాతిథ్యాశిషములు నాకుం బరమసుఖావహములు పరిగ్రహించెద.

అని (ఫలములం గైకొనును.)

అత్రి:—వత్సా! ఇంక నీవేమి గోరెదవు?

రాము.—ఈయరణ్యమున నెచ్చోట నుండఁదగునో ఆనెలవు మీవచనము ననుసరించి నిర్ణయింపఁగోరెద.

అత్రి.—[3] (ఆలోచించి) రామచంద్రా! నీవలనఁ గావలసినకార్యము లనేకము లున్నవి. ఈప్రాంతముల నున్నమునుల కష్టములఁ దీర్చుట ప్రధానకృత్యము అన్నింటికిఁ దగినతావు పంచవటీతీరము. చెంతనే గోదావరి యున్నది. కంద మూలాదులు యథేష్టముగా దొరకును.

రాము.—లక్ష్మణా!

మత్తకోకిల.—

[4]భూరిచాపమునందు నంబక ♦ ముంచి వడిఁ జతఁగూర్పుమా
ఘోరదానవవీరసంతతిఁ ♦ గోర్కి మీఱ వధించెదన్.
ధారణీసురవర్యులెల్ల ని ♦ తాంతభీతిని బాసి యిం
పార నిందు వసింపఁ జేసెద ♦ నాలసింపకుమా యిఁకన్. 6

---

1 రాజ్యమందనిష్టమును జూపుటచే నిది శమము.

2 అనురాగసూచకమగుట నిది పుష్పము.

3 ఉపాయముతోడి వాక్యరచనచే నిది యుపన్యాసము.

4 అనురాగసూచకవాక్యమగుట నిది పుష్పము

అత్రి:—వత్సా! అంతటివాఁడవే కాని సమయము వచ్చినపుడల్లె యసురుల వధించి మాకెల్ల భయమును బాపి సుఖముం గల్గింపుము.

రాము:—పంచవటికిం బోవుమార్గము నెఱుంగఁగోరెద.

అత్రి:—ఈయాశ్రమమునుండి యల్లమహీరుహంబు చేరువఁ బోయిన యగస్త్యమహా మునియాశ్రమంబు చక్షుర్గోచరంబగు. అచ్చటికరిగి వారి దర్శించి తదాది ష్టపథంబున నచ్చటికిం బొమ్ము. ఆమునికుమారు లిర్వురు మీకుఁ ద్రోవఁ జూపు వారు.

రాము:—[1]చక్కఁగా నుపదేశించితిరి. అగస్త్యమహాముని దర్శించి యవ్వల నరిగెద. అందువసించి తమయానతిఁ జొప్పున దుష్టరాక్షసుల శిక్షించెద ఇదె సెలవుపుచ్చు కొనియెద.

(అని సీతాలక్ష్మణులతో వెడలుచున్నాఁడు.)

[2](ఇది ప్రతిముఖసంధి.)

ఇది ద్వితీయాంకము.

శ్రీ శ్రీ శ్రీ

---

1 నిష్ఠురవచనమగుట నిది వజ్రము

2 ప్రయత్నబిందువులసంబంధముచే ముఖ్యాంగములతోఁ బ్రతిముఖసంధి చెప్పఁబడినది.

తృతీయాంకము.

(పిదప మునికుమారు లిద్దరు ప్రవేశించుచున్నారు.)

౧౦. (పాట)

ప్రథ:—‡ఆర్యా, అత్రిమునియాజ్ఞానుసారము రామునకు మార్గముం జూపితిని. అగస్త్య మహర్షి యాశ్రమమువఱకుఁ దోడుపొండని గురువుల యాజ్ఞ. మనము గుర్వాజ్ఞ మీఱి వీరివెంట నింతదూరము వచ్చి మరలుచున్నాము కదా? గురువు లేమందురో?

ద్వితీ:—సఖా, దీనియం దపరాధ మేమియుఁ గానరాదు. అగస్త్యముని యాశ్రమము తర్వాతఁ బోవలదని యాజ్ఞ చేసినారా? అంతవఱకనఁగా నుపలక్షణవిధిచేత రాముఁడు తమ్మున్నంతదూరమని యర్థము కాఁబట్టి గురువు లాగ్రహింపరు. వారు చెప్పినపాఠమే కదా ఉపలక్షణవిధి యనునది.

ప్రథ:—మనమిట్లర్థము చెప్పిన వా రాగ్రహింపకుందురా? క్షమింపుఁడని వేఁడుకొనుటయే మనపని.

ద్వితీ:—వెఱ్ఱివాఁడా రాముని వెంట నెంతదూరము పోతిరని వారు ప్రశ్నించినపుడు కదా మనము బదులు చెప్పవలయు? ఆమాట నేయడుగరు. రామునకుఁ ద్రోవచూపుటకై మన మరుగ నేలపోయితిరని యడుగువారును గలరా?

ప్రథ:—ఆర్యా, రామునియం దత్యంత ప్రీతి గురువులకుండుటకుం గారణమేమి? ప్రభువులనియా? ఆయధికార మిపుడు రామునకు లేదే. శుభ్రముగా వపనమైనదే.

ద్వితీ:—బాలకా, ఏమిట్లు వపనమని గిపనమని మాటలాడుచున్నావు. జాగ్రత్త. గురువులవారే విన్న నిన్నుఁ జంపియుందురే.

ప్రథ:—తెలియకయంటిని వారిమాహాత్మ్యము చెప్పుము.

ద్వితీ:—వత్సా, బుద్ధిమంతుఁడవై యట్లడుగుము చెప్పెద. రాముఁడు లోకమున ధర్మమును రక్షించుటకై పుట్టిన నారాయణమూర్తి. దుష్టశిక్షణ శిష్టరక్షణము లతని ముఖ్యకృత్యములు. పరమరహస్య హేతువుండఁబట్టియే యీయన దండకారణ్యములకు వచ్చెను. అగస్త్యులి పల్కినపల్కులు వినలేదా?

‡పూర్వాంకమున నత్రిచే నిర్దేశింపఁబడుపాత్రముల కిందుఁ బ్రవేశము కలుగఁ జేయుట విధి యంకాస్యము.

ప్రథ —ఏమాపల్కులు ఏదోయిచ్చినట్లుండెను. తెల్పుము.

ద్వితీ —దివ్యశరాసనము, అక్షయబాణతూణీరములు, అభేద్యకవచము నిచ్చెను

ప్రథ.—ఇవి రామున కింతకుఁబూర్వము లేవా.

ద్వితీ.—శ్రీరామునికొఱకే యివి నిర్మింపఁబడినవి. కాచియుండి సమయము వచ్చినది కావున నగస్త్యు లిచ్చిరి.

ప్రథ —వారుచెప్పిన పల్కులేవి?

ద్వితీ —అగస్త్యముని శరాసనం బిచ్చుచు

చ. కొనుము శరాసనంబు నృప♦కుంజర! దీన జయింపు క్రూరులౌ
దనుజుల, నీదుపుట్టుకకుఁ ♦ దథ్యము పల్కెదఁ జేయనైన దీ
పనియొకదా మునీశ్వరుల♦బాధల మాన్పుట యిట్టిదాఁ జుమీ
వినుతి యొనర్పఁజాల రఘు♦వీర! మహాత్మక! యాదిపూరుషా!.

అనియెఁగదా. దీనియర్థమేమి?

ప్రథ.—(ఆలోచించి) సరె, అవతారపురుషుఁడని దీనిభావము.

ద్వితీ —అక్షయబాణతూణీరము లిచ్చుచు నిట్లుచెప్పిరి.

ఉ. ఎప్పుడు వీని నిచ్చి కృత♦కృత్యుఁడ నౌదునో నేనటంచు నె
ల్లప్పుడు మానసాబ్జమున ♦ హారిభవద్గురుమూర్తి నిల్పి నే
రొప్పుఁగ ధ్యానరూపమగు♦యోగము నూని వసించువాఁడ నీ
విప్పటి కేగుదెంచితి మ♦హేశ్వర! యోగిహృదంబుజాలయా!. 2

ప్రథ —ఆర్యా! ఈమాటలంబట్టి భగవంతుఁడనియే తోఁచుచున్నది. ఐన నీమహారణ్యముల నీఘోరదానవులనడుమ నిస్సహాయుఁడై యెట్లు వసింపఁగల్గునా యని సందియము గల్గుచున్నయది.

ద్వితీ—[1]దశరథకౌసల్యలు వసిష్ఠమునీంద్రుఁడు నిచ్చిన యాశీర్వచనము లభేద్యకవచములుగ నుండ నీమహాపురుషునకు భీతితోఁచునా.

ప్రథ.—ఎన్నియాశీర్వచనము లుండినను ఘోరరాక్షసులనుచూచి మనస్సునకుం దోఁచినపుడు దేహము కంపించును జుమీ.

ద్వితీ.—అగస్త్యమునీశ్వరుమాట లాలించియు నట్టిసంశయము నీకేల కల్గినదో తెలియకున్నది.

ప్రథ.—(ముందు చూచ్చి నిగుడించి) ఆర్యా! అల్ల[illegible] కపటముని వేషధారులగు దానవు లిందందుఁ దిరుగుచున్నవారు. మన మీకుంజంబుల దాఁగియుందము.

1 కథాబీజమును మరల నాకర్షించుటచే గర్భసంధి యారంభింపఁబడినది.

Acc. No

ద్వితీ.—[1]వత్సా! వీరు దానవులుకారు. శ్రీరామదర్శనమునకై ఫలమూలాదులం గొని పంచవటీతీరమునకుం బోవుచున్నవారు. వీరు పరిశుద్ధతేజస్కులు. శాంతాత్ములు. వేదపాఠకులు. మునికుమారులు. భయంపడకుము.

ప్రథ.—అట్లైన మనముకూడఁ బంచవటికింబోయి యందలివిశేషంబుల నత్రిమునికిం దెల్పుదము.

ద్వితీ.—[2]వత్సా! నీయూహ చాలమంచిది. సర్వలోకశరణ్యుఁడగు రామచంద్రునిం గన్నులారఁ గాంచి యానంద మనుభవింతము. గురువు లాగ్రహించిన క్షమింపుఁడని వేఁడుకొందము.

(అని యిరువురు నిష్క్రమింతురు)

(తరువాతఁ బంచవటీతీరమున రాముఁడు సీతయుఁ బర్ణశాలలోఁ బ్రవేశించుచున్నారు.)

౧౧. (పాట)

రాము.—జానకీ! సౌమిత్రి యీపర్ణశాల నెంత వింతగ నిర్మించెనో చూడుము. నలుప్రక్కలఁ జల్లనివృక్షములు క్రిక్కిరిసియున్నవి. గోదావరివైపు మార్గమేర్పఱచినట్లు చెట్లులేక భూమి మెత్తగా నున్నది. మనమిందుఁ గూరుచుండిన గోదావరిశీతలవారిపూరము మనకుం గానవచ్చుచుండును. ముఖము నిటు త్రిప్పుము.

చ. [3]తరువులఁ గౌఁగిలించుకొని ♦ తద్దయు వేడ్కఁ జిగిర్చి శాలమం
దరుదుగ నూత్నపుష్పయుతి ♦ హారితరంబుగఁ జూడనొప్పి సుం
దరతరరూపయుక్తి వని♦తామణులట్టుల నీలతల్ కనన్
సురుచిరమోద మబ్బెడిని ♦ సుందరి! యాదృతిమీఱఁ జూడుమా.

సీత.—(చిఱునవ్వు మోమునం జిందులాడ) ప్రాణేశ్వరా! ఆచాయను దృష్టిసారింపుఁడు.

తే. పల్లవాధరసంప్రాప్తి ♦ నుల్లసిల్లి
పుష్పవతియైనకతమునఁ ♦ బొలుపుఁగులుకు
తనువిలాసము గల్గును ♦ దారవల్లి
శాఖలం బట్టుకొనెడువృ♦క్షపతి యారా!. 4

1 ప్రస్తుతోపయోగికార్య మాచరించుట నిది యభూతాహరణము.

2 తత్వార్థకీర్తనమగుట నిది మార్గము.

3 ఉత్కర్షవాక్యరూపమగుట నిది యుదాహరణము.

రాము.—(పరమానందముతో) నారీమణీ! ఇట్టిమాట నేర్పు నీకు సహజముగదా. సెబాసు!

సీత.—నాథా! అవైపు చూడ్కిఁ బరఁగింపుఁడు.

తే. గంధవహసంగతిఁ సుంత ♦ కదలుహస్త
పల్లవంబులఁ జాఁపి యు♦త్ఫుల్లకుసుమ
జాతమును గానుకఁగా నిచ్చు ♦ ప్రీతియలర
వల్లిననుఁ బిల్చుచున్నట్టి♦భంగిఁ గనుము. 5

రాము—[1]ప్రాణేశ్వరీ! చక్కఁగా వర్ణించితివి. విదుషీమణివగు నీకిట్టివాక్యనైపుణి యుండుట వింతకాదుకదా.

సీత.—నాథా! మీసన్నిధిప్రభావమేకాని నాయం దిట్టివైదుష్యమును లేదు.

రాము—ప్రేయసీ! ఈమాటయే వైదుష్యమున కానవాలు.

సీత.—(చిఱునవ్వునవ్వి యూరకుండును)

రాము.—జానకీ! ఈపర్ణశాల యతిమనోహరంబై తనరారుచున్నది. (లోపలం జొచ్చి) ఔరా! లక్ష్మణునకీ నేర్పు సహజముగాఁ గల్గినదియా, లేక నేర్చుకొన్నదియా? ఎంతశృంగారముగా నిర్మించినాఁడు. ఇది భోజనశాల. ఇదిగో విహారస్థానము. ఇయ్యదిగో గోదావరిం జూచుచు సంతోషమునఁ గాలమును బుచ్చఁదగిన చోటు. ఆహా! ఇది యతఁడుండుట కేర్పఱచుకొన్నస్థలముగానోపు ద్వారభాగమున నున్నదికదా. ఎంతటి భ్రాతృవాత్సల్యము. ఎంతవిశ్వాసము ఎంత భక్తి. ఎంతశ్రద్ధ.

సీత.—ఇవియన్నియు నుండుటంబట్టియే యడవులపాలగు మనతో వచ్చినాఁడు. ఈయుదాహరణము చాలదా.

రాము.—(ముక్కుపై వ్రేలుంచి) జానకీ! నీవన్నమాట సత్యము. నిద్రాహారములు విసర్జించి నన్ను సేవించుచున్నాఁడుకదా. ఎంతటిబుద్ధిశాలి. ఎంతవినయము కలవాఁడు సెబాసు! సెబాసు!

సీత.—ప్రాణేశా! ఈవేదిక యెందులకో.

రాము—ప్రేయసీ!

చ. ఇరువుర మీయరుంగుపయి ♦ నింపుగ నొక్కటఁ గూరుచుండి, సా
గరపతిఁ గానఁబోవుకతు♦కంబున నుబ్బి, తరంగహస్తముల్
వరుసఁగఁ జాఁపిచాఁపి సిత♦వారిజనేత్రము లుల్లసిల్లఁగా
నరుదుగఁ గ్రాలుగౌతమిని ♦ నల్లనఁ జూచుటకంచుఁ దోఁచెడిన్. 6

1 భావజ్ఞానరూపమగుట నిది క్రమము.

సీత.—నాథా! ఈపర్ణశాల యొక్కటియే యరణ్యవాసఖేదమును బోఁగొట్టఁజాలును. వేయేల? ఇందు నివసించి యీయరణ్యవాసులవృత్తిని జూచుచు మనోహరమృగములం గాంచుచు నిత్యామోదసుఖ మనుభవింతము.

రాము.—సంతోషము. (ముందు చూచి) లక్ష్మణుండు గోదావరికిం బోయి జలమును దెచ్చుచున్నాఁడు.

౧౨. (పాట)

లక్ష్మ.—(ప్రవేశించి) రామచంద్రా! గోదావరి మిక్కిలి సమీపము గాక చాలదూరము గాక యున్నది. సలిలములు మనోహరములుగ నున్నవి. జలావతరణస్థలము సిద్ధపఱుపంబడియే యున్నది. మహర్షులీప్రాంత్యమునఁ గలరని యీస్థలమే చెప్పుచున్నది. కందమూలములు సమృద్ధిగా దొరకఁగలవు. మనయాశ్రమస్థలము శీతలవృక్షనిబిడంబై యున్నది. ఇందు మీమది సంతోషము నొంది యుండఁజాలునని యెంచుచున్నాఁడ.

రాము.—వత్సా! లక్ష్మణా! ఈయాశ్రమము చక్కఁగా నిర్మించితివి. కొలఁతయును నదియేలేక యిది యయోధ్యలో నంతఃపురమును మించియున్నది. ఇట్టినిర్మలవాయు వెందుగలదు? ఇంక వేగమపోయి కందమూలములం దెమ్ము. నేఁడీపర్ణశాలలోఁ జక్కనియాహారము నందఱ మనుభవింతము.

లక్ష్మ.—రామచంద్రా! మీరుపోయిగాఁ గూరుచుండుటకుగా నల్లదె తావు నిర్మించితి. మీరందు విశ్రమింపుఁడు. ఇప్పుడేపోయి సురుచిరకుసుమంబులం గొనివచ్చెద.

(అందఱు నిష్క్రమింతురు)

(మహారణ్యమున లక్ష్మణుఁడు ఖడ్గపాణియై ప్రవేశించుచున్నాఁడు)

లక్ష్మ.—ఏమో కాని నేఁడు భయంకరశకునము లగుచున్నయవి. ఈవఱకెన్నండు నిట్టి శకునములఁ జూచినదేలేదు. ఈచోటఁజేరి కొంతకాలమాయె. మును లప్పుడప్పుడు వచ్చుచుం బోవుచుంటచే సుఖముగా నుండినది నేఁడేమో మనస్సుత్సాహవంతముగ లేదు. భయము తోఁచుచున్నది. శరశరాసనములు లేనిసమయమున రాక్షసులు నన్నుఁ బీడింపఁ బ్రయత్నించిరాయేమి? ఐనను ఈకరవాలమే చాలును. మంత్రములున్నవి. శస్త్రములేల? రాక్షసుల భస్మముచేయకుందునా. అది యొక పెద్దపనియా. ఏదియెట్లున్నను త్వరగా నింటికింబోయి సీతారామచంద్రుల పాదారవిందముల సేవించినఁగాని సంశయములు తొలఁగవు (అని పూవులం బండ్లను గోయుచు ముందు దృష్టిసారించి) ఆఁ, ఏమది. అద్భుతాకృతి ప్రకాశమున నీయరణ్యమును వెలిఁగించుచున్నది?

చ. ఖరకరుఁడీ మహావనముఁ ♦ గాంచుకుతూహలమొప్ప వచ్చెనో
సరిదధినాథునంతరముఁ ♦ జయ్యనఁ దా విడి బాడబంబు భీ
కరగతి నిట్టిరూపమునఁ ♦ గ్రాలుచు నిచ్చటి కేగుదెంచెనో
సరిగ నిదేయిదం చనఁగఁ ♦ జాలను జక్కఁగఁ జూడఁ జాలమిన్. 7

అబ్బా! కనులు చూడఁజాలకున్నవి. నాప్రయత్నమున లాభము కలుగలేదు. ఈచెట్టుదాపుననుండి చూచెద. (కొంచెముసేపు చూచి) ఔరా! పొరపడితిని. ఇది యొకదివ్యఖడ్గము. తనకాంతులచే నీకాననమును వెలిఁగించుచున్నది. ఏమది? ఆపాదపైని వ్రాలినట్లుండి యంతలోనే పైకిఁ బోవునట్లున్నది. ఏమియాతేజస్సు!

చ. వనరుహమిత్రుతేజము, న♦వారితశక్తిని ధిక్కరించి యీ
శుని నిటలాక్షిపావకుని ♦ శుభ్రమరీచుల వెక్కిరించి వ
జ్రనియుతభూరిదివ్యరుచి♦జాలము నెంతయుఁ జప్పరించి యీ
ఘనతమఖడ్గకాంతులు ని♦కామము గన్పడు నద్భుతంబుగన్. 8

(కనుబొమలపైఁ జేయియుంచి పరికించి) ఔరా! ఏలవచ్చెనో, మరలిపోవుటే లోకో తెలియరాకున్నది, ఇట్టికృపాణమును గని విని యెఱుంగను. (సమీపించి చూచి) పైకిఁ బోవుచున్నయది? దీనిం బట్టుకొనియెద. ఇది యరణ్యవాసమున మా కుపకరించును. (అని తటాలునఁ బట్టుకొని) ఆహా! ఎంతబరువుగ నున్నది? నవరత్నములు పిడిమీఁద స్థాపింపఁబడియున్నవే? ఇది వాస్తవముగా దేవతాకృపాణము. దీనివృత్తాంతము ముందు నాకెఱుకపడఁగలదు. (అని జళిపించుచున్నాఁడు) నేఁటియపశకునములు విపరీతఫలము నిచ్చినవి. ప్రతిదిన మిట్టిదుశ్శకునము లగుచున్నఁ జాలును. ఇట్టిఫలము దొరకుచున్నఁ జాలును. దీని కెంతపదనుగలదో పరీక్షించెద. (అని యాపాదపుఁ దాఁకించును రక్తము ప్రవహించును) అయ్యో! రక్త మెక్కడనుండివచ్చెను? క్రూరమృగ మిందుఁ బరుండి యుండునేమో. తాఁకితాఁకకముందే యీపొదను ఛేదించుటయేగాక యిందున్నఘోరమృగమునుగూడ సంహరించినదే (కొంచెము పరీక్షించి) అక్కటా! అక్కటా! ఇదె యొకశిరస్సు దొరలాడుచున్నది. మునికుమారుని శిరస్సుకాఁబోలును. (కన్నీరునించి) కటకటా!

1 కారణములచే నూహించుట నిది యనుమానము.

సీ. అడవికి రానేల ♦ యశుభఫలంబిచ్చు
    శకునాళిఁ గాంచియు ♦ జంకులేక
వచ్చితింబో యిందు ♦ స్వచ్ఛఫలాదుల
    వెదకక యేల యీ ♦ పొదను గంటి
నొకవేళఁ గంటింబో ♦ యూరకపోవక
    యీఖడ్గమునుఁ గొంటి ♦ నేల నేను
గైకొంటింబో యిట్టి ♦ కత్తిచే నీపొద
    నే నేల చెండితి ♦ మానకిట్లు
తే. నఱికినాఁడనుబో ముని ♦ నాథుఁ డొక్కఁ
డిందు నుండంగ నేల యి ♦ దెల్లఁ జూడఁ
బాపఫలములు నన్నుఁ బొంద ♦ వచ్చుసమయ
మిద్దియేయని తోఁచె నిం ♦ కేమి యందు

ఎట్టికూ్రరకృత్య మొనర్చితిని. ఎంతటి హేయమగుపనిచేసితి. నలుగురు విన్న నేమందురు! మహాపాపకృత్యముకదా యిది.

తే. పాపములలోనఁ బాపంబు ♦ ప్రాణిహింస
యందు మనుజులఁ జంపుట ♦ యధికతరము
మునివరుం జంపు టందును ♦ ఘనతమం బె
యగు నఘం బింతకున్ మించు ♦ నద్దిలేదు. 10

మాయన్న శ్రీరామచంద్రుఁడు విన్న నేమనునో. ఇంకఁ బర్ణశాలకుఁ బోవఁజాల. ఇందే ప్రాణములు విడిచెద. (ఆలోచించి) ఇందే యాత్మహత్యచేసికొన్న మాయన్నగారి కెవరు సేవచేయువారు? (ఊరక నిలువఁబడును)

(ఆకాశమున ధ్వని)

క. క్రూరుం డీతఁడు దనుజకు
మారుఁడు లోకంబునెల్ల ♦ మ్రందింపంగాఁ
గోరినవాఁ డీతనివధ
మారయ నఘమీయఁజాల ♦ దమలస్వాంతా!. 11

లక్ష్మ —(ఆకర్ణించి) వీఁడు రాక్షసుఁడా. లోకముల నాక్రమించి స్వేచ్ఛఁగా హింసింపఁబూనినమూర్ఖుఁడా. ఇంక భయపడ నవసరము గానరాదు. ఈఖడ్గ మేలవచ్చెనో మరలిపోవుట కేహేతువో తెలియకున్నది. మునుల వడిగి తెలిసి

కొని యింటికింబోయి శ్రీరామచంద్రునిపాదారవిందముల సేవించెద. సకల పాపములు నశించు. (ముందుచూచి) ఎవరో మునులువచ్చుచున్నట్లున్నది. (వడి వడి నడిచి) మునులార! నమస్కారములు.

మునులు —(ప్రవేశించి) లోకోపకారపారీణా! చిరాయువునొంది యశస్సు నిల్పఁజాలెడుపుణ్యాత్ముఁడవు కమ్ము.

లక్ష్మ.—(మరల నమస్కరించి) మునికులతిలకులారా! నేఁడు ఫలమూలములు శ్రీరామచంద్రునియాజ్ఞఁ దీసికొనిపోవచ్చితిని. ఈపొదపై నీకత్తి యగపడియె. ఇది మరలి పైకిఁబోవుచున్నట్లగపడియె. పట్టుకొని తెలికగానీపొదను డాఁకించితి. దీనిధారచేఁ బొద త్రెంపఁబడియె. అందులో నీతలయొకటి కనఁబడియె. తెలియకచేసితి మిగుల వగల వందురుచున్నవాఁడ. దీనికలరూపుం దెలిపి నన్నుఁ గృతకృత్యుం జేయుఁడు.

మునులు.—లక్ష్మణా! ఈతఁడు మునికుమారుఁడని భ్రాంతిపడి యిట్లడుగుచున్నట్లున్నది. వీఁడు మునియే కాదు. మహాపాపాత్ముఁడు. క్రూరుఁడు. దుర్బుద్ధిమూని సూర్యునింగూర్చి తపస్సుచేయుచున్నవాఁడు. సూర్యుఁడే యీఖడ్గమును బంపెను. గర్వంబున సూర్యుఁడు తానైరాక దీనిం బంపెనా. నాకువలదు పొమ్మని యితఁ డీఖడ్గమును దిరస్కరించెను. అది పైకి మరల సూర్యలోకంబునకుం బోవుచుండి నదృష్టవశంబున నీవు పరిగ్రహించితివి. గర్వించి సూర్యాయుధము దిరస్కరించెనుగాన వీఁడే తెగియె. శూర్పణఖయను క్రూరరాక్షసికుమారుఁడు వీఁడు. వీనింజంపి నీవు లోకోపకార మొనర్చితివి మనుష్యస్పర్శమున నీఖడ్గ మింకఁ బైకిఁ బోఁజాలదు. నీకుం దక్కసదని నమ్ముము. పాపము వచ్చెనని భయంపడకుము. నీవిందు మసలవలదు. వీనితల్లి అన్నము తెచ్చుసమయము కావచ్చుచున్నది. అది రాకముందే పొమ్ము. గోదావరిలో స్నానముచేసినఁ బరిశుద్ధుఁడ వగుదువు. వత్సా! మనస్సున నించుకంతయు భీతిల్లకుము. ఇదే మేము బోవుచున్నాము. అకూ్రరరాక్షసికంటఁ బడితిమా. భక్షించి పోవును.

(అని యందఱు నిష్క్రమింతురు)

(శూర్పణఖ కుమారున కన్నము తీసికొని పొదయొద్దఁ బ్రవేశించుచున్నది.)

శూర్ప —వత్సా! కులోద్ధారకా! కుమారా!

సీ. మునికుమారులఁ దెచ్చి ♦ తనివారఁగా వండి
    తెచ్చితి నీకు సం ♦ తృప్తిఁ గూర్ప

గోదావరీమహా♦ప్రోదినీమీనంబు
    లను వండి తెచ్చితిఁ ♦ దనయవర్య!
యందందు విహరించు♦నట్టి మృగంబుల
    వండి తెచ్చితి నీకుఁ ♦ దిండికొఱకుఁ
గోరిక మీఱంగ ♦ సారశాకంబులఁ
    గొనివచ్చితిని నీదు♦కోర్కి దీర్ప
తే. నాయనా! లేచిర మ్మిఁక ♦ నాకు ముదముఁ
జిక్కఁ గూర్పుము తపమిది ♦ సాగుఁగాదె
విఘ్నములు లేక సిద్ధి నే♦వేళఁ గాంచు
నన్నెపుడు ప్రీతి నలరింతు♦వన్న చెపుమా. 12

ప్రొద్దుపోయిన దనుకొనకుము. మంచియాహారము దొరకినదని సంతోషింపుము. నీతపస్సు ఎప్పుడు ఫలించునో శత్రుసంహార మొనరించి యెప్పుడు నాకు మనస్సుఖంబు గల్పింతువో యని యువ్విళ్లూరుచున్నదాన. దేవతలంబట్టి బంధించి యక్షసిద్ధసాధ్యవిద్యాధరగరుడగంధర్వులం బట్టితెచ్చి సేవకులుగ నొనరించి నీవు యశస్సునొంద హాయిగా నెపుడుందునా యని కనిపెట్టియున్నదానరా నాయనా. (ముందునడిచి) ఏమియీపొద క్రిందఁబడినది? నాకుమారుఁడున్నపొద యిదికాదా యేమి? (నాలుగుప్రక్కలం గాంచి) ఈపొదయే నాకుమారుఁడున్నయది. గుఱుతులన్నియుఁ జక్కఁగా నున్నవి. ఇదియే. సంశయములేదు (చక్కఁగాఁ బరీక్షించి చూచి) ఇందేలొకో రక్తధారలు ప్రవహించినట్లున్నవి? ఇపుడిపుడే ప్రవహించి గట్టిపడిన ట్లగపడుచున్నవి. ఎవరిదీనెత్తురు? చాల వింతగనున్నదే (చక్కఁగా వెదకిచూచి కొడుకుతలను బరికించి) హాకుమారా! ఏమిరా నాయనా. నిన్నెవఁడురా చంపినది. కులము నుద్ధరించి తండ్రిపేరు నిలిపి నాకు మనస్సంతోషముఁ జేయుదువని నమ్మియుంటినిగదా కుఱ్ఱా! నిన్నేపాపాత్ముఁడు చంపి పాఱిపోయెనో తపస్సు చేయుచు నితరులజోలికింబోని నిన్నుం జంపినమహాద్రోహి, మహాపాపాత్ముఁడు, కర్మచండాలుఁ డెవఁడురా నాయనా! (అని యేడ్చుచు దిక్కులు గలయం జూచి) ఓవనదేవతలారా! నే నెవ్వతె యనుకొనుచున్నారో. ముల్లోకముల జయించి కైలాసము పుట్టచెండుగా నాడించి యీశ్వరుని మెప్పించి దిక్పాలకుల యుద్ధమున సిగ్గుపడంజేసి యింద్రుని వేయిసంవత్సరములు చెఱసాలలో నుంచి జగదేకవీరుఁడనం బ్రఖ్యాతిఁ గాంచిన రావణాసురుని తోఁబుట్టువను.

శూర్పణఖ యనుదాన. ఖరదూషణాదులు పదునాలుగువేల మహాశూరులు నాతోఁబుట్టువులు ఇట్టి నాకపకార మొనరించి యెవఁడు లోకమున జీవింపఁ గలఁడు? మీరింతకుముందు మాయన్నతో యుద్ధముచేసి యోడిపోతిరి పాపము పోనిమ్మని మాయన్న మిమ్ముం జంపక విడిచినాఁడు. నేఁ డట్లుకాదు. నాకోపాగ్నికి మిమ్మాహుతి సేయక మానఁడు జాగ్రత్తగ నుండుఁడు నాకొడుకు నెవరు చంపిరో తెల్పుఁడు వానిం జంపించి మీప్రాణముల నిల్పుకొనుఁడు. దిక్పాలకులారా! ఇఁక మీయధికారము పోయినదనుకొనుఁడు. నాకొడుకువార్తను ద్వరగాఁ దెలిపి మీభార్యలమెడలోనున్న మంగళసూత్రముల నిల్పుకొనుఁడు. లేకున్న నవియుండవు. ఏమిపలుకకున్నారు? వీరికి గ్రహచారముచాలదేమో (అని యాక్రోశించుచు) ఓనీచములారా! దుష్టమునికుమారులారా! నాకపకారముచేయుట, పెద్దపులిమీసములఁ బట్టి యూఁగులాడినట్లే. సింహముకోఱల ముద్దుపెట్టుకొన్నట్లే. పిడుగును మ్రింగినట్లే కొఱవితోఁ దలను గోకికొన్నట్లే. జాగ్రత్త! జాగ్రత్త! (అని గట్టిగా నార్చుచు) ఏమిరా ఎవ్వఁడును మాటలాడకున్నాఁడు! దేవేంద్రుఁడా సిగ్గులేదా. మాలంకలోఁ గారాగృహమున నెంతకాలముంటివి? ఈపర్యాయము విమోచనము లేనేలేదు. (మరలఁ గొడుకుతల చూచి) అయ్యో! నాయనా! నీజోలికేపాపాత్ముఁడువచ్చెరా? వత్సా! నాగతియేమి నాయనా. ఒక్కమాటయైనఁ జెప్పిపోరా తండ్రీ! నిన్న మొన్నఁ దపస్సుత్వరలో ఫలించునంటివే. నేఁడిట్లు పలుకకున్నాఁడవేమి? నాపై నాగ్రహమా. అన్నము ఆలస్యముగాఁ దెచ్చితినని కోపమా. పల్కవేమిరా కుఱ్ఱా. నిన్నునమ్మి భర్తలేనిదుఃఖమును మఱచియుంటినిగదా. ఇట్టి నన్నీలోకమున విడిచి యొంటిగాఁ బోవుట ధర్మమా. న్యాయమా. నాయనా! నిన్ను నమ్మియున్న నన్ను దిక్కులేనిదానినిగాఁ జేసి నీసుఖమునుమాత్రమే చూచుకొనిపోవుట మంచిదియా పుత్రకా! (అని కొడుకుతలను స్పృశించి) నిశ్చయముగా నాకొడుకు చచ్చిపోయినాఁడా. (చక్కఁగాఁ జూచి) అయ్యో! ఇంకేమికొడుకు? నేత్రములకాంతియు, ముఖవర్చస్సుగూడఁ జెడిపోయినదే. ఇఁక నాగతియేమి? ఎవరు నన్నమ్మాయని పిలుతురు? నాకెవరుదిక్కు? నన్ను సంతోషపెట్టువాఁ డిఁక నెవఁడున్నాఁడు? (మూర్ఛపోయి లేచి మహాగ్ర

౧౩. (పాట)

హముతో) ఈసమీపమందున్నమునులే చంపియుందురు. రాక్షసుఁడితఁడు తపస్సుచేసినలోకముల కపకారముగల్గునని యీఘోరకార్యమును జేసియుందురు,

లేకున్న నిచ్చటి కెవఁడు క్రొత్తవాఁడు వచ్చినాఁడు? ఇంకను రక్తము నలుపెక్కలేదు. కాఁబట్టి రెండుగడియలక్రిందనే యీపని జరిగియుండుననుట నిశ్చయము. ఇఁక నూరకయున్నఁ జేతగానిదానినిగా భావింతురు. (పండ్లు పటపటలాడించి) మునులారా! తొలియాహారము మీరు నాకగుదురు. ఇంక మిమ్ము విడుచుట పిచ్చిపని. మీశిరస్సులఁ బగులించి నాకొడుకుఁ జంపినపగఁ దీర్చుకొందును. అంత యాలస్యమేల? గుటుక్కున మిమ్మెల్ల మ్రింగెద. (అని యార్చుచుఁ బరుగెత్తుచున్నది)

(మునులు ప్రవేశింతురు)

మునులు.—(మహాభీతితో వడఁకుచు) శూర్పణఖా! ఎవఁడో క్షత్త్రియకుమారుఁడు ఖడ్గపాణియై యీపాదను నఱికెను. నీకొడుకుశిరస్సు తెగిపడినది. ఈమార్గమునఁ బోయిన గోదావరిచెంత నొకపర్ణశాల కనఁబడును. అందుండిన రాజకుమారుఁడే నీకొడుకు జంపినవాఁడని తెలిసికొనుము. అతఁడు రాక్షసులం జంపుటకై వచ్చినాఁడఁట. నిరపరాధుల మమ్ముం జంపిన నీకేమిలాభము గలదు? నీకొడుకుం జంపి హాయిగానున్న యారాజకుమారుం జంపిన నీపగ వాయును. నీప్రతాపము చెల్లును. నీశక్తి కనఁబడును. ఏమియుఁ జేతగాని బ్రాహ్మణుల మమ్ముం జంపిన నీకించుకయైన లాభముగల్గునా? విరోధము పోవునా? పరాక్రమము విఖ్యాతిఁ గాంచునా? తలంపుము. దయలేకున్న రాజకుమారునిం జంపుశక్తి లేకున్న మమ్ముం జంపుము.

శూర్ప.—నాకొడుకుం జంపినవాఁడు రాజకుమారుఁడా? రాక్షసులం జంపవచ్చి యిందున్నాఁడా? పంచవటీతీరమునఁ గాపురమా. వంటయింటఁ గుందేలు ప్రవేశించినట్లాయె. ఇప్పటికి మీరు బ్రదికితిరి అక్కడికింబోయిచూచెద. వాఁడందులేకున్న మిమ్ము మ్రింగెద.

(అనుచు నిష్క్రమించును.)

(రాముఁడు సీతాలక్ష్మణులతోఁ బ్రవేశించుచున్నాఁడు.)

రాము.—జానకీ!

చ. మునిపతియా నగస్త్యుఁడు ప్ర♦భూతదయామతి యీశరాసనం
బును పరబాణసంతతులఁ ♦ బొల్చెడుతూణయుగంబుఁ బ్రీతిని
చ్చెను సకలక్షపాచరుల ♦ చేవయడంగఁగఁ జేయఁజాలు నీ
ధనువు మహత్తరంబు సుర♦తల్లజసన్నుత మోతలోదరీ. 13

సీత.—ప్రాణనాథా! ఈశరాసనంబు మునిపతియిచ్చినపుడు పరమపతివ్రతాశిరోమణి యగు లోపాముద్ర నవ్వుచు జయసిద్ధులు గలుగుఁగాక యని యాశీర్వదించెఁగదా అప్పుడే నాకును మున్నెన్నఁడులేని యానందము కల్గినది.

రాము.—అత్రిమహామునియు నగస్త్యమునిపతియు నాకును, ననసూయాలోపాముద్రలు నీకును మంగళాశీర్వచనములు ప్రసాదించిరికదా ఆవాక్కులమోఘములు. నిరుపమానములు. సకలకష్టాపనోదనక్షమములు.

సీత.—నిశ్చయమే ప్రాణేశా! మనమీయరణ్యమును బ్రవేశించినప్పటినుండియు రాక్షసులబాధలు తగ్గి మునులు హాయిగానున్నట్లు మునిపత్నులు గోదావరికి స్నానమునకువచ్చి నాతో మందలించుచుందురు. లోకోపకారము చేయక భోగములనే యనుభవించు రాజ్యాధిపత్యమునకంటె సజ్జనుల కుపకారముచేయుచు నియ్యటవి నుండుటయే. మేలని నాభావము.

రాము.—(చిఱునవ్వు నవ్వి) జానకీ! సాధ్వీమణీ! నాదేయదృష్టము. వినుము. చెప్పెద.

చ. పెనిమిటి చేయుకార్యములు ♦ ప్రీతిని మెచ్చుచు నవ్వి సాగఁగా
మనమున నెంచుచుం బతియె ♦ మాధవతుల్యుఁడటంచు నెంచునా
వనితయె లోకమందెపుడు ♦ భద్రయశంబులఁ గాంచునట్టియా
వనరుహనేత్ర పత్నిగల♦వాఁడె మహత్తరభాగ్యశాలియా. 14

ఇంకొక్కమాట వినుము.

సీ. భూషణంబులు లేవు♦పోపొమ్మటంచును
మోముఁ ద్రిప్పెడునట్టి ♦ ముద్దుగుమ్మ
మంచిచీరలు లేవు ♦ మగఁడ యే మిదియని
యీసడించెడునట్టి ♦ యింతిమిన్న
హర్మ్యములే లేవు ♦ హాయిగా వసియింప
నని కోపమందెడు ♦ నలరుబోఁడి
పల్లకి లేదింటఁ ♦ బక్కున నవ్వరే
యొరు లటంచాడెడు ♦ సరసిజాక్షి
తే. భర్త నెప్పుడు తీవ్రవా♦గ్బాణములను
నొవ్వఁగాఁ జేయువగలాడి ♦ యెవ్వని కిల
భార్య యగునో యతండె ని♦ర్భాగ్యుఁ డరయ
వాని జీవితమే రోఁత ♦ వరగుణాఢ్య! 15

సీత.—(పక్కున నవ్వి) నాథా! అట్టి స్త్రీలుగూడ భూమియందుందురేమో.

రాము.—జానకీ! తఱచుగా లేరుగాని యుండకపోరు.

సీత.—మనకాలమున నట్టివారు లేకుందురుగాక. ఉన్నను వారు పరమపతివ్రతలగుదురుగాక.

రాము.—(దృష్టిసారించి) జానకీ! ముందెవ్వతయో నిలుచుండి మనలఁ జూచుచున్నట్లున్నది.

(శూర్పణఖ దూరమున నిలువఁబడియుండును.)

శూర్ప.—(తనలో) ఎవరువీరు? మనుష్యులా కారు. మనుష్యులకీసౌందర్యము లభించునా? దేవతలా కారు. ఈనేత్రసౌందర్యము దేవతలకెక్కడిది? ఇంకెవ్వరుగానుందురు? నే నింతకుమున్ను గంధర్వకిన్నరకింపురుషులను, సిద్ధవిద్యాధరులను, గరుడోరగాదులను, బెక్కుపర్యాయములు చూచియున్నదాన. వారికీయందము లేనేలేదు, నాచూడనివారెవ్వరు? త్రిమూర్తులకీసౌందర్యము కలదా? ఇంక వీరెవ్వరైయుందురు? క్రొత్తగా సృజింపఁబడిరనియే చెప్పవలయు. వీరిచెంతనున్న యీతరుణీమణిసౌందర్యము నెవరు వర్ణింపఁగలరు? త్రిమూర్తులభార్యలకీమెలావణ్యమున నించుకయుండిన నెట్లుందురో? రతీదేవి యీమెకుఁ బరిచర్య చేయుటకైనఁదగదు. అబ్బా! ఈరూపముగలవారిం జూచుచుండినఁ జాలదా? పోయిన కొడు కింక రాఁబోఁడు. వానికై దుఃఖించిన లాభమేమి? ఈపురుషులలో నొక్కరునిం గూడిన స్వర్గము నాకెందులకు? ఈపాడురూపమునఁ బోయిన వారు భయంపడుదురు. చక్కనిరూపమును ధరించుకొనియెద. (అని యొకయచ్చర యిన్నగా మాఱును)

౧౮, (పాట.)

(మాయశూర్పణఖ ప్రవేశించుచున్నది.)

శూర్ప.—(రామునిం జేరఁబోయి)మహాత్మా! మీరేదేశమునుండివచ్చితిరి? కులమెయ్యది? ఎందుల కిచ్చట నున్నారు? ఈభీకరారణ్యమునఁ గ్రూరరాక్షసులు వసించుతావున మీరుండఁ గారణమేమి? ఈవనిత నీకేమికావలెను? దూరముగా నిలుచున్నయాతఁ డెవ్వఁడు? నిజము చెప్పుడు. వినఁగోరి యడిగితిని.

రాము.—

క. కోసలదేశము మాయది, యోసరసిజనేత్ర! రాజ్య♦మొయ్యన జననీ
శాసనమున విడివచ్చితి, మీసరణిం గొంతకాల♦ మిందువసింపన్.

తే. దశరథునిపుత్త్రులము సహో♦దరుల మేము
నెలఁత యిది నాదుపత్ని రా♦జులము సుమ్ము
క్రూరరాక్షసు లున్న మా♦కుఁ భయంబు
కలుగ దించుకయును విను♦ కమలనయన!. 17

మాచరిత్రమంతయు నిదియు నీవెవ్వతెవు? ఒంటరిపాటున నిందేల క్రుమ్మరియెదవు? క్రూరరాక్షసు లుందురంటివే నీకేల భయము గల్గకున్నది? సాధ్వీ! నీవృత్తాంతమును వినఁగోరితిని.

శూర్ప.—మహాత్మా! నావృత్తాంతమును వినుము.

చ. మునిపతి విశ్రవుం డనఁగ♦ భూరియశంబును గన్నమేటి యో
జనవరపుత్త్ర! వెల్గు నిల♦ సత్త్వగుణాభరణుండు సుమ్ము త
త్తనయను నేను దండ్రి వర♦దానము పెంపున నెందునైన భీ
తిని గనకుండఁగాఁ దిరుగఁ♦ దేఁకువ గల్గినదాన నెంతయున్. 18

ఉ. కన్నియ నేను జుమ్ము కల♦కాలము స్వేచ్ఛఁ జరించుదాన నా
కన్నిట నేర్పుమించు భువ♦నాళిని గాంచుచు నుందు నే నిటన్
నిన్ను మనోజ్ఞరూపగుణ♦నీరధిఁ జూచితిఁ బ్రీతిగల్గె నీ
మన్ననఁ గాంచ నెంచితిని♦ మానకు ప్రోవుము రాజనందనా!. 19

నాపేరు కాంచనమాల. ఇంతకాలమునుండి సకలలోకంబులం గ్రుమ్మరితిని. నీవంటిసమన్మథమూర్తిని జూచునదృష్టము లభింపదయ్యె. స్వప్నమునందైనను నీవంటిలావణ్యవారాశిని జూచి యెఱుఁగను. ఇంతదనుకఁ గాపాడుకొనిన కన్యకాత్వము నేఁడు వదలుకొన నిచ్ఛగలిగె. తండ్రియాజ్ఞయు నిట్లే. నానోములు నేఁటికి ఫలించినవి. నాకోరికలు నిండినవి. నన్నుం బరిగ్రహించి పుణ్యమ్మును గట్టుకొనుము. విశ్రవసుఁడు మహాతపశ్శాలి. అతఁ డానందించునంతకంటె మేలున్నదే. మాఱుమాటాడక యంగీకరించి నాతో సుఖింపుము. పితృదత్తవరప్రభావమునఁ గామరూపములఁ దాల్పనోపుదు. ఎట్లుకోరిన నట్లుండఁగలను.

రాము.—(తనలో) ఇది మాయలాడి. రక్కసియో కాదో నిర్ణయింపఁజాల. వాక్కులనుబట్టి మాయాశాలినియని తోఁచెడిని ఇది నన్నుఁ గోరినది ఇప్పుడే నిరాకరించుటకన్న నించుకసేపు కాలక్షేపము చేయుమాటలాడెద తరువాతఁ గాని దీనివాస్తవవృత్తాంత మెఱుకపడదు. (ప్రకాశము) అంగనామణీ!.

తే. ఏకపత్నీవ్రతుండ నీ◆యింతి నన్ను
నమ్మియే వెంటవచ్చెఁ గా◆ననవివాస
మైనఁ గానిమ్మటంచు; నా◆యనుజుఁ డాతఁ
డొంటిగా నున్నవాఁడు యా◆పోన్నతుండు. 20

ఆతనిం బ్రార్థింపుము. నాకంటెఁ జిన్నవాఁడు. భోగంబు లనుభవించి తృప్తి నొందినవాఁడు కాఁడు.

శూర్ప —(గిరుక్కునఁ దిరిగి చని లక్ష్మణుం గాంచి) రాజకుమారా! మీయన్న నిన్ను

౧౫. (పాట)

వరింపుమని పంచె పెద్దవారిమాట దాఁటకుండుటయే చిన్నవారికి ధర్మము.
నావంటికన్నియ నీకు లభించుట దుర్లభము అదృష్టవశమున లభించితిని

లక్ష్మ.—చేలా! నే నాయనకు దాసుఁడను. ఏపనులు చెప్పినను జేయుచుండువాఁడ. ఆహారనిద్రలు మానినవాఁడ. ఇట్టినాతో నీకేలాభము గలుగదు. ఇంతియగాక నాతోడ నీవును సేవింపవలసివచ్చును. ఇంతయందగత్తెవై మాయన్నకు వదినెకు నుపచారములు చేయుచుండిన నీకేమిగౌరవము కల్గును? నీసౌందర్యమును జూచి రాముఁడు మోహించును. ఊరక నేనేపనుకొందునో అని నీతో నట్లు పల్కినాఁడు. నీవే యించుక యాలోచించుకొనుము. మరల అతని నే యాశ్రయింపుము. ఈపర్యాయము గట్టిగా నడుగుము. ఏమియాజ్ఞ సేయునో ఆరీతిగ నడుచుకొనియెద. నామాట నమ్ముము, పొమ్ము.

శూర్ప.—(ఇంచుక కోపముతో మరలివచ్చి) రామా! అతఁడు పిన్నవాఁడు. నీకుం దాసుఁడు. నీయొద్దకే పొమ్మనియెను. ఏమందువు?

రాము.—ఇంతీ! నేనేమందునోయని యాతఁడించుక సంశయించిన ట్లగపడుచున్నది. సవతిపోరు కష్టములలోఁ గష్టము. ఇది నీకుం దెలియదా. నన్నే వరించితివా యీసీతయాజ్ఞకు లోనై మెలఁగవలయుఁగదా. కావున నీకేకష్టము. అగౌరవము.

శూర్ప.—రామా! పులస్త్యమునిసంతతిం బుట్టి త్రిజగద్విఖ్యాతచారిత్రునకుం బుత్రినై కామరూపిణినగు నేను గోరిన నిట్లు పరిహాసము లాడెదవా? ఈ నెలఁత చెంత నుండఁబట్టికదా నన్ని ట్లాడించుచున్నవాఁడవు ఇది యుండఁగ నాకన్నమిన్నయా? అందును మనుష్యకాంత. నన్నుం బరిగ్రహించితివా నీవెచ్చటికిఁ బోవలయునన్న నాక్షణంబ చేర్చెద. ఎట్టిరూపమును జూడఁగోరిన నట్టిరూపమును బొడఁగాంతు. ఇట్టినన్ను సామాన్యస్త్రీనిగా భావించితివా చూడు నాశక్తి.

రాము.—పులస్త్యసంతతిం బుట్టినదానవా? నీవు రాక్షసివా యేమి?

శూర్ప —నేను రక్కసిని గాను. పులస్త్యమునిసంతతిలో దేవతలుగూడఁ గలరు. రాక్షసు లొకతెగవారు. మాపూర్వులు రాక్షసులు కారు. మాది పవిత్రవంశము.

రాము.—నీపలుకులు సంశయము నినుమడింపఁ జేయుచున్నవి. ఏమైనఁగానిమ్ము. నీవా లక్ష్మణునిం గోరుము. వాఁడు నీకోరికఁ దప్పక తీర్చును. (అని నవ్వును)

శూర్ప —(ఆగ్రహించి) మునిమునినవ్వులతో నేమేమో మాటలాడుచున్నావే. ఈయింతి చెంతనుండఁబట్టి నీవిట్లు విచ్చలవిడి మాటలాడుచున్నవాఁడవు. దీనిని మ్రింగెద. (అని దగ్గఱకుం బోవును)

రాము —(ఆత్మగతము) ఇది నిక్కముగా రాక్షసియే దీనిమాటల కప్పుడే సీత వడఁకుచున్నది. ఆలస్యము చేయరాదు. తగినప్రాయశ్చిత్తము చేయించినఁగాని యిది వదలదు (ప్రకాశము) ఇంతీ! నామాట విను. ఈపర్యాయ మాతనియొద్దకుం బొమ్ము. నేనే నిన్నుచితరీతి గౌరవింపుమని చెప్పెద.

శూర్ప.—ఈపర్యాయ మాతఁడేమైన నభ్యంతరములు పల్కినా యీమనుష్యకాంతను మ్రింగెద. (అని గిరుక్కునఁ బోవుచున్నది)

రాము.—లక్ష్మణా!

క. [1]ఇది యాసురకామినియాఁ, గదదీనిం ద్రిప్పనేల ◆ త్మాపుత్రిమనం
బదరుచునున్నదివికృతిం, గుదురుపడం జేయవయ్య◆కొంకకుమింకన్.

శూర్ప —(లక్ష్మణుని చెంతకుంబోయి కోపముతో) ఇప్పు డేమనియెదవు? నన్నుఁ బరిగ్రహింతువా లేదా?

లక్ష్మ.—కామరూపిణీ! మాయన్నయాజ్ఞరీతి నీకుఁ దగినమర్యాద నొనరించెద. (అని నూతనఖడ్గమున ముక్కుచెవులు కరుక్కునఁ దెగఁగోయుచున్నాఁడు)

(శూర్పణఖ నిజరూపమును దాల్చును.)

శూర్ప.—(నాసికాకర్ణవిహీనయై తనరూపమును దాల్చి రక్తము ధారలుగాఁ గాఱ మండ నార్చుచు ముక్కుడీమాటలతో) ఇంక మిమ్ము రూపుమాపెద చూడుఁడు మాయన్నలైన ఖరదూషణాదులకుం జెప్పి మీమాంసమును వండించుకొని తినియెద. నేను రావణాసురునిచెల్లెలను. శూర్పణఖయని నాపేరు. (అని పైఁబడఁబోవును)

లక్ష్మ.—ఇంక నిట మసలినచో నీగతి యేమగునో తెలియఁగలదు. (అని ఖడ్గమును మరల గ్రహించి జళిపించును)

(శూర్పణఖ పరుగెత్తుచున్నది.)

రాము.—లక్ష్మణా! ఈయుద్యమము నీవు చంపినవానితల్లియగు శూర్పణఖ యిదియేయని

---

1 సంరబ్ధవచనమగుట నిది తోటకము.

స్పష్టమాయె. ఈచెంతనే జనస్థానమున ఖరదూషణాదులు కలరని వినియుంటిమి. ఇదిపోయి తనరూపము చూపఁగనే [1]వారు యుద్ధసన్నద్ధులై వత్తురు. ఇంత వఱకు నేచిక్కులు లేకయుంటిమి. ఇపుడు దీనికి మునుతే మనజాడలఁ దెల్పియుందురు. వంచనమెయి మనచే రాక్షసులం జంపింపఁ దలఁచినట్లున్నది. ముందేమిజరగునో చూడవలసియున్నది.

లక్ష్మ.—రామచంద్రా! యుద్ధమునకు రాక్షసుల నిది తోడుకొనివచ్చునా, లేక బ్రదికినదే చాలునని మరల రాకుండునా.

రామ.—[2]ఇది రాక్షసుల ననేకులం దోడుకొనివచ్చును. మన మవార్యదోర్వీర్యమును జూపి వారి నున్మూలింపక తప్పదు. మనతాత్పర్య మిదియేకదా.

లక్ష్మ.—మనమిఁక యుద్ధమునకు సిద్ధపడవలసినదియేకదా.

రామ.—(కోపముతో) సంశయమేల? అగస్త్యమునీశ్వరదత్తచాపతూణీరములం దెమ్ము

లక్ష్మ.—రామచంద్రా! నీవు జానకీసంరక్షణతత్పరుండవై లోపలనుండుము. నేనే వచ్చు రాక్షసులఁ జక్కాడెద.

రామ.—వత్సా! అంతటిభారము నీపై మోపఁజాలను. మీవదినెను దిలుచుకొని యల్ల కొండగుహాలోనుండుము. నేను క్షణమాత్రమున రాక్షసుల నున్మూలించి పిల్చెద.

లక్ష్మ.—రామభద్రా! చిరకాలమునుండి నాకు మీరుచూచుచుండ వైరులఁ బోరాఁడి మీకు సంతోషమును గూర్పవలయునను కోరిక గలదు. దానిం దీర్పవలయు.

రామ.—నాయనా! నీకోరిక తీర్పఁదగినదే. సీత యిటనుండిన రాక్షససంహారము కనఁబడక తప్పదు. భయపడఁగలదు. నిన్నొంటిగనునిచి నేను దూరమున నుండఁజాలను. కాన మాఱుమాటాడక నీవిప్పుడే జానకిం దోడుకొని యల్లగుహాలో నుండుము. నీవు చెంతనున్న జానకి భయంపడకుండఁగలదు. నేనశ్రమంబున శత్రువులం జంపి చెండాడెద.

లక్ష్మ.—మీరే యుద్ధముచేయవలయునని యభిప్రాయమా. కొంచెమునేని [3]మాటను నన్నువిడువ సమ్మతించుట కింకొక్కపర్యాయ మాలోచింతురా.

రామ.—[4]నేను నీతోఁ జెప్పినమాట త్రికరణశుద్ధిగాఁ జెప్పినదనియే నమ్ముము.

లక్ష్మ.—తమయాజ్ఞ శిరసావహించెద.

(అందఱు నిష్క్రమింతురు)

[5] (ఇది గర్భసంధి)

ఇది తృతీయాంకము

---

1 ఇష్టజనాతిసంధానమగుట నిది యుధిబలము.
2 అరణ్యవాసఫలితకథను జెప్పుటచే నిదిపతాక.
3 ఇదియే ప్రాప్త్యాశ.
4 గర్భబీజసముద్ఘాటనరూపమగుట నిది యాక్షేపము.
5 పతాకాప్రాప్త్యాశానుగుణముగ సాంగముగ గర్భసంధి యభిహితము.

చతుర్థాంకము.

(దేవేంద్రునిపరిచరుఁడగు విక్రముఁడు ప్రవేశించుచున్నాఁడు.)

విక్ర:—(తనలో) ఆహా! నేఁటికిఁగదా శుభవార్త మాయధిపతికిం జెప్పనోఁచితిని. చక్కనిబహుమానము నొందఁజాలితిని. ఇంద్రుఁడుమహానందమును బొందును. చిరకాలమునుండి రగులుచున్న దేవతాహృదయతాపాగ్ని నేఁటికిఁ జల్లార నొంద లిడును. (చూడ్కినిగుడించి) నాసఖుఁడగు శ్రుతకీర్తి వచ్చుచున్నట్లున్నది. (అని యెదురుగాఁ బోవుచున్నాఁడు.)

శ్రుత:—(ప్రవేశించి) మిత్రుఁడా! విక్రమా! నిన్నుఁజూచి ఎన్నిదినములో యైనట్లున్నది. విశేషవార్తలేవి?

విక్ర:—నీవెపుడు వచ్చితివి? ఇపుడెచ్చటినుండి రాక. నీవు చూచినవిషయములేవి?

శ్రుత:—మూఁడుదినములనుండి యింద్రాజ్ఞ ననుసరించి రామాదులవృత్తాంతమును గనఁగొనఁ దండకారణ్యమెల్లఁ దిరుగుచున్నాఁడను. వారుమాత్రము గానరాలేదు.

విక్ర:—అయిన నీకేమియు విశేషములు తెలియవనియే తెలియవచ్చెను?

శ్రుత:—నిశ్చయముగాఁ దెలియవు.

విక్ర:—విశేషముల నేఁజెప్పెద వినుము. త్వరలో శ్రీరామచంద్రుఁడు రావణా[1]సురుని వధించి దేవతాతాపమును దీర్పఁగలఁడు. ఇట్టిశుభవార్తలఁ దెలియక యరణ్యములపాలై యుంటివేల?

శ్రుత:—మిత్రమా! తిరిగి తిరిగి వేసరితిని. వారుండుతావే నాకుం గానరాలేదే. పోనీ రామునివృత్తాంతమెట్లు? చెప్పుము.

విక్ర:—రావణునిసోదరియగు శూర్పణఖ రామునిం గోరి ప్రార్థించి ఫలముగావక లక్ష్మణుం గాంక్షించి విఫలమనోరథయై సీతను మ్రింగఁబూనఁగా రాముననుమతిచే లక్ష్మణుఁడు దాని ముక్కుచెవులు ఖండించెను.

శ్రుత:—(ముక్కుమీఁద వ్రేలుంచుకొని) సెబాసు! చక్కఁగాఁ గుదిరినద్దే. ఆమీఁదని?

---

1 సంతోషవశమున నియతాప్తి ప్రదర్శనరూపముగాఁ గథాబీజమును మరల విమర్శించుటచే విమర్శసంధి యారంభింపఁబడియె. దోషప్రఖ్యానముచే నిది యపవాదము.

విక్ర:—ఆపాపాత్ముఁరా లేడ్చుచుంబోయి ఖరాదుల కీవార్తం దెలిపెను. పదునాలుగు వేలరథికు లొక్కమొగి వచ్చిరి. కాని రాముఁడు ముహూర్తమాత్రమున వారిని నామావశిష్టులనుగాఁ జేసెను.

శ్రుత:—జనస్థానము శూన్యమైనదియా.

విక్ర:—సందేహమా. దానవులపురు గొక్కటియుఁగూడ నందులేదు.

శ్రుత:—సంతోషవార్త తెల్పితివి. శూర్పణఖ యేమాయె?

విక్ర:—శూర్పణఖ లంకానగరంబునకుం బోవుచున్నది.

శ్రుత:—మనము నదృశ్యరూపములతోఁ బోయి యాందలివృత్తాంతములం గాంచి యింద్రున కీవార్తల నన్నింటి నెఱింగించి బహుమానముల నొందుదము.

విక్ర:—నేను నదియే యోజించుచున్నాఁడను. ఆరాక్షసి యీవఱకు సముద్రము చెంతకుం బోయి యుండును. మనమంతకంటె ముందే పోయి వేడుకం గాంచి యావృత్తాంత మింద్రున కెఱింగింతము. పోదమురా.

(అని యిరువురు నిష్క్రమింతురు)

(ఇది ప్రవేశకము)

(లంకలో రావణుఁడు నిండుకొలువున నుండును.)

౧౭. (పాట)

రావ:—ప్రహస్తా! వరుణుఁడు మనకుం గప్పముఁ దెచ్చి యిచ్చినాఁడా.

ప్రహ:—ఈశ్వరుఁడుతప్ప దక్కినదిక్పాలకులెల్ల మీయానతి శిరసావహించి కప్పములు సకాలమునఁ గట్టుచున్నారు. ఇంద్రుఁడు పంపిన రత్నహారము తమపాదపీఠముచెంత నుంచఁబడియున్నది.

రావ:—(రత్నహారమును జూచి) ఇది చక్కఁగనే యున్నది. ఇంతకాలమునకు నింద్రునకు బుద్ధివచ్చినట్లున్నది

ప్రహ:—రాక్షసనాయకా! యముఁడు పంపిన మణిహార మిదియే.

రావ:—సెబాసు! మిక్కిలి చక్కఁగానున్నది.

జంబు:—దిక్పాలగర్వాపహారకా! దశకంఠప్రపంచపాలకచూడామణీ! వరుణవాయుకుబేరులు సమర్పించిన ద్రవ్యరాసులివిగో. నిఋతిపంపిన యుత్తమాశ్వములు పదివేలు వాజిశాలయందున్నవి.

రావ:—బళీ! దిక్పాలకులు బుద్ధిమంతు లగుచున్నట్లున్నది.

రక్తరోముఁడు:—రాక్షసేంద్రా! దేవతలు పదివేలమంది తమయానతిం దలలం దాల్చి

యుద్యానమునఁ బనిసేయవచ్చియున్నారు. పూలచెట్లు శాస్త్రరీతిఁ బోషింపఁబడుట కేర్పాట్లు చేయఁబడినవి.

ప్రఘసుఁడు:—పాతాళలోకమునుండి బలదానవవర్యుఁడుపంపిన కానుకలు తమదృష్టిపాత్రములు కానున్నవి.

రావ:—అవేవి?

ప్రఘ:—ఇవిగో (అని వానిం జూపును.)

రావ:—చాల సొంపుగానున్నవి ఈయాభరణముల నంతఃపురమునకుం బంపుము. ఈకానుకలను సేవకులకు బహుమాన మిప్పింపుము.

ప్రఘ:—చిత్తము.

రావ:—విభీషణా! పురసంరక్షణమున నీవేమేమేర్పాటులు చేసితివో వానినెల్ల నపుడపుడు చూచుచున్నావా.

౧౮. (పాట)

విభీ:—అన్నా! రావణేంద్రా! పురరక్షణమం దప్రమత్తుఁడనై యున్నవాఁడ. ఆసాధనములఁ బలుసారులు పరీక్షించితిని. చక్కఁగా నున్నది. భటవర్యు లేమఱక కాచుచున్నవారు. ఈయన్నింటికంటె మీయాజ్ఞయే పురమును గాచుచున్నది.

రావ:—(నవ్వి) వత్సా! విభీషణా!

తే. నీతిమంతుఁడ వీవు వి ♦ ఖ్యాతయశుఁడ
వార్యసన్నుతచరితుండ ♦ వమలమతివి
దనుజగుణములు నీయందుఁ ♦ గనఁగరావు
సాధుగుణరత్నభూషణా! ♦ జ్ఞాననిలయ!. 1

విభీ:—భ్రాతృవర్యులారా! నాయందేమిగుణమున్నను మీపాదసేవాసంలబ్ధమేకాని వేఱొకటి గాదు.

రావ:—(ముందు దృష్టిఁ బఱపి) ఆఁ. ఏమది? శూర్పణఖవలెనే యగపడుచున్నది. కాని మోమునుండి రక్తము కాఱుచున్నట్లున్నదే. ఏల పరుగెత్తివచ్చుచున్నది? ఎవరుగా నుండవచ్చు?

శూర్ప:—(ప్రవేశించి యేడ్చుచు నన్నపాదములపైఁ బడియుండును.)

రావ:—సోదరీ! ఏలయేడ్చెదవు? (లేవనెత్తి రక్తముదుడిచి పటపట పండ్లుకొఱికి)

ఉ. ఎవ్వఁడు మృత్యువక్త్రమున ♦ హీనబలంబున ముట్టఁజూచిన
[1]ట్లివ్విధి నీమహాపకృతి ♦ నేమితలంచి యొనర్చె నక్కటా!

---

1 రోషభాషణమగుట నిది సంస్కృతము.

యెవ్వఁడు పంచభోగభుజగేంద్రుని ముద్దుగొనంగఁజూచె నేఁ
డెవ్వనికాయు వంతమయి యిట్టులొనర్పఁగఁ జేసెనో కదా. 2

(మహారోషముతో హుంకరించి)

సీ. మూఁడులోకంబుల ముద్దగ నొనరించి
మ్రింగఁజాలినయట్టి మేటిబలుఁడ
[1] బ్రహ్మరమాధీశపరమేశ్వరుల నొక్క
చిటికెలో నిల్పనేర్చిన ఘనుండ
నింద్రాదిదిక్పాలకేశులఁ జెఱనుంచి
చెరలాటలాడెడు బిరుదుబంటఁ
గులశైలములఁ గరంబుల నెత్తి యాడించి
విహరింపఁజాలెడు విబుధనుతుఁడ

తే. నిట్టిరావణు లోకవిస్తృతపరాక్ర
మాఢ్యు నను లోఁదలంప కిట్లాచరించెఁ
గండక్రొవ్వున నెవ్వఁడో కనులనయన!
తెల్పుమా వానిమ్రందించి తీర్తు ఋణము. 3

శూర్ప:—(తెలియరానిమాటలతో) రావణా! రాముఁడు ఆతనితమ్ముఁడు నన్నీరీతి విరూపిణిగాఁ జేసినాఁడు.

రావ:—అయ్యో! శూర్పణఖా! మాటలు తెలియనేలేదే. ముక్కలేనేలేదా. (పరీక్షించిచూచి) పాపాత్ముఁ డెవ్వఁడో మొదలంటఁ గోసినాఁడే. (మొగమంతయుఁ జూచి) చెవులుకూడ గూబలలోనికిం గోసినాఁడే. ఆఁడుదాని నిట్లు చేసిన మహాత్ముఁ డెవ్వఁడో.

శూర్ప:—(గట్టిగా) రాముఁడు. ఆతనితమ్ముఁడు అడవిలో నాకీపాట్లు కల్పించినాఁడు.

రావ:—(విభీషణునిం గాంచి) నాయనా! నీకేమైనఁ దెలిసినదియా.

శూర్ప:—(కోపముతో) ఏడ్చుచున్న నన్నింకను ఏడ్పించెదవా.

రావ:—(చెవియొగ్గి విని) అయ్యో! చెల్లెలా! ఒక్కయక్షరమైనఁ దెలియలేదే మరలఁ జెప్పుము. చెవిలోఁ జెవినుంచి చెప్పుము.

శూర్ప:—(మరల నామాటలనే చెప్పును.)

రావ:—(కొంచె మాలోచించి) రాముఁ డడవులలో నిన్ను విరూపిణినిగాఁ జేసినాఁడా.

శూర్ప:—అఁ. చేసినాఁడు.

---

1 పదబంధాధికముగుట నిది విద్రవము.

రావ.—బ్రతికితిమిరా తండ్రీ! మాటలు తెలియునన్న యాశగల్గినది. సోదరీ! ఎందుల కిట్లుచేసినాఁడు? ఎవఁడా రాముఁడు?

శూర్ప.—దశరథునికొడుకు లిద్దఱు రామలక్ష్మణు లనువారు. రామునిభార్య సీత. తల్లియాజ్ఞచే దండకారణ్యమును జేరి విరాధుం జంపి మునుల కభయమిచ్చి పంచవటీతీరంబున నున్నాఁడు. రామునిభార్య త్రిలోకసుందరి. నీవు చెఱఁబట్టిన దేవతాస్త్రీలందఱు నామెకుఁ బరిచారికలుగా నుండఁ బనికిరారు. అట్టియందగత్తెను గని విని యుఱుంగను. నీకు దానిని భార్యయగునట్లు చేయఁబోతిని. పోగానే నిరపరాధిని నన్నుఁ బట్టుకొని ముక్కుచెవులు కోయవలసినదని రాముఁడు చెప్పఁగాఁ దమ్ముఁడు కోసినాఁడు.

రావ.—సోదరీ! ఇపుడు నీవేమికోరెదవు?

శూర్ప.—ఎంతయవమానము నాకైనను సీత నీకు భార్యగావలయునని నాకోరిక. ఆకోరికఁ దీర్పుము.

రావ.—(తనలో) పాపము! నాకొఱకై యిట్టిగతి పట్టినది ఈమెకు మనస్సంతోషమును గూర్పవలసినదే. (ప్రకాశము). చెల్లెలా! ఈస్వల్పకార్యమున కింతదూరము రావలెనా! ఖరునితోఁ జెప్పకపోతివా.

శూర్ప.—(ఏడ్చుచు నూరకుండును.)

రావ.—ఏమిసోదరీ! ఖరునిమాట యెత్తగనే యేడ్చుచున్నావే. ఆతఁడు నీమాట వినలేదా.

శూర్ప.—(కన్నీరు తుడుచుకొని) అన్నా! ఆవెంటనే ఖరునిదగ్గరకుంబోయి చెప్పితిని. ఆగ్రహించి కొందఱు రక్కసులం బంపెను. వారు మడసిరి తర్వాతఁ బదునాల్గువేలయోధవీరులతో ఖరదూషణత్రిశిరసులు పోయి మార్కొనిరి. ముహూర్తమాత్రమున వారినెల్ల రాముఁ డొక్కఁడే చంపినాఁడు. జనస్థానమిప్పుడు నిర్జనస్థానమైనది. పిలువఁ బేరులేకుండ మ్రందిరి. ఒక్కయకంపనుఁ డెట్లో పాఱిపోయి బ్రదికినాఁడు. వచ్చుచున్నాఁడో, త్రోవలో భీతిచేఁ జచ్చెనో.

రావ.—(ఉలికిపడి) ఖరదూషణాదుల నొక్కఁడే చంపెనా. ముహూర్తమాత్రమునా. ఏమి యిద్దావింత? ఒక్కబక్కమనుష్యుఁడు పదునాల్గువేల శూరశిఖామణుల క్షణకాలములోఁ జంపుటయన నెట్టివింత? (గట్టిగా) నిశ్చయముగా ఖరాదులు మ్రందినారా.

శూర్ప.—(ఏడ్చుచు) నిశ్చయమే.

(అకంపనుఁడు ప్రవేశించును.)

అకం.—(ప్రవేశించి నమస్కరించి నిలువఁబడును)

రావ.—అకంపనా! ఏమి వార్తలు.

అకం.—(డగ్గుత్తికతో) జనస్థానము రామునిచే శూన్యముగాఁ జేయఁబడియె క్షణకాలములోనే.

౧౯ (పాట)

రావ—(నిట్టూర్పుపుచ్చి) ఔరా! కాలము! పులిని మేక చంపినట్లైనదే. సింహమును గుక్కమాత్ర మీఁకఁ జంపకుండునా. హావిధీ! ఎట్టి క్రూరచర్యను జూపితివి? కానీ! (సోదరిం జూచి) శూర్పణఖా! నీవును అకంపనుఁడును ద్రోవఁజూపుఁడు. 1ఈక్షణంబ యారామునిగీమునిఁ జంపి వైచెద. (అని కత్తిని జళిపించును.)

శూర్ప—అన్నా! ఆతలంపు మానుము

అకం—రావణేంద్రా! యుద్ధమన్నమాట యింకొక్కసారి యన్న నేను బ్రదుకనేమో.

రావ.—అకంపనా! ఏమట్లనుచున్నావు?

శూర్ప.—ఆరాముఁడు యుద్ధమునఁ ద్రిమూర్తులను మించువాఁడు.

అకం—రాక్షసాధిపా! ఆతనిం దాఁక ముక్కంటిగూడ శక్తుఁడుకాఁడు యుద్ధమున. (అని మూర్ఛపోవును)

రావ—(వీఁపుతట్టి) భయపడకుము. నేఁ గలుగ భయము పొందుటకూడఁ గల్గినదా. ఔరా! కాలము!

అకం.—(కూరుచుండి వణఁకుచు) ఆయన ప్రౌఢిమము వర్ణనాతీతము. పదునాల్గువేల శూరశిఖామణులు ముహూర్తకాలము కాకముందే మ్రందిరే. దానింబట్టి యాలోచింపుము.

రావ.—శూర్పణఖా! ఇఁక నేయుపాయమున సీతను దెత్తును.

శూర్ప—రామలక్ష్మణులింట లేకుండఁ జేసి కపటముపన్ని సీతను దేవలయును. ఇతరోపాయము శక్యముగాదు. త్రిమూర్తులకైన నశక్యము.

రావ.—(కొంచెమాలోచించి) కులగురువగు శుక్రుఁడుండ భయమేమి? 2మహనీయుఁడాతఁడేమైన నాభిచారికహోమమును దెల్పును. దాన రాముం జంపివైచెద.

శూర్ప—అన్నా! ఈయాభిచారికహోమము లేవియుం బనికిరావు నీవే యిఁక రాక్షసులకు దిక్కు. నీకేమైనముప్పు వాటిల్లినా లంక దేవతలపాలగును

1 స్వశక్తిప్రశంసనముగుట నిది వ్యవసాయము 2 గురుకీర్తనరూపముగుట నిది ప్రసంగము.

రావ—(ఔడుగఱచి) అట్టికాలముగూడ వచ్చునా సోదరీ!

శూర్ప—ఖరదూషణాదులమరణమే యిందులకుఁ దార్కాణము

రావ.—ఇంక నీయభిప్రాయమేమో చెప్పుము.

శూర్ప—మాయచే రామలక్ష్మణుల నవ్వలకుం గొనిపోయి సీతను దేవలయు. మనుష్యులగుట సముద్రమును దాఁటి రాఁజాలరు. సీతలేకున్న ముహూర్తమైనను రాముఁడు జీవింపఁలేఁడు. ఈనాయుపాయముచే మనయిరువురికోరికలు ఫలించును నామాటలలో నొకయక్షరమైనను దాఁటితివా కార్యముచెడును. సిద్ధము.

రావ.—మంచిది. అదెంతటిపని? ఇపుడే చేసెద.

శూర్ప.—(చెవిలో నేమోచెప్పును.)

రావ.—(మంత్రులంజూచి) మీరును విన్నారుకదా యీవృత్తాంతము. నాతోఁబుట్టువును విరూపిణినిగాఁ జేసినవైరి నెట్టులైన నవమానింపవలయుఁగదా శూరలక్షణము మీతాత్పర్యమేమి?

ప్రహ.—మహాబలోపేతా! ఆఁడుదాని నవమానించినమానవుని జంపినఁగాని మనపగ మానదు. నాకాజ్ఞయిచ్చిన నిప్పుడే యీపని నెఱవేర్చెద.

ప్రఘసుఁడు—నాకాజ్ఞయిండు. రామునిశిరస్సు దెచ్చి మీముందఱఁ బెట్టెద.

జంబు.—ఈస్వల్పకార్యమునకు మంత్రులు పోవలెనా. సేవకుఁడొకఁడీపని చేసిరాఁగలఁడు.

౨౦. (పాట)

విభీ—రాక్షసాధీశా! ఈవెడఁగుమాటలఁ జెవిలోఁ జొన్పకుము వీరు కన్నుమిన్నెఱుంగక విఱ్ఱవీఁగుచున్నారు. ఇది చేయరానిపని.

రావ—సోదరిని, నిరపరాధిని నవమానించిన నూరకుండవలయుననియా నీభావము

విభీ—కుక్కకాటునకుఁ జెప్పుదెబ్బ యన్నట్లు సోదరిచేసిన కార్యమునకు బదులు రాముఁడు చేసినాఁడు.

రావ—సోదరా! చక్కఁగా నాలోచింపుము చెల్లెలియందేమి తప్పు?

విభీ.—రాక్షసేంద్రా! శూర్పణఖ చెప్పిన మాటలంబట్టియే మహాపరాధ మీమెయదిగాఁ గనఁబడుచున్నది. ఏమనఁగా విన్నవించెద నవధరింపుఁడు.

చ. వనముల నామహామహుఁడు ♦ భార్యను సోదరుఁ గూడియుండ నీ
వనిత చనంగనేల? గని ♦ వారిజనేత్రను నీకుఁ గూర్పఁగా

మనమున నెంచనేల? పలు♦మాటలు పల్కియె యుండుననుచు నా
కనువుగఁ దోఁచుచున్నది మ♦హాత్మక! యీయది తప్పుకాదొకో.

రావ.—సోదరా! పరపక్ష మూనకుము. రాక్షసులకుఁ గల్గిన యవమానమును దలంపుము.

విభీ.—రాజేంద్రా! నిశ్చయమే. ఈవిషయమున నాకిట్లు తోఁచుచున్నది.

సీ. మనశూర్పణఖపోయి ♦ మనుజేంద్రుఁ గనుఁగొని
యొప్పుని గతిఁ బల్కి ♦ యుండనోపుఁ
బలుకుమాత్రమె కాక ♦ తులువకార్యంబుల
నోడకయే చేసి ♦ యుండనోపు
నంతమాత్రమె కాక ♦ యతనిపత్నిం జంపు
టొప్పని యూహించి ♦ యుండనోపు
దానఁ గోపించి యీ♦తరుణి కీయది శిక్ష
యొప్పని చేయించి ♦ యుండనోపు

తే. నంత ఖరదూషణాదుల ♦ కట్టిరీతిఁ
దెలుప వారెల్ల నతనిపై ♦ నలుకఁబూని
పోయి శ్రీరాముచేఁ జావఁ ♦ బోగిలి యిటకు
వచ్చి యుండంగనోపు శూ♦ర్పణఖ యిపుడు. 5

దానవేంద్రా! ఇంకొక్క మనవి. సీతను గపటంబునఁ దేఁ జనునంటివి. మంత్రు లద్దాని కంగీకరించి పురికొలిపిరి. అంతమాత్రమే కాక మేమే సాధింతు మీకార్య మనిరి. కొందఱు రాముం జంపుదు మనిరి. ఇంకఁ గొందఱు సేవకునిచే రాముం జంపించెద మనిరి ఖరదూషణాదుల నొక్కఁడు చంపియుండుట వినియు వీరిట్లు పలుకుట లంకారాజ్యము నశించుకాలము రానున్నట్లే తోఁచెడు. పరపత్నిని దెచ్చుట పాపములలోఁ బాపము. వినుము.

తే. సత్కులంబునఁ బుట్టి య♦శంబుఁ గాంచి
దిక్కులను గెల్చి యీశ్వరుఁ ♦ దృప్తుఁ జేసి
నట్టి నీవిట్టి తగని కా♦ర్యం బొనర్పఁ
బెద్దలయశంబుగూడ నీ♦పృథ్వి చెడదె. 6

ఇది మహాపాపకృత్యము. వృద్ధికాము లీయాలోచనము చేయరు.

రావ.—విభీషణా! నీనీతులు విని విని కొంప యీగతికి వచ్చునట్లు చేసికొంటిని. ఖర దూషణాదులం జంపినమాట నైనం దలంపవు. ఇంక నేమేమో చదువుచున్నావే.

విభీ.—మనసోదరి కృత్యమే తప్పు. దానికిం దగినశిక్ష చేసిరి. ఖరదూషణాదు లీమె మాట విని పోయి మడసిరి. దీనింబట్టిచూడ రాముఁడు రాజమాత్రుండు కాఁడని తోఁచెడిని. నీవును సకలవిద్యాపారంగతుండవు ఆలోచింపుము.

రావ.—వత్సా! నీవేదాంతపునుద్దులు మానుము. (ప్రహస్తాదులం జూచి) పురరక్షణం బునం దప్రమత్తులరై యుండుఁడు. మీ రిండ్లకుం బొండు రహస్యాలోచన మొనర్చి నే నరిగెద.

(ప్రహస్తాదులు నిష్క్రమింతురు)

రావ.—అకంపనా! నీవిపుడెపోయి క్షణమాత్రమున మారీచుం బిలుచుకొనిరమ్ము.

అకం.—చిత్తము (అని నిష్క్రమించును)

రావ.—సోదరీ! ఆసీత యంతయందగత్తియయా.

శూర్ప.—అన్నా! ఆమెసౌందర్యము వర్ణింప నాతరముగాదు. బ్రహ్మకైనను శక్యమగు నో కాదో (అని చెవిలో నేమోచెప్పుచుండును)

(అకంపనుఁడు మారీచునితోఁ బ్రవేశించును)

రావ.—(మర్యాద యుట్టిపడునట్లు) రాక్షసాభరణమా! కుశలమా.

మారీ.—రాక్షసరాజా! జీవింధి యెట్లో కాలము గడుపుచున్నవాఁడ.

రావ.—మారీచా! కూర్చుండుము.

మారీ.—(కూరుచుండి) రావణా! తపస్సుచేయుచున్నఁ బిలిపించుట కేదోయొక గొప్ప కార్య ముండియుండును. సెలవిమ్ము. ఉచిత మే నొనరించెద.

రావ.—మారీచా! పాలవంటిరాక్షసకులమునకు నేఁటికిఁ గళంకము గల్గినదే దానిం బోఁగొట్టుకొనవలదా.

మారీ.—(ఆలోచించి కొంచె మూరకుండి) ఏమి యాకళంకము?

రావ.—ఈనాసోదరిం జూడుము.

మారీ.—(చూచి) ఏమి యిట్టిరూపము గల్గినదే.

రావ.—మారీచా! ఈవిషయము చెప్ప సిగ్గగుచున్నది. దేహము మండిపోవుచున్నది. వినుము. దండకారణ్యమున రామలక్ష్మణులు సీతయను రామునిభార్యయుఁ బ్రవేశించి రఁట. రాముఁడు విరాధుం జంపి పంచవటిం జేరినాఁడఁట. మనశూర్పణఖ కనఁ బడఁగా ముక్కుచెవులు తెగఁగోసిన నీమెపరుగెత్తి ఖరదూషణాదుల కావార్తం దెల్పెనఁట. వారెల్ల యుద్ధమునకు రాఁగా రాముం డందఱం జంపెనఁట. అకంపనుఁడే హతశిష్టుఁడు. ఇంకేమిగతి?

మారీ.—సరే! ఇపుడు నీతాత్పర్య మేమి?

రావ — మాయపన్ని నీవు రామలక్ష్మణులను దూరముగాఁ గొనిపొమ్ము. నేను సీతం దెచ్చెద. సీతంబాసి రాముం డుండలేక చచ్చును. సులభముగా మనపగ మాయును. ఇదియే నాభావము.

మారీ.— రావణా! ఆలకింపుము రామునిమహిమను నీకుం దెలియును. నా కనుభవసిద్ధాంతము. పూర్వము సుబాహుఁడు నేనును విశ్వామిత్రయాగమును బాడుచేయుచుండిమి ఆముని రామలక్ష్మణులం దోడ్కొనివచ్చె. రాముఁ డొక్కశరంబున సుబాహుం గూల్చె వేఱొక్కశరంబున నన్నుఁ జిమ్మినఁ బ్రాణములఁ బాయఁజాలక యదృష్టవశంబున సముద్రంబునంబడి బ్రదికియున్నవాఁడ. ఆనాఁడు రాముఁడు చాలచిన్నవాఁడు. శస్త్రవిద్యాపాటవంబు లేనివాఁడు. ఇప్పు డాతనిశక్తి ఖరదూషణాదుల వధించుటయే చెప్పక చెప్పుచున్నది రావణా! నామాట వినుము. అనాఁడుమొద లింతవఱకు దండకారణ్యమునఁ దపంబు చేయుచున్నాఁడఁ గాని రామునిభయముమాత్రము మానలేదు.

తే. ఎందుఁజూచిన శ్రీరాముఁ ♦ డే కనఁబడు
రాముఁ డన్నను రథమన్న ♦ రయముసటన్నఁ
బలుపలుకు లేలగాని ర♦వర్ణమొక్కఁ
డుచ్చరించిన వెతమది ♦ నొప్పుఁ జుమ్ము. 7

కావున నన్నుం బ్రదుకనిమ్ము. నీకుం బదివేల నమస్కారములు.

రావ.— మారీచా! భయపడకుము. నేనుండ నీకు భయమేల?

మారీ.— రావణా! నీకు నీలోకమునకు ఋణానుబంధము తెగిపోయినట్లున్నది. లేకున్న నీకీబుద్ధి పుట్టును నన్నుమాత్రము వినుము. ఊపిరియున్న నుప్పమ్ముకొనినైన బ్రదుకవచ్చు నన్నసామెత ననుసరించి జీవించియుండెద.

రావ.— (ఆగ్రహముతో) మారీచా! దేహము దెలియక మాటలాడుచున్నావా ఇదిగో ఖడ్గము. నామాట కీయకొంటివా సరే లేకున్న నిన్నిపుడే చంపెద.

మారీ.— (ఆత్మగతము) నాకీలోకమున జీవించునదృష్టము తప్పినది కాన వీనిచేతఁ జచ్చుటకంటే శ్రీరాముచేఁ జచ్చిన స్వర్గమబ్బును. (ప్రకాశము) రావణా! తెలియక యేమోయంటిని. క్షమింపుము. నీవు చెప్పినట్లుచేసెద

రావ — అట్లుపల్కుము నీవు మాయామృగంబవై సీతమనస్సున కానందమును బుట్టింపుము.

చ. కనకమృగంబవై కదలి ♦ కమ్రలతల్ గనువిందుచేయఁగాఁ
జని చరియించుచుండు మట ♦ జానకి నిన్నును గాంచి మోహమున్

గని నినుఁ బట్టి తెమ్మనుచుఁ ♦ గాంతుని వేఁడును. నీవు రామునిన్
గొని చని దూరభూమికటఁ ♦ గొంకక హాయని లక్ష్మణా! యటం
చును రఘురాముకంఠముగ ♦ నొప్పుగఁ బల్కుము సీతఁ దెచ్చెదన్.

మారీచా! చక్కఁగా రామునికంఠధ్వనియే యిదియని నమ్మకముపుట్టునట్లు హా లక్ష్మణా! యని గట్టిగా నార్వుము సీత రామున కపాయము కల్గినదని లక్ష్మణునిం బంపును. ఆవల నాకార్యము సఫలమగును.

మారీ.— అట్లే చేసెదను.

(అని యందఱు నిష్క్రమింతురు)

(సీతాలక్ష్మణులు పంచవటిం బ్రవేశించుచున్నారు.)

లక్ష్మ.— తల్లీ!

చ. కనుఁగొను ముగ్రదైత్యులని ♦ కాయము నొక్కఁడె సంగరంబునన్
సునిశితబాణజాలముల ♦ శూరులు చూచి బళీయనంగఁ జం
పిన రఘువీరునిన్ మనలఁ ♦ బ్రీతిని జూడఁగఁ గోరుచున్నరా
ముని సుగుణాభిరాముఁ దను ♦ భూరిరుచిప్రవిధూతకామునిన్. 9

రాము.— వత్సా! లక్ష్మణా! జానకి భయపడకయుండెనా.

లక్ష్మ.— రామపత్ని భయపడునా, ఎందులకు?

రాము.— అదియే వీరపత్నిధర్మము నాయనా కూరుచుండుము. జానకీ రమ్ము.

(ఇరువురు కూరుచుందురు.)

రాము.— వత్సా! ఆరక్కసి యెంతదుర్మార్గురాలు. దాని కెందఱు సహాయులు గలరు? నేఁటికి మునులచిక్కులు పోయినవి. జనస్థానము దనుజశూన్యస్థానమైనది.

లక్ష్మ.— ఇంక నేమేమిమాయలు పన్నునో.

రాము.— ఈయరణ్యమున నింక దానికి సాయపడఁగలవా రెవ్వరున్నారు?

లక్ష్మ.— మారీచుఁ డీయరణ్యమున నే యున్నాఁడనియు, వాఁడు మునుల నపుడపుడు పులిభోజనము చేయుచుండుననియుఁ జెప్పఁగా వింటిమి కదా! వాఁడు కపటాత్ముఁడు. మహాపాపుఁడు. కామరూపుఁడు.

రాము.— వత్సా! సుబాహునింజంపిన యాబాణ మారక్తపుజుచ్చులతో [1]నాల్కలు కోయుచున్నవి. వాఁడు వచ్చెనేని మనమూరకున్నను అది యూరకుండదులే.

లక్ష్మ.— వాఁడు యుద్ధమునకు వచ్చిన మాఁటన్నమాటయే. మోసముచే నేమైన నపకారము చేసిన?

---

1 అవమానరూపముగుట నిది ఛలనము.

రాము.—(గట్టిగా) దానవులారా! ఈయరణ్యమును విడిచి హతశేషులున్న నవ్వలం బొండు. ఆలసించితిరా [1]ఖరదూషణాదులచెంతకుం బోవఁగలరు. మునులతో విరోధము మానితిరా బ్రదుకుదురు. సజ్జనవిరోధము వినాశహేతువని మీరెఱుంగకుందురా. బ్రదుకఁదలఁచిన నాపలుకులఁ జెవియొగ్గి యాలకింపుఁడు.

లక్ష్మ.—రామచంద్రా! మనకిఁక శత్రుభయము గలుగదుగాని కపటమునకు లోఁబడి చిక్కులపాలగుదుమేమో యనుశంక యుదయించుచున్నది.

రాము—ఖరాదులచావు విన్నంతనే దనుజులకు మునులపై మనపైఁ గల [2]విరోధ మణఁగియుండును. ఇఁక వారు మనజోలి కేవిధమునను రారని తోఁచెడి.

లక్ష్మ.—మీవాక్యము ఫలించుఁగాక.

రాము.—వత్సా!

క. వనమిది నిష్కంటక మ
య్యెను [3]మునులకు నున్నచింత ♦ యేగెను దూరం
బునకుఁ జనసులభంబై
వనమిది తనరారు నింక ♦ భద్రదమగుచున్. 10

సీత.—ముహూర్తకాలమే మిమ్మెడఁబాసియున్నను నాకదియే యుగయుగముగాఁ గనఁబడినది.

రాము.—మనస్సులో నీవు భయపడియుందువు. కావుననే యాయల్పకాలము యుగముగాఁ గనఁబడినది. ఇంకఁ గొందలంపడక హాయిగా నుండుము.

లక్ష్మ.—క్రూరమృగములు ముందే చంపఁబడినవి. క్రూరదనుజులు ఇపుడే చంపఁబడిరికదా. [4]ఇంక నిశ్చింతముగా మనము మసలవచ్చు. పువ్వులు కోయువేళయైనది. ఒక్కొక్కటిగాఁ బువ్వులు క్రిందఁ బడుచున్నవి. ఇంక నీవు యథాప్రకారము పుష్పాపచయము చేయవచ్చు. కాని రాక్షసు లున్నతావు గావున వారేమైన మోసము చేయఁబూనుదురని తలంచి యామోసములఁ జిలఁపక లోఁబడక యుండవలయును.

సీత. వత్సా! చక్కఁగా జ్ఞాపకము చేసితివి? (అని పుష్పాపచయమునకై లేచి ముంగిటనే నిలుచుండి పూవుల నేమకుచుండును.)

---

1 తర్జనోద్వేజనరూపముగుట నిది ద్యుతి.

2 విరోధశమనరూపముగుట నిది శక్తి.

3 సిద్ధామంత్రణమువలని భవిష్యత్ప్రదర్శకయగుట నిది ప్రరోచన.

4 కార్యసంగ్రహరూపముగుట నిది యాదానము.

(కనకహరిణరూపమున మారీచుఁడు ప్రవేశించుచున్నాఁడు)

సీత.—(పువ్వులు గోయుచు మాయామృగమునుజూచి తనలో) సెబాసు! ఏమి యీలేడియందము. కనివిని యెఱుంగనుగదా. ఎంతబాగున్నది. దీనికొమ్ములు వజ్రనిర్మితములే యనఁదగు. మోమునయున్నమచ్చ నిష్కళంకశరత్పూర్ణిమాచంద్రబింబమును జిమ్మినై చుచున్నది. దేహచ్ఛాయయో పులుము పెట్టిన బంగరువలె నున్నది. గరుడపచ్చలు చల్లినట్లు మచ్చలుందంగుఁ గనఁబడుచున్నవి. ఏమి యాతోఁకసొగసు! ఏమి యానడకయందము. (రామునింజూడ మొగము ద్రిప్పి మరల జింకను జూచును. అది పొదలచాటునకుం బోవును) అయ్యో! ఇంతలో నెటుపోయెనో. (మరల నది కనఁబడును) అల్లదిగో మరల నాకనుపండువు చేయుటకో యనఁ గనఁబడినది. దీని నెట్లైని బట్టితెమ్మని రామచంద్రునిఁ బ్రార్థించెద. నాకోరిక నిరాకరింపఁడు. (గట్టిగా ప్రాణేశా! అని పిలుచును.

రాము—(ఉలికిపడి పర్ణశాలవెలుపలికి సోదరునితో వచ్చును.)

లక్ష్మ.—రామభద్రా! ఆమృగమునుజూచి వదినెగారు పిల్చియుందురు. ఇంకను దాని వంకనే చూచుచున్నట్లున్నది. చూడుమా దానియందము. ఇది మృగముకాదు. రాక్షసమాయ. లేకయున్న

చ. కనకమృగంబుఁ గాంచితిమె ♦ క్ష్మాస్థలి నెందును మున్న వింటిమే
దనుజునిమాయ యిద్దియగుఁ ♦ దప్పదు చిత్రతరాకృతిం దనం
తన జనకేంద్రపుత్రికయుఁ ♦ దత్పరతం గనఁ జేయవచ్చె దీ
నిని గని మోసపోకుము మ♦నీషివరా! రఘువంశభూషణా!. 11

రాము.—వత్సా! మిక్కిలిచక్కఁగాఁ గనఁబడుచున్నది.

సీత.—ప్రాణేశా! (అని మరలఁ బిల్చును.)

రాము.—(లక్ష్మణునితోఁ బ్రవేశించి) ప్రేయసీ! ఏలయాతురపడి పిల్చితివి?

సీత.—

౨౧. (పాట)

మ. కనుమా రాఘవ! యదె యొక్క యిఱ్ఱి కనకా♦క్రాంతాంగ మొప్పంగఁ జ
క్కని శృంగంబులు వజ్రకల్పితములై ♦ కన్పట్టె నెమ్మోము పూ
ర్ణనిశానాథునసత్కలాంఛనయుత♦భ్రాజిష్ణుబింబంబు నో
య్యన నిందించుచునుండఁ గన్పడెడు స♦ద్యత్కాంతిపుంజం బనన్.

రామచంద్రా! ఎన్నఁడుగాని యొక్క కార్యముఁగూడ మీతోఁ జెప్పినదాన్నఁ

గాను. నాకేమో దీనితో నాడఁ గుతూహల ముదయించి యుబ్బుచున్నది. క్రొత్తజాతిమృగమిది సాధారణమృగమైన మీకు శ్రమ కలుగఁజేయ నెంచను. దానియందమును జూడుము భగవత్సృష్టివిచిత్రము. దానిరీతి యిట్టిదని నిర్ణయింప సాధ్యముకాదు లోకమున నున్నజంతుజాలముల నెవ్వఁడును జూడఁజాలఁడు. కావున దీనింబట్టి తెచ్చి నాకు నిచ్చినచో నాదృష్టికి వనవాసమే పురవాసమునకన్న మేలుగాఁ దోఁపకపోదు. మనస్సంతోష ముప్పొంగ దానితో నాడుకొనియెద. మీరును దానినిఁ బ్రీతితోఁ జూచుచున్నారు కదా! ఈనాప్రార్థనమును జెల్లింపవలయు (అని మరల నాయిఱ్ఱినే చూపుచున్నది)

రాము.—జానకీ! నీవొకకోరికను దెల్పుటయు నేను దానిని దీర్పఁజాలకపోవుటయు నుండునా.

సీత.—ప్రాణేశా.

చ. మనవిని గాఁగ దీని మృదు♦మానసమందుఁ దలంచి యెందునేఁ
జనినను బట్టితెమ్మిదియుఁ ♦ జయ్యనఁ బొలునయేనిఁ జిక్కదం
చని మదిఁ దోఁచినప్పుడు మ♦హావిశిఖంబునఁ జంపి చర్మమై
నను గొనిరమ్ము దానినె మ♦నంబున కింపుగఁ జూచుచుండెదన్.

రాము.—జానకీ! ఇంతగా ప్రార్థింపనేల? అవశ్యము పట్టితెచ్చెద. నాయావచ్ఛక్తి నుపయోగించి పట్టుకొనఁ బ్రయత్నించెద. సాధ్యము కాదనితోఁచినఁ జంపి తెచ్చెద.

సీత—నాథా! త్వరగాఁ బోవలయు. ఎందేనిబోయినం బోవును.

రాము—ప్రాణేశ్వరీ! ఆచింత నీకువలదు. పట్టితెచ్చి నీకిచ్చెద. నెమ్మదిగ నుండుము.

లక్ష్మ.—రామభద్రా!

తే. నాకుఁ జూడ మారీచుఁడే ♦ యీకపటముఁ
బూని వచ్చెనటంచును ♦ బుద్ధిఁ దోఁచు
చున్నయది లేకయున్న నీ♦యున్నరూపుఁ
గంటిమే వింటిమే యెందుఁ♦గాని మనము. 14

రాము.—(చిఱునవ్వునవ్వి) వత్సా! ఒక్కమాట వినుము.

చ. వనితలు కోరుకోర్కెలను ♦ వల్లభులేగద తీర్పఁజాలువా
రనయము కోరలే దతివ! ♦ యీరసి లేడియెయైనఁ దెచ్చెదన్

దనుజుఁడెయైన వెంటనె ని♦తాంతభయంకరసాయకంబునన్
దునిమెద నెంటమే లిచటఁ ♦ దోఁచుఁగదా గుణరత్నభూషణా! 15

లక్ష్మ—(మాఱుపల్కక వెఱచి యూరకుండును).

రాము.—వత్సా! ధనుర్బాణములం బూని జానకిని రక్షించుచు నప్రమత్తుండవై యుండుము. జాగ్రత్తసుమీ ఇదెపోయివచ్చెద సీతను గాపాడుచుండుము. ప్రమాదంబు నొందకుము

(అని యందఱు నిష్క్రమింతురు).

(సీతాలక్ష్మణులు పర్ణశాలలోనుండి ప్రవేశించుచున్నారు)

సీత—లక్ష్మణా! ఆధ్వని వింటివా హాలక్ష్మణా! యని వినఁబడుచున్నదే ఏమది?

లక్ష్మ.—తల్లీ! ఆమృగము మాయఁబూనిన రాక్షసుఁడనియు, మనపై నలుకంబూనిన రాక్షసు లెన్నియో మాయలు పన్నుచుందురనియు మున్నే విన్నవించియుంటినిగదా.

సీత.—(చెవియొగ్గి విని గుండెలు కొట్టుకొనుచు) అయ్యో! లక్ష్మణా! రామునకేమో యపాయము కల్గినది లేకున్న హాలక్ష్మణా యని యార్చునా.

లక్ష్మ.—తల్లీ! భయపడవలదు. ఖరదూషణాదులఁ బదునాలుగువేవురను క్షణమాత్రమున జంపిన జగదేకవీరునకు రామునకు శోకయాస్పద కల్గునా. మనస్సు నిశ్చలముగఁ జేసి యూరకుండుఁడు.

సీత.—లక్ష్మణా! ఆయార్తనాదము నాప్రాణనాథునిదే సందియములేదు రాక్షసునిదైనట్లు వినఁబడునా.

లక్ష్మ.—అమ్మా! దనుజులు కామరూపులు. వారేమాయలనైనఁ బన్నఁగలరు అందులో నిదియొకటి

సీత.—లక్ష్మణా! ఏమీయిట్లు శాంతమును వహించుచున్నావు? నాప్రాణములు మీఁదవిమీఁదికే పోవుచున్నవే నాగతియేమి?

లక్ష్మ—జానకీదేవీ! వీరపత్నివగు నీవే యిట్లు కలఁతనొందిన నే నేమనఁగలను? రామునకే భయము లేదు. మొదట నెత్తిన నోరుపెట్టుకొని మాయామృగమను, పోవలదని యెన్నివిధములనో చెప్పితిని. నీవు నామాటలాలింపక పొమ్మని పట్టుపట్టితివి. ఇపుడిట్లనుచున్నావు నాకేమియుఁ దోఁపకున్నది.

సీత.—నాయనా! (అవివేకముచే నట్లు పొమ్మంటిని. ఇపుడు వివేకముగల్గి భర్తకుఁ దోడుపొమ్మని నిన్నుఁ బ్రార్థించుచున్నాను. నామనవి నంగీకరించి త్వరగాఁ బోయి రామచంద్రునకుఁ దోడ్పడుమా.

లక్ష్మ.—వైదేహీ! ఏలయిట్లు నన్ను సదలించెదవు? రామునకుఁ దోడ్పడువారెవ్వరు? ముల్లోకము లొక్కటియైన నామహాభుజునకు లెక్కయా. లేనిపోనివిచారము లకుఁ జిత్తంబునఁ జోటీయక నెమ్మదిగ నుండుము.

సీత—అయ్యో! సౌమిత్రీ! నీవేమో భరతునిపక్షపాతమూని వచ్చినట్లున్నదే ఆప త్కాలమున సహాయము చేయనివాఁ డెవ్వఁడైన నేమిలాభము? నాప్రాణ నాథుం గాపాడి నాకుఁ బ్రాణదానము చేయుము. పురమునకుఁ బోఁగా నే యర్ధరాజ్య మిప్పించెద. నాయనా! నామాట లాలించి బాణములంగొని తోడుపొమ్ము.

లక్ష్మ.—తల్లీ! రామునాజ్ఞను జవదాఁటువాఁడనుగాను. నీవును మీఱఁగూడదు. రాముఁ డింక క్షణములో వచ్చును.

సీత—(ఆతురముతో) ఏమిలక్ష్మణా! ఇట్టివాఁడవని తెలియక మోసపోతిని. నీకేమైన దురుద్దేశ్య మున్నదియా.

లక్ష్మ—(చెవులు మూసికొని రాముని ధ్యానించి) తల్లీ! ఆతురపడి తోఁచినట్లు మాట లాడుట మంచిదియా? పాపము శాంతించుఁగాక.

సీత—లక్ష్మణా! ఏమియిట్టిలిక్కట్టున దాయాదిమచ్చరమును జూపుచున్నావు దిక్కు లేక రాముఁ డడవిలోఁ జావఁగా నన్నును రాజ్యము నేలఁదలఁచితివాయేమి? అట్లు నేను నీకుఁ దక్కనుజుమీ. ఇందే ప్రాయోపవేశమూనియో, అగ్నిలోఁ బడియో, గోదావరిలో దుముకియో ప్రాణములఁ బాపుకొందును. తేనెపూసిన కత్తిగా నున్నావే. ఓవనదేవతలారా! మీరెల్లరు సాక్షులు, చూడుఁడీ యీలక్ష్మ ణునిద్రోహబుద్ధి.

లక్ష్మ.—(శివశివా యని చెవులు మూసికొని)తల్లీ! దశరథునకుఁ గొడుక నైతినేని సత్యము పల్కెదను. అవధరింపుము. భయపడకుండుము. రామున కాపదరాలేదు. ఆమృగము మారీచుఁడు. వాఁడేమో చచ్చుచు నిట్లఱచియుండును. అంతియే కాని రామున కాపదఁ గల్గించువాఁ డెవఁడు? దేవతలు కారు. ప్రపంచమున నేకవీరుఁడని ప్రఖ్యాతినొందిన శ్రీరామునకు శత్రుబాధ కల్గునా? ఏల యీభ్రమ. ఊరకుండి ల్లుము. క్షణకాలములో రాముఁడు మనకు నేత్రానందమును గూర్పఁగలఁడు.

సీత.—మనకనుచున్నావే లక్ష్మణా! నీకేమో సత్యముగా నాయందొకపాపబుద్ధి కల్గినది. నాశపథము విను. నే నీయాశ్రమములో నే దేహమును త్యజించెదను నీకుం దక్కను. నిక్కముగా నన్నుం గోరియున్నవాఁడవు. ఓవనదేవతలారా! నా ప్రాణేశున కీవార్తఁ జెప్పి తోడ్పడుఁడు. ఈపాపాత్ముఁడు లక్ష్మణుం డిట్లు నవ్వుచు మాట లాడుచున్నాఁడు. ఇట్టిసోదరులను నే వినియుండలేదు.

లక్ష్మ.—తల్లీ! నిన్ను నాతల్లియగుసుమిత్రకంటె నెక్కువగా భావించుకొన్నవాఁడ. స్త్రీలచపలతచే నిట్లు మాటలాడకుము నీవిట్లు త్వరపడుట యేదోయొకయాప దకు మూలము. మహారణ్యమున సీత నొంటిగా విడిచి యెట్లు వచ్చితివని రాముఁ డడుగ నే నేమని యుత్తర మీయఁగలను? నామాట నమ్మి యూఱడిల్లుము. రాముఁడు ముహూర్తకాలమున వచ్చును.

సీత.—(గట్టిగా నేడ్చుచు) లక్ష్మణా! నాప్రాణేశుఁ డాపదలోఁ జిక్కినపుడు నా కెట్టి వ్యసనము తోఁచునో దాయాదివగు నీ కెట్టివ్యసన మేల తోఁచును? నీవేమో నన్నుఁ గోరియున్నాఁడవు సత్యము. హారామచంద్రా! నే నిందే ప్రాణత్యాగము చేయుదును. నామాట నీకుఁ దెల్పువారెవ్వ రుందురో తెలియఁజాలకున్నాను. దేవతలారా! మృగములారా! పక్షులారా! వృక్షములారా! లతలారా! మీరెల్లఁ జూడుఁడు. పాపబుద్ధి యీలక్ష్మణుఁ డొకదుస్సంకల్పము కలవాఁడై యన్నకుఁ ద్రోడుపో నని మొండిపట్టు పట్టియున్నాఁడు.

లక్ష్మ.—(చెవులు మూసికొని శివశివా యని, సీతకు నమస్కరించి) తల్లీ! యేమియాపద రానున్నదో తెలియఁజాలను. నీయాజ్ఞప్రకారము పోవుచున్నాను. నాదోష మిందేదియు లేదు. వనదేవతలారా! నావచ్చునందాఁక జానకీదేవిని గాపాడు చుండుఁడు. వినదానిమాటలు పల్కినంగున వెళ్లుచున్నాఁడను. తల్లీ! యిదె వెళ్లు చున్నాఁడ. జాగ్రత్తగా నుండుము.

(అని నిష్క్రమించును).

(పిదప సన్న్యాసివేషమున రావణుఁడు ప్రవేశించుచున్నాఁడు.)

22. పాట.

సన్న్యా.—(ఆశ్రమము చేరి శంకరా నారాయణా అనుచుండును).

సీత.—(లోపలనుండి చూచి భక్తితోఁ బూజాద్రవ్యములు కొనివచ్చి) మహాత్మా! ఇదె నాయిచ్చు నీయాతిథ్యమును బరిగ్రహింపుఁడు.

సన్న్యా.—(నారాయణా అనిపల్కుచుఁ బూజను గ్రహించి) ఇంతీ! నీ వెవ్వతెవు? ఈమహారణ్యమధ్యభాగమున నొంటి నున్నదానవే. కారణమేమి? ఈభూములు దుష్టరాక్షసాకీర్ణములుకదా! విశేషించి క్రూరమృగము లిందుఁ దిరుగు చుండును.

సీత.—మహాత్మా!

సీ. రాక్షసాంతకుఁ డగు ♦ రాముని భార్యను
దశరథుకోడలఁ ♦ దత్త్వవేత్త

ధైన యాజనకున ♦ కాత్మజాతను సీత
యని పిల్వఁబడుదాన ♦ నార్యవర్య!
తండ్రియాజ్ఞను బూని ♦ దండకాటవిఁ జేర
రాముఁడు పయనమై ♦ రాఁగ నేను
ఛాయపోలిక భర్త ♦ సంగతి వచ్చితి
హరిణశాబక మొక్కఁ ♦ డగపడె నిట
తే. దానిఁ దెమ్మన్న రాముండు ♦ తరలె వెనుక
నార్తనాదంబు భర్తృని ♦ నాద మట్లె
విన్ఁగనయ్యెను శ్రీరాము ♦ ననుజుఁ డచటి
కరిగె నాధ్వని నరయంగ ♦ నాతురమున. 16

ఇంతకు వారిరువురు వచ్చుచుందురు. ఇందుఁ గూరుచుండి యుండుఁడు. వారు వచ్చి భక్తిమీఱ నాతిథ్యమిత్తురు. స్వామీ! శ్రీరాముఁడు కుశలియై వచ్చుచున్నాఁడుకదా! దివ్యదృష్టిం బరికించి చెప్పి నాయాతురపాటు మాన్పుఁడు.

సన్న్యా.—(ధ్యాన మభినయించి) ఇంతీ! ప్రాణభయముం బొందనట్లు తెలియవచ్చినది. చాలదూరమున నున్నవాఁడు. త్రోవ తప్పియున్నాఁడు. లక్ష్మణుండును దెలియఁజాలక తప్పుత్రోవనే పోవుచున్నాఁడు. (అని ధ్యాన మభినయించుచున్నట్లు నటించి తనలో) సెబాసు! సెబాసు! ఏమియీయింతియందము! శూర్పణఖ చెప్పినపుడు సందేహించితిని. ఇది యొకనూతనసృష్టి. లేకున్న నిట్టి రూపమా. వింటిమా, కంటిమా. కలయందైన నూహింపఁగల్గితిమా. ఔరా! చతురాననా! నీసృష్టికి నీవే తగుదువురా. మెచ్చితి!

ఉ. కంటిని మూఁడులోకములు ♦ కాంతల నెందఱినో ప్రియంబునం
గంటిని దేవతాంగనలఁ ♦ గాంచి వరించితి బల్మిఁ దెచ్చి నా
యింటనె యుంచితిన్ మఱియు ♦ నెట్టిజగంబునఁ గాని యిట్టివా
ల్గంటిని జూచిగాని విని ♦ గాని యెఱుంగను నిశ్చయంబుగన్. 17

సెబాసు! ఈయింతియవయవము లెట్లు నిర్మింపఁబడినవి!

మ. కనులా పద్మములన్ హసించు విలస ♦ త్కమ్రాస్యమా చంద్రునిం
గని సత్కారమొనర్చు బాహుయుగమా ♦ కాంతప్రవాళోల్లస
త్తనుసంయుక్తమహాటవీలతను నిం ♦ దం బొందఁగాఁజేయు నీ
వనితాంఘ్రిద్వయ మౌర! పల్లవమృదు ♦ త్వంబుం గదున్ నవ్వెడున్.

ఎవ్వనియింట నీనారీమణి యుండునో ఆయిల్లు హర్మ్యమగును. లేకున్న శూన్యగృహమే యనందగు. ఇంతయేల? ఇఁక నాలస్యముచేయక దీనిం గొనిపోవలయు. ముందు దీనితాత్పర్య మెట్టిదో కనుఁగొనియెద (ప్రకాశము) తరుణీమణీ! ఈనీసౌందర్యమున కీవనవాసము తగినదియా?. ఈబీదమనుష్యుఁడు భర్త కాఁదగినవాఁడా? నీవంటిసుకుమారాంగిని మహారణ్యములందు గుడిసెలోఁ గాఁపురముంచినవాఁడొకపురుషుఁడా? ఎందుల కారామునిం గట్టుకొని యీయాగు లాడెదవు? త్రిలోకాధిపత్యమునకన్న నీకు భర్తయగుట గొప్ప. ఎట్లు నీకు భర్తగా రాముఁ డాయెనో చెప్పఁజాల. ఈపాటి కాయనతోఁ జెలిమిచాలు.

సీత.—(తనలో) అక్కటా! ఈసన్న్యాసి యేమి యిట్లనుచున్నాఁడు! చూపులు మునులచూపులు గావు. చపలపుచూపులు తెలియక యాతిథ్య మిచ్చితిని. ఒంటిగానున్న నన్నేమిచేయుం దలంచెనో; స్త్రీబుద్ధిని గనఁబఱచి సౌమిత్రినిం బంపితినే. ఇఁక గతియేమి? మెల్లఁగా మాటలతోఁ గాలము పుచ్చెద. ఇంతిలో సౌమిత్రి, రామచంద్రుఁడు రాకపోదురా. (ప్రకాశము) ఆర్యా! ఏమట్లు మాటలాడుచున్నారు? వనితలకు భర్తయే నారాయణమూర్తి. భర్తయే నోముల పంట. భర్తయే పరమగతి భర్తయే నవమన్మథుఁడు. ఇట్టివిషయము మీరెఱుఁగనిదియా. ఏయుద్దేశ్యమున నిట్లు మాట్లాడితిరో.

సన్న్యా.—అన్నులమిన్నా! ఈనీతులు వృద్ధులు చెప్పుమాటలు. ఇవి సత్యములుకావు. యౌవనము స్థిరముకాదు. ఎప్పుడో అనుభవింతమన్న సుఖములు రాఁజాలవు. ఎప్పటికినిదగినట్లు ప్రవర్తింపవలయు. నీనవయౌవనమునకుఁ దగినపురుషుఁడు దొరకినచో నదృష్టమునియే తలంపవలయుఁ గాని ప్రాఁతమాటల వర్లించుచు నుండరాదు. కావున నీవనవాసకష్టముల నీనిముసమునసే వదలుకొనుట మంచిది.

సీత.—(తనలో) వీఁడు సత్యముగా నెవఁడో దుష్టరాక్షసుఁడు. కకున్న నిట్టి మాటలం బల్కఁడు దిక్కు లేదు. గట్టిగాఁ బిలిచినను బలుకువారు లేరు. లక్ష్మణుని ననరానిమాట లంటిని. ఆపాపఫల మిప్పుడే యనుభవమునకు వచ్చినట్లున్నది. ఇఁకేమిగతి? ఎవరితోఁ జెప్పుకొందును? అయినను నయవినయము లుట్టిపడ మాటలాడుచుండెద. (ప్రకాశము) మహాత్మా! చమత్కారముగా మాటలాడుటకు శక్తిచాలదు. మీరు సర్వజ్ఞులు. ఏమాట చెప్పినను దాని సిద్ధాంతము చేయఁగల్గుదురు. కొంచెమునేపు భగవన్నామసంకీర్తనము చేసి నాకుఁ గర్ణానందము చేయుఁడు. ఇదె నమస్కరించెద.

సన్న్యా.—ఇంతీ! తొలుదొలుతఁ గర్ణానందముగ మాటలాడి యువ్విళ్ళ నేత్రానంద

ముగ రూపప్రదర్శనముచేసి యువ్వల హృదయానందమును గూర్చి నిన్ను శాశ్వతానందప్రదమగు స్థానమున నలంకరింపఁజేసెద. నన్నుఁ గటాక్షదృష్టిం గృతార్థునిం జేయుమా.

సీత.—తనలో వీనిమాటలవైఖరి విపరీతముగ నున్నది. వీఁడు రాక్షసుఁడే. అప్పుడే నాగుండెలు తటతట కొట్టుకొనుచున్నవి. నాలుక యాడకున్నది. అవయవములు కంపించుచున్నయవి. ముందేమిగతి? ఎట్లు మాటలాడి యీగండమును దప్పించుకొందును? (ప్రకాశము) ఆర్యా! మీమాటలు నా కేమియుఁ దెలియ రాకయున్నవి.

సన్న్యా.—తన్వీ! ఇపు డట్లే యుండును. వానియర్థ మనుభవమునఁ జక్కఁగాఁ దెలియఁగలదు. ఇంక క్షణములో నీవే యెఱుంగఁగలవు.

సీత.—(ఊరక నిలువంబడియుండును)

సన్న్యా.—జానకీ! ముల్లోకముల జయించిన యశస్సాంద్రుండు లంకాధిపతి రావణుండని వినియున్నదానవా?.

సీత—రామునిం దప్ప నా కేవిషయము తెలియదు.

సన్న్యా.—రావణునే రామునిగా భావింపుము.

సీత.—అది కులస్త్రీల మర్యాద కాదు.

సన్న్యా.—ఆరావణుఁడు కైలాస మెత్తి శంకరుని మెప్పించి తక్కినదిక్పాలుర జయించిన మేటిశూరుఁ డని వింటివా?.

సీత.—(రామా! యని యొండువలను జూచుచుండును)

సన్న్యా.—ఇంతీ! సుర గంధర్వ సిద్ధ సాధ్య విద్యాధర యక్ష రాక్షస కాంతలాతనిఁ జూచి వరించి యాతని నగరంబున సకలసుఖముల ననుభవించుచున్నారని నీకుందెలియునుగదా?.

సీత.—(హరిహరీ యని చెవులు మూసికొని యూరకుండును)

సన్న్యా.—అట్టి త్రిలోకవిజయశాలి, అట్టి యఖండప్రతాపనిధి, అట్టి త్రైలోక్యవీరుఁడు, అట్టి నవమన్మథాకారుఁడు, అట్టిభోగశాలి, అట్టిమహాత్ముఁడు, ఇపుడు నిన్నుఁగోరి యున్నవాఁడు. మన్ననఁ గ్రుచ్చియెత్తి కౌఁగిటంజేర్తువో లేక నిర్దయాత్మవై యూరకుందువో.

సీత—(వడఁకుచు) నావంటిపతివ్రతతో నీమాటలు పల్కుట యతులకు ధర్మమేయని మీకుఁ దోఁచినదేమో. రాముఁడు వచ్చువేళ యైనది. ఇఁకఁ జాలుఁజాలు. వేవేగ పొమ్ము.

సన్న్యా.—సీతా! నీ వన్నమాట నిశ్చయమే. ఈపల్కులు సన్న్యాసికిం జెల్లవు కాని నాకుం జెల్లవా?.

సీత.—(తనలో) నాకుం జెల్లవా యనుచున్నాఁడు. వీఁడే రావణాసురుఁడా యేమి? అక్కటా! మోసపోతినిగదా. సౌమిత్రి యన్నమాట సత్యమే. బుద్ధిలేక యనరానిమాటలాడితిని. నా కేమిగతి? ఇంకదిక్కెవ్వరు? (ప్రకాశము) మహాత్మా! నాకుంజెల్లవా యంటిరి. ఆమాట కర్థమేమో తోఁచకున్నది.

సన్న్యా.—ఇంతీ! దానియర్థ మిప్పుడే నీకే తెలియఁగలదు (అని నాలుగడుగులు వెనుకకుం బోయి చెట్టుచాటున నిలిచి తనరూపమును దాల్చి సీత కగపడును.)

సీత.—(పదితలలు చూచి హా రామచంద్రా యని యార్చి మూర్ఛిల్లును)

రావ—సీతా! రాముఁడు వచ్చువేళయైనదా. వచ్చి యింకేమిచేయును?. వెదకును, దుఃఖించును, పరితపించును, కృశించును, పురమునకుం బోవును, మరణించును. ఇంతకన్న నింకేమి చేయును? (అని సీత నెత్తుకొని దూరముగా నిల్పియున్న రథముదగ్గఱకుం బఱుగెత్తి రథముపై నిడుచున్నాఁడు.)

23. పాట.

సీత.—(మూర్ఛను బాసి నలుదెసలు కలయం జూచి వడఁకుచు) ఓవనదేవతలారా! మృగములారా! ఈక్రూరరాక్షసుఁ డన్యాయముగా శ్రీరామునిపత్నిని సీతను నన్ను రామలక్ష్మణు లింట లేనపుడు బలవంతముగఁ దీసికొని పోవుచున్నాఁడు. త్వరగా రామునకుం జెప్పి నన్నుఁ గాపాడుఁడు. (అని గట్టిగా నేడ్చును).

(పొదలలోనున్న జటాయువు ప్రవేశించును.)

జటా.—(తనలో) శ్రీరామునిపత్నిని సీతను రావణుఁ డెత్తుకొని పోవుచున్నాడా?. ఔరా! కాలము. జటాయువు జీవించియుండఁగనే యిట్టి దుష్కార్య మీయరణ్యమున జరుగునా?. (ప్రకాశము) శ్రీరామపత్నీ! జానకీ! భయపడకుము, నేను జటాయువను పక్షివర్యుఁడను, దశరథమిత్రుఁడను. ఇదె వచ్చుచున్నాఁడను. (ప్రవేశించి) రావణా! ఈకార్యము నీకుఁ దగునా?. శక్యమగునా?. ఛీ! పాపాత్మా! కులపాంసనా! నే నుండఁగా నీవెట్లు లీసాధ్వీమణిని దొంగిలింతువో చూచెద. నిలునిలు.

రావ.—పక్షీ! ఊరక ప్రాణములం గోలుపోకుము. చచ్చినట్లు పడియుండుము. (అని రథము పై కెగురఁజేయఁ బ్రయత్నించును.)

జటా.—రాక్షసాధమా! రథము నడుపనట్టి ప్రయత్నము చేయుచున్నావా? (అని దుముకి ముక్కుతో గుఱ్ఱములం జంపి పక్షములతో రథమును విఱుగఁగొట్టి రెండుకాళ్లతో రావణుఁ దన్నును)

రావ —(సీతను దించి తనలో) రథరథ్యములు చూర్ణములాయె. నామేను రక్తప్రవాహమున మునిఁగినది. ఇంక నాలస్యముచేసినఁ గార్యము చెడును (అని ఖడ్గము నెత్తి నఱుకఁ బ్రయత్నించును.)

జటా —కులపాంసనా! ద్రోహీ! ఖడ్గముచే నన్నుఁ జంపఁబూనెదవా? ఇదె నాపాద నఖముల నీమేనుఁ జీల్చి కాకములకుఁ బలిసేసెద. (అని గోళ్లతో దేహమును జీల్చును. రావణుండు మూర్ఛపోయిన ట్లుండును.)

రావ —(క్షణమాత్రమునఁ దెల్విరాఁగా, ఔడుకఱచి) హా! పక్షీ! మితిమీఱి ప్రతాపమును జూపఁబూనెదవా? నీయధికార మెంత? కానీ నీకీలోకమున బ్రదుకు ప్రాప్తము నేఁటికి ముఁగిసినది కాఁబోలు!. శ్రీరాముని పత్నిని విడిపించి ధర్మసంరక్షణము చేయుదువుకాఁబోలు!. ఇదె ఖడ్గప్రహారము. తప్పించుకొనుము. (అని ఖడ్గము విసర నుంకించును.)

జటా.—కృతఘ్నుఁడా! పాపాత్ముఁడా!. రాముఁ డింటలేనితరుణమున దొంగవలె జానకి నెత్తుకొనిపోయెదవా?. నీకుఁ బ్రతాపమున్నచో రామలక్ష్మణు లింట నున్నప్పు డెత్తుకొని పోరాదా?. నీరక్తము నక్కలు తృప్తిగాఁ ద్రాగునట్లు రాముఁడు శిక్షయొనర్చునే. ఇపు డేమాయె. ఇదె నాపాదాఘాతమును దప్పించుకొనుము. (అని పైకెగిరివచ్చి రావణుతలను గోళ్లతో గట్టిగాఁ జీల్చును.)

రావ.—(మూర్ఛిల్లి ముహూర్తమాత్రమునఁ దెల్విరాఁగా లేచి) జటాయుపక్షీ! మిట్టిమిట్టిపడుచున్నావా. ఇది దిక్పాలుర జయించి కైలాసమెత్తి శంకరుని విభ్రాంతునిం జేసి సురాసురుల నెల్ల గడగడ వడఁకునట్లుచేసిన రావణాసురుని చంద్రాయుధము సుమా. దీనిప్రహారమును బొందిన నీకు బ్రదుకుపై నింక నాశలేదు. (అని గట్టిగా విసరును).

జటా.—(క్రిందఁబడి మూర్ఛిల్లును)

రావ.—(ఇంక నిట మసలరాదు. వీనిపక్షములు తెగినవో లేదో. మరల లేచెనా ఆలస్యమగును. (అని సీతను జంక కెత్తుకొని పోవుచున్నాఁడు)

సీత.—(నాలుగుదిక్కులు కలయం జూచి చేతు లెత్తి గట్టిగా)

సీ. కానలో నలరారు ♦ కమ్రవృక్షములార!
నాగతిఁ దెల్పరే ♦ నాథుతోడఁ
భావనలతలార! ♦ పలుకరే పాపాత్ముఁ
డీ నన్నుఁ గొనిపోవు ♦ టీశుతోడ

గపటమే లేని మృ♦గములార! నుడువరే
రావణువార్త శ్రీ♦రాముతోడ
నంబ! గోదావరీ! ♦ యాదృతిఁ జెప్పవే
సీతఁ గొంపోవుట ♦ క్షితిపుతోడఁ
ఆ. బలుకరానిపల్కుఁ ♦ బావనమతియైన
యాసుమిత్రపుత్రు♦నంటి దాని
ఫలము వేగ కంటిఁ ♦ బలుకరే పతితోడఁ
గరుణఁ ద్రిదశులార! ♦ కడుజవమున 16

(అని యాక్రోశించును)

రావ —(అత్యంతవేగమున నంబరమునఁ బరుగెత్తుచు) రావణుండ. జానకిం గొంపోవుచున్నవాఁడ. ఇదె పోవుచున్నవాఁడ.

(అని నిష్క్రమించును)

([1]ఇది విమర్శసంధి)

ఇది చతుర్థాంకము.

---

1 నియతాప్తి ప్రకరీసంబంధరూపమగు విమర్శసంధి ముఖ్యాంగసహితంబుగఁ జెప్పఁబడినది.

పంచమాంకము.

(పిదపఁ గపాలినియుఁ గుండికయు నను నిరువురు వనదేవతలు ప్రవేశించుచున్నారు)

కపా.—సోదరీ! ఎంతపని జరగినదో చూచితివా?.

కుండిక.—అక్కా! నిశ్చయమేనా? సీతను రావణుఁడు కొంపోవుట.

కపా.—ఓసివెఱ్ఱిదానా! ఇంకను సంశయమా?.

కుండి.—ఆవిధము చక్కఁగా వినిపింపుము.

కపా.—సోదరీ! విను. శూర్పణఖ లంకకుంబోయి యన్నతోఁ దనదుఃఖమును దెలుపుకొనఁగా నాతఁడు ఖరాదులచావును విని మోసముచే రాముని జయింప నెంచి దండకాటవింజేరి మారీచుని మాయాహరిణముగాఁ బంపెను. దానిని దెచ్చియిమ్మని సీత ప్రార్థింపఁగా లక్ష్మణుని సీతాసంరక్షణమున నిలిపి రాముఁడు దాని వెంటఁ బోయెను. అది చాలదూరము తీసికొనిపోఁగా రాముఁ డాగ్రహించి కోలఁ గూలనేసెను. అది చచ్చుచు రాముని కంఠనాదముతో హాలక్ష్మణా! యని యార్చి చచ్చెను. ఆనాదమువిని సీత లక్ష్మణుని రామునకుం దోడుగాఁ బొమ్మని ప్రార్థించెను. అతఁ డెన్నివిధముల వలదని చెప్పినను వినక యనరాని మాటలాడ నాలక్ష్మణుఁడు వినవొల్లక వనదేవతలకు సీత నప్పగించి రాముని కొఱకుఁ బయనమైపోయెను. రావణుం డంతటఁ గపటసన్న్యాసివేషమునవచ్చి సీతతో మంచిగాఁ దొలుత మాటలాడి యవల నిజరూపముం జూపి యామె మూర్ఛపోఁగా నెత్తుకొని పోయెను. ఆజానకి తెలివొంది యేడ్చుచుం బోయెను.

కుండి—(ముక్కుపై వ్రేలుంచుకొని) అక్కా! ఈస్త్రీజన్మ మెంతవ్యర్థమైనది? ఒక్క రాక్షసునుండి తప్పించుకొనఁజాలక పోయెఁగదా!.

కపా—సోదరీ! రామున కపకీర్తి వచ్చునేమో యని భయంపడినది కాని లేకున్న నాతనివంశము నశించునట్లు శాప మీయక జానకి విడుచుననుకొంటివా?.

కుండి.—ఇంక సీత గతియేమి?

కపా!—రామలక్ష్మణు లాశ్రమంబునకు వచ్చి సీతను వెదకి రావణునింజంపి జానకిని మరలఁ బిలుచుకొని రాకమానరు.

కుండి.—ఈవృత్తాంత మంతయు నీకెట్లు తెలిసినది?

కపా.—అదృశ్యరూపమునఁ జూచుచుంటిని.

కుండి.—ఇంక జరగనున్న కార్యముల నాకుఁ జూపరాదా?

కపా.—సోదరీ! ఇపుడే రామలక్ష్మణులు వచ్చుచున్నారు. మన మదృశ్యరూపముల వారలకియుందుము. రమ్ము.

(అని యిరువురు నిష్క్రమింతురు.)

ఇది విష్కంభము.

అంతట రామలక్ష్మణులు పర్ణశాలం బ్రవేశించుచున్నారు.

రామ.—[1](ముందు పర్ణశాలం జూచి) వత్సా! సీత గానరాలేదే. ఏల? (అని లోనికిం బరుగిడుచున్నాఁడు).

లక్ష్మ.—పూవులు కోయంబోయియుండునేమో.

రామ.—లక్ష్మణా! పర్ణశాల పాడుపడినట్లున్నదే. పూర్వమెప్పుడైనను ఇట్లుండెనా?

లక్ష్మ.—మీరు విచారముతోఁ జూచుచున్నారుగాన నిట్లగపడుచున్నది కాని మఱేమియులేదు.

రామ.—(చెవియొగ్గివిని) వత్సా! లోపలనేమో చప్పుడగుచున్నట్లున్నది. (పిలిచెద) జానకీ! జానకీ! జానకీ! (అని పిల్చును).

లక్ష్మ.—ఏదినెగారూ, అది మాయామృగమేయైనది. వాఁడు మారీచుఁడు.

రామ.—నాయనా! పలుకలేదే. ఇంకెక్కడిసీత! లక్ష్మణా! (అని చదికిలఁబడును).

లక్ష్మ.—(ఆశ్వాసించి) రామచంద్రా! ఇదమిత్థమని తెలియకమునుపే మీరిట్లు దుఃఖించిన నేనేమిచేయఁగలను?

రామ:—నాయనా! సీత జాగ్రత్తగాఁ గాపాడుమని చెప్పిన నామాట వీటిఁబుచ్చితివి కదా. నీవున్న నిట్టిపాట్లు సీతకు రాకుండుఁగదా. (అని విలపించును)

లక్ష్మ.—[2]కష్టములనుండి తేలినఁగాని కీర్తిరాదని మహర్షులు చెప్పనే చెప్పిరి. ఆమాటలిపుడు ఫలించినట్లు మీరేడ్చుచున్నారే. ఏలదుఃఖించెదరు?

రామ.—ఈజన్మమే దుఃఖములరాశి ఇంకను సీతను జూడఁగల్గుదునా నాయనా.

లక్ష్మ.—[3]ఓరామభద్రా! త్వరపడుము నాలుగు ప్రక్కలఁ దిరిగిచూతము. గోదావరికేమైన జానకి పోయియుండునేమో.

రామ:—(ఆశ్రమంబు వెడలి) అక్కటా!

---

1 పూర్వాంకములోనివిషయము నీయంకములోని కనతరింపఁజేయుటచే నిది యంకావతరణము.

2 బీజనిర్వహణమున నిర్వహణసంధి యారంభింపఁబడినది.

3 కార్యమార్గణరూపమగుట నిది విబోధము.

సీ. పంకజంబులు లేని ♦ పద్మాకరము భాతి
శశి లేని తారకా♦సమితి రీతిఁ
దిలకంబు పెట్టని ♦ వనితఫాలము మాడ్కి
వాసన లేని పు♦ష్పంబు కరణి
జ్ఞానలేశము లేని ♦ జనుని కర్మము వలె
సద్విద్య లేని యా♦స్యంబు పగిది
ఫలవృక్షములు లేని ♦ లలితవనంబట్లు
శారిక లేని పం♦జరము తేవ
తే. ధర్మములరని రాజు చం♦దమ్ముగాఁగ
శీలమే లేని పండితు♦పోలిక నివు
డాశ్రమం బిద్ది సీత లే♦నట్టి కతన
నలరకున్నది చూడుమా ♦ యనుజ కడఁగి. 1

లక్ష్మ.—(పక్షికూజితముల నాలకించి) రామచంద్రా! సీతవాక్యములు వినఁబడుచున్నట్లున్నది. గోదావరికిం బోయి వెదకుదము.

రామ.—(ఆలించి) వత్సా! గోదావరికి స్నానము చేయుటకై వెళ్లినట్లున్నది.

(అని యిరువురు పరుగిడుచున్నారు).

రామ.—వత్సా! మనకు వినఁబడినవి ఈపక్షికూజితములు. వీనినడిగెద. హంసలారా! జానకిజాడ మీకుఁ దెలియునా?

(హంసలు దక్షిణముగా మోములం ద్రిప్పి యీఁదుచుండును)

లక్ష్మ.—రామా! దక్షిణభాగముగా నీఁదుచున్నవే. గోదావరి ప్రాగ్వాహినిగదా. ఇందేమో గూఢార్థమున్నది.

రామ.—(కన్నీరు విడుచుచు) హరిణములారా! హరిణాక్షిని జానకిని జూడలేదా?

(హరిణములు దక్షిణముగా మోరలు ద్రిప్పి నిలువఁబడును.)

లక్ష్మ.—అన్నా! ఇవియు దక్షిణముఖముగాఁ దిరుగుచున్నవే.

రామ.—వత్సా! మీవదినె తెలియక యేమోయన్నంతమాత్రమున విడిచి రాఁ జెల్లునే. బుద్ధిమంతుఁడవయ్యు నేల యిట్టిపని చేసితివి?

లక్ష్మ.—[1]దుర్భరమై శ్రవణపుటవిదారణక్షమమగు పల్కులను వినఁజాలక వచ్చితిని. విధికృతమునకు లోను గానివారు కలరా?

1 అనుభూతాఖ్యానమగుట నిది నిర్ణయము.

రామ.—(నలుదెసలు పరికించి) వత్సా! ఇఁక సీత యిందున్నదని వెదకుట కేవల మసంగతము.

చ. దనుజులు పంతమూని వని♦తామణిఁ బట్టి చలంబు మీఱఁగా
దినిరో క్షుధాతురంబులయి ♦ తీక్ష్ణముఖంబుల నొప్పు సత్త్వముల్
మనమిట లేమి నిల్వెడలి ♦ మానిని పూవులు కోయుచుండ క్రిం
గెనొ యెఱుఁగంగఁజాల నిది ♦ కేవలదుఃఖకరంబు తమ్ముఁడా!. 2

లక్ష్మ.—[1]అన్నా! ఇపు డాయా విషయంబులం బట్టి చింతించిన లాభమేమి? ప్రకృతమే కార్యము చేయవలయునని నిశ్చయించి యట్లు ప్రవర్తింతము.

౨౮. పాట.

రామ —

క. పురమునకు నీవు పొమ్మికఁ
దరుణీమణి నాత్మఁ దలఁచి ♦ తలఁచి యిచట దు
స్తరదుఃఖవార్ధిలోఁ బడి
మరణించెద నింక నేటి♦మాటలు వత్సా!. 3

చ. పురమున కేను రాఁగ గురు♦భ్రాతలు వృద్ధులు వచ్చి రాఘవా
తరుణిని గూడిపోయి గురు♦ధర్మము దీర్చి యొంటివచ్చితే
పురుషునివృత్తియే యిదని ♦ పోలఁగ నాడిన నేమిపల్కుదుర్
ద్వరపడి యిందు చచ్చుటయె ♦ బాగుగదా సడికంటె లక్ష్మణా!. 4

లక్ష్మ.—[2]రఘుకులోద్ధారకా! రామచంద్రా! నీవేయిట్లు ధైర్యమును విడనాడి దుఃఖించిన నింక ధీరులెవ్వరుందురు? కులగౌరవమును దలంపుము. సీతాపహారకుని ఖండములు ఖండములుగాఁ జేసి సీతను మరలింపఁ బ్రయత్నింపుము. ఖరాది దుష్టదానవుల నందఱ మ్రందించిన నీకుఁ దక్కువార లొక్కలెక్కయా? శరచాపములు చేతనుండ క్షత్రియోత్తముఁ డెవ్వఁడేని దుఃఖింపఁదగునా?

రామ.—వత్సా! నీమాటలు విన్నపుడు ధైర్యమును, సీతను దలంచుకొన్నపుడు విషాదమును బైబై పోరలాడుచున్నవి ఏమిచేయను దోఁచకయున్నది.

లక్ష్మ.—మనమిపుడు చేయఁదగినపని సీతను వెదకుటకాదా?

రామ.—వత్సా! నిశ్చయమే. ఈమహారణ్యమధ్యభాగమున నెందున్నదని వెదుకవలయును? నాకేమియుఁ దోఁచకున్నదిసుమీ.

1 మిథోజల్పనమగుట నిది పరిభాషణము.
2 పర్యుపాసనమగుట నిది ప్రసాదనము.

లక్ష్మ.—హంసలు మృగములు దక్షిణభాగమును సూచించినవికదా. అవి కపటమెఱుఁగనివి. అవి చూపినత్రోవయే మనకు గమ్యము.

రామ.—నాయనా! అట్లేపోదము. (అని నాలుగడుగులు నడిచి) లక్ష్మణా! ఇందు సీతయాభరణలేశములు పడియున్నవి. చూడుము. (అని వానిం దీసికొని హాసీతా యని మూర్ఛిల్లును).

౨౫. పాట.

లక్ష్మ.— (సేదదేర్చి) రామభద్రా! ఇఁక దుఃఖించి లాభములేదు. సీతను దుష్టమృగములు చంపలేదని స్పష్టమాయెను. భూమియందు నడుగులజాడ లేదుగాన నెవరో యెత్తుకొని యంబరమునఁ బోయెననియుం దెలియనైనది. కాన సీత ప్రాణములతో నున్నది. శత్రుసంహారమునకుఁ బ్రయత్నింతము. మనకది కష్టసాధ్యము కాదు.

రామ.—(ఆగ్రహముతో) లక్ష్మణా! శరాసనము సజ్యముచేసి బ్రహ్మాస్త్రముం గూర్తుము. సకలశత్రుక్షయ మొనరింతము.

లక్ష్మ.—రామచంద్రా! ఏలయిట్టు లాతురపడియెదవు? శత్రువు వీఁడని తెలిసినగదా బ్రహ్మాస్త్రమును విడువవలయుం. తెలిసికొనకయే యస్త్రమును బ్రయోగించిన లోకప్రళయమగును. నిరపరాధులందఱు మ్రందుదురు.

రామ.—[1](కౌఁగిలించుకొని) సోదరా! లక్ష్మణా! నీకంటె సుగుణాఢ్యుఁడు కలఁడా. ఆపద్బంధువవు. నీపలుకొక్కటియు నొక్కొక్కరత్నమే యనఁదగినది. నాదుఃఖము తొలఁగినది. ఆచోటఁ బరాక్రమము నెలకొన్నదినుమీ. ఇఁకఁ జేయఁదగినపనికై కడంగుదము.

లక్ష్మ.—ఇఁక మనము వెదకుచుఁ బోవుదము.

రామ.—వత్సా! మంచిది. (అని కొంతదూరముపోయి) తమ్ముఁడా! అదిగో అదిగో (అని గట్టిగాఁ జెప్పును).

లక్ష్మ.—(ఉలికిపడి) అన్నా! ఏమది? ఏమది?

రామ.—సీతను జంపినపక్షి.

లక్ష్మ.—(బాణముంగూర్చి) ఏది? (నాలుగడుగులు నడచి) అన్నా! ఆనాఁడు మనము చూచిన జటాయువుకాదా యిది. పితృసఖుఁడు.

రామ.—(చక్కఁగాఁ జూచి)

---

1 దుఃఖప్రశమనరూపమగుట నిది సమయము.

తే. పక్షములు తెగి ముక్కునఁ ♦ బఱఁగు రక్త
ధారలను భూమిఁ దడుపుచుఁ ♦ దవ్వరగ వెడల
నున్నయసువులతో జటా♦యువు పొరలెడు
ధరణి నేమొకో హేతువు ♦ తెలఁపఁజాల. 5

లక్ష్మ.—(చెవిలో గట్టిగా) జటాయువా! పక్షిరాజా! దశరథప్రియమిత్రమా! ఏమి యిట్లున్నావు? మేము రామలక్ష్మణులము. సీతజాడ నీకేమైనఁ దెలియునా?

జటా.—(కన్నులు విప్పి) రామా (అనిపిలుచును).

రామ.—నేనే రాముఁడ. (అని చెవిలోఁ జెవిసుంచును).

జటా.—సీతను రావణాసురుఁ డెత్తుకొనిపోవుచుండఁగాఁ దలపడి నిల్పితిని. వానిరథము గుఱ్ఱములు పాడుచేసితి. అతఁడు ఖడ్గప్రహారమున నాపక్షముల ఖండించెను. గట్టిదెబ్బలు తగిలినవి. మీకీవార్తఁ దెలిపి ప్రాణములు వదలవలయునని యుంటిని. రావణుఁడు లంకలోనున్న రాక్షసరాజు. ఇంకఁ బ్రాణములు నిల్వవు. నిన్నే స్మరించుచున్నాఁడను. మాటలాడఁజాలను. నాకుఁ బుణ్యలోకములఁ గల్పింపుము. (అని ధ్యానము చేయుచుండును)

రామ.—వత్సా! లక్ష్మణా! ఇంకెక్కడిసీత? (అని శరశరాసనముల నేలపై వైచును)

లక్ష్మ.—[1]రామభద్రా! శరాసనమును సజ్యము చేయవలసినకాలమిది. ఇపుడు దానిని గ్రిందవైచుట పాడియా. క్షత్రియకుల మర్యాదయా. వైరి వీఁడని తెలిసినది. ఇంక నాతనిం జెండి సీతను దేవలయు. ఈవృద్ధపక్షిరాజు మనకు సీతజాడఁ దెల్పి మహోపకారమును గావించెను. మనవాంఛితము నెఱవేఱినట్లే. ఇఁక నీతనికిం బ్రత్యుపకారమును గావించి మనము ముందు పోవుదము.

(అగ్నిసంస్కార మొనర్తురు)

రామ.—వత్సా! మాయామృగమని నీవు చెప్పినప్పుడే నేను బోవుటుడిగిన నీవిపత్తు సంభవింపకుండుఁగదా. ప్రమాదంపడితిని.

లక్ష్మ.—గతజలసేతుబంధమన్నట్టు లామాట లిపుడేల? నీచే రావణుండుకూడ మ్రందవలసినట్లు విధి వ్రాసియుండ నేల యన్యథాజరగును?

రామ.—నిశ్చయమే. లక్ష్మణా! నీవన్నమాటలెల్లఁ బ్రమాణములుగాఁ గ్రహింపఁదగినవియే. కావున నానిశ్చయమును విను.

---

1 వాంఛితార్థప్రాప్తి యగుట నిది యానందము.

తే. [1]రాఘవుఁడో రావణుండో ధ♦రాస్థలమున
నిలువఁగల రింతియేకాని ♦ చెలఁగు ఖ్యాతి
నిద్దఱును నుండ రిఁకమీఁద ♦ నిది నిజంబు
సురలు నావిక్రమంబును ♦ జూడఁగలరు. 6

లక్ష్మ.—అన్నా! అపౌరుషమును మనస్సున విడువకుండనున్న శరణాగతులైనవారే బ్రదుకఁగలరు.

రామ.—వత్సా! మన మిఁకఁ జేయఁదగినదేది?

లక్ష్మ.—దక్షిణాభిముఖులమై ముందున కరుగుదము.

రామ.—మంచిది నాయనా! వెళ్లుదము పద. (అని నడచుచున్నారు)

లక్ష్మ.—రఘువీరా! ఇదేమోవిచిత్రముగా నున్నదే.

రామ.—ఏమి నాయనా! ఆయాశ్చర్యము.

లక్ష్మ.—రామా! నాశక్తి యేమియు నుపయోగింపఁజాలకున్నాఁడ.

రామ.—ఎవఁడు రాక్షసుఁడా! నాకగపడలేదే.

లక్ష్మ.—మనమిరువురము ఇకెట్లుపోవుచున్నామో చూడుఁడు.

రామ.—వత్సా! ఇది యొకమాయ. ఎవఁడో మనల నిరువుర నాకర్షించుచున్నాఁడు. కానీ, శరముఁగూర్చి కార్ముకమును జేతఁబట్టి యుండుదము, అవల దైవము పంచినట్లు కానిమ్ము.

లక్ష్మ.—రఘువీరా! ఇదె ముందొకవికృతశరీర మగపడుచున్నది. దానికి శిరస్సు లేనే లేదు. పెద్దనోరు కడుపులోనున్నది మనల నిఁక మ్రింగును. వేగంబ యీరెండుబాహువుల ఖండింతము.

రామ.—నాయనా! భయపడకుము. నేనుండఁగా నీకేమిభయము? నేను కుడిబాహువును ఖండించెద. నీ వెడమభుజమును ఖండింపుము. (ఇరువురు అట్లే చేయుదురు. కబంధుఁడు క్రిందఁబడును)

కబం.—ఎవరుమీరు? రాజపుత్రులవలెఁ గనఁబడుచున్నారే.

లక్ష్మ.—దశరథపుత్త్రులము. రామలక్ష్మణులనువారము. నీవెవ్వఁడవు?

కబం.—(దివ్యరూపమును దాల్చి ఆకాశమున విమానారూఢుఁడై నిలువంబడి) మహాపురుషా!

లక్ష్మ.—ఈరూపము నీకెట్లువచ్చెను?

దేవ.—[2]నాకుఁ బూర్వమొకముని శపించుట నీరూపము లభించినది. శాపమోక్షమును

1 లబ్ధస్థిరీకరణరూపమగుట నిది కృతి.
2 మానావ్యాప్తియగుట నిది భాషణము.

బ్రార్థింపఁగా రామలక్ష్మణు లెపుడు నీహస్తములను ఖండితురో అపుడు నీకీశాపమున కంతము గల్గును. నీస్వరూపము నీకలవడునని చెప్పెను. నేఁటికా శుభకాలము వచ్చినది మహాత్ములారా! మీకు శుభమగుఁగాక. మీరు వచ్చినకార్యమిపుడే నెఱిఁగితిని. సీత మరల మీకు లభించును. ముందు ఋశ్యమూకమున నున్న సుగ్రీవునిం జూడుఁడు. అతఁడు వాలియను తనయన్నచేఁ దఱుమఁబడి నలుగురు కపులతోఁ గూడియుండును. అతనితో మైత్రి సేయుఁడు. మీకార్యమెల్ల నాతఁడు నెఱవేర్చును. విజయము లభించును. మహాత్ములారా! నమస్కారములు. ఇదె పో నుద్యమించెద. శ్రీరామా!

సీ. జగముల సృజియించి ♦ చక్కఁగాఁ బాలించి
తరుణంబునం ద్రుంచు ♦ పరమపురుష!
శిష్టులఁ బాలించి ♦ దుష్టులఁ దూలించి
ధర్మంబు నిల్పెడు ♦ నిర్మలాత్మ!
జ్ఞానుల నలరించి ♦ దీనులఁ బోషించి
మహిమను దెల్పెడు ♦ మహితశీల!
యమరుల వెలయించి ♦ యసురుల నలయించి
శక్తిమించెడునట్టి ♦ చక్రపాణి.
తే. నిన్ను నెన్నఁగశక్యమే ♦ నీరజాక్ష
వేదములు నీమహాత్వంబు ♦ విస్తరించి
పలుకనేరవు నేనేమి ♦ పలుకఁగలను
గరుణఁ గావుము శ్రీరామ ♦ కమ్రనామ. 7

మహాత్మా! నీనామస్మరణమహిమచేఁ గృతార్థుఁడ నయ్యెద. ఇఁక సెలవిండు. నీయశఃకీర్తులు త్రిజగంబుల వ్యాపించుఁగాక.

(అని యందఱు నిష్క్రమింతురు)

(శబరి పండ్లబుట్టతోఁ బ్రవేశించుచున్నది.)

౨౭. పాట.

శబరి.—(తనలో) నేఁడేమో అత్యంతసంతోషము పొంగుచున్నది. ఎన్నఁడు నాకిట్టి యానందము గల్గినదియే లేదు. నేఁడేమో మహాపురుషసందర్శనము లభించునేమో. ఇపుడే పంపాసరస్సుచెంతకుంబోయి మంచిపండ్లు తెచ్చితిని. మధురముగా నున్నవి. చక్కఁగాఁబండియున్నవి. ఈనూఁడుపండ్లు పరీక్షింపలేదు.

ఇవి యీవనములోనివి. (అని కొంచెము చవిచూచి) ఆహా! మేలయినపండ్లివి. వీని నేమహాత్మునకు నర్పించుభాగ్యము నేఁడు లభించునో చూచెద.

(శ్రీరామలక్ష్మణులు ప్రవేశించుచున్నారు.)

రాము.—లక్ష్మణా! ఏమియీయాశ్రమము శాంతరసమునకుఁ బుట్టినిల్లుగనున్నది? పేశబ్దము వినఁబడలేదు. పశువులుగూడఁ గూయుజాడ కానరాలేదే. ఎవరిదో యీయాశ్రమము?

లక్ష్మ.—రామచంద్రా! చూడుమా వృద్ధతపస్విని కూరుచుండియున్నట్లున్నది.

రాము.—(చక్కఁగాఁ జూచి) ఔను. మహాత్మురాలుగాఁ గనఁబడుచున్నది. లోపలికిఁ బోదమురా.

(ఇరువురు ప్రవేశింతురు)

శబరి.—(రామచంద్రునిం గాంచి దివ్యజ్ఞానము ఫలింప నెదురువచ్చి) మహాత్మా రామచంద్రా!

(అని రామునికి నమస్కరించి పిదప సౌమిత్రికి నమస్కరించును)

రాము.—సిద్ధతపస్వినీ! నీవెవ్వతెవు? సదోపవాసము లొనర్చి యీతపస్సిద్ధిని బొందితివా?

శబ.—నాయాతిథ్య మంగీకరింపుఁడు.

రాము.—పరమానందభరితుఁడ నైతిని.

శబ.—మహాత్మా! నేఁడు విష్ణురూపుండవగు నీకు నమస్కరింపఁ గల్గితి. నాతపస్సు ఫలించినది. అక్షయపుణ్యలోకములు లభించును. నీకరుణాదృష్టిం బరిశుద్ధురాలనైతిని నేను శబరి యనుదాన. నాయాచార్యులగు మతంగమునులు స్వర్గమునకుం బోవుచు "రామలక్ష్మణులు రాఁగలరు. వారిం బూజింపుము. దాన నీకు నక్షయముక్తి లభించు"నని చెప్పి పరమపదమునకుఁ బోయిరి. రామా! పంపాతీరమునకుంబోయి యివిగో మేలిఫలములను రుచిచూచి మంచివానినే తెచ్చినదాన. వీనిని గ్రహియింపుము.

౨౭. పాట.

రాము.—శబరీ! ఈఫలములు నాకుఁ దృప్తినిచ్చినట్లు, ఏఫలములు తృప్తినీయఁజాలవు. (అని భక్షించును. లక్ష్మణుఁడును భక్షించును.)

శబరి.—మహాత్మా! నేఁటికిం గృతార్థురాలను. పరమపురుషునిఁ జేతులార సేవింపఁగంటిని. నీయనుజ్ఞనొంది యీయస్థిరదేహమును వదలి శాశ్వతపదము నొందెద.

రాము.—(పరమానందముతో)

క. పరితృప్తి నొందినాఁడను, నిరుపమమగు తావకీన ♦ నిశ్చలసేవా
పరతకు నింకం జనుమా, పరమస్థానంబు నొందఁ ♦ బావనగాత్రీ! 8

శబ.—(నమస్కరించి) ఈవనమెల్లం జూడుఁడు. ఇందలివిశేషంబులం గాంచి పంపాసరోవరంబునకుం బొండు. మీకార్యంబు నెఱవేఱు. నా కనుజ్ఞ యిండు

(అని యందఱు నిష్క్రమింతురు)

(సుగ్రీవుఁడు నల్వురకపులతోఁ బ్రవేశించుచున్నాఁడు)

సుగ్రీ.—పవననందనా! ఇంతవఱకు సుఖముగా నుంటిమి మరల సంకటములు వచ్చినవే. గతియేది?

హను.—రాజా! ఏమియట్టియిడుమలు వచ్చినవి?

సుగ్రీ.—ఆచాయఁ జూడుము. ధనుర్బాణంబులం దాల్చిన మహావీరు లిరువురు కనఁబడుచున్నారుకదా?

హను.—కపిరాజా! ఔను! కనఁబడుచున్నారు. దాననేమిబాధ?

సుగ్రీ.—వాలి పంపిన మనలం జంపుటకై వచ్చినవారని తెలియఁజాలకపోతివికదా?

హను.—అందులకా యింతసేపు గంతులువైచి కొండలన్నియుఁ దిరిగివచ్చినది?

సుగ్రీ.—అవును. నీవేమని వారలం దలంచుచున్నాఁడవు?

హను.—వాలికి నీపైనున్న విరోధము కాలము గడచుటచేఁ గొంతతగ్గియుండును. కాన వీరిని వాలియే పంపెనని నిశ్చయించుట అంతమంచిమార్గము కాదని నాభావము

సుగ్రీ.—హనుమంతా! నాస్థితి యిపుడెట్లున్నదో చెప్పెద, వినుము.

తే. తూర్పుపడమర వాయువుల్ ♦ తోడఁగ కట్టె
వీచుచుండంగ నిటునటు ♦ వీచికలకుఁ
బొరలు నొకవిధంబున ♦ బుద్ధి కదలు
చున్న దిట్టటు వీరలఁ ♦ గన్నకతన. 9

౨౮. పాట.

హను.—కపీంద్రా! భయ ముడుగుము. నేఁబోయి వారివృత్తాంతముల నరసివచ్చెద ఇందే యుండుము.

(అని నిష్క్రమించుచున్నాఁడు)

(పంపాసరస్సుకడ రామలక్ష్మణు లుండ హనుమంతుఁడు ప్రవేశించుచున్నాఁడు.)

౨౯. పాట.

హనుమ:—(రామలక్ష్మణులచెంతకుఁ బోవును)

రాము:—వత్సా! ఎవ్వరో మనచెంతకు వచ్చుచున్నట్లున్నదే?

లక్ష్మ:—(దృష్టిసారించి) భిక్షువు.

రాము:—ఆతనిముఖవర్చస్సు విచిత్రముగనున్నది. సకలవిద్యాపారంగతుఁడే యీతఁడని చూడఁగనే తోఁచుచున్నది.

హను:—(ప్రవేశించి) మహాత్ములారా! నమస్కరించుచున్నవాఁడ. మీరెవ్వరు? ఇటకేలవచ్చితిరి? నాకుం జెప్పుఁడు.

రాము:—వత్సా! నిష్కపటాత్ముఁడగు నీతనికి మనవృత్తాంతమెల్లఁ జెప్పుము.

లక్ష్మ:—

సీ. దశరథభూజాని ♦ తనయుల మగుదుము
రాముఁ డీతఁడు సుర ♦ రాజసముఁడు
తమ్ముఁడ నేను నీ ♦ తనికి లక్ష్మణుఁ డనఁ
బిలువంగఁబడువాఁడఁ ♦ బిన్నతల్లి
కోరినఁ దండ్రియు ♦ నూరకుండఁగ నన్న
భార్యనుగూడి యీ ♦ భవ్యచిత్తుఁ
డడవులఁ బదునాల్గు ♦ హాయనంబులు వుచ్చఁ
జనుదెంచి రాక్షస ♦ సమితిఁ జెండె
తే. నాశ్రమంబున మేము లే ♦ నట్టితఱిని
రావణుం డేగుదెంచి యా ♦ రాముపత్ని
సీతఁ గొనిపోయె నామెకై ♦ యీతఁ డిట
వచ్చితిమి త్రోవ నిద్దానిఁ ♦ బట్టి మేము. 10

ఇదియె మావృత్తాంతము. ఇఁక నీవృత్తాంతమును వినఁగోరెదము.

హను:—మహాత్ములారా!

తే. అంజనాదేవికడుపున ♦ ననిలువరము
కలిమిఁ బుట్టితి హనుమనా ♦ వెలయువాఁడ
నర్కజుండైన సుగ్రీవు ♦ ననుచరుండ
వనచరుండను మిముఁ జూడ ♦ వచ్చినాఁడ. 21

వాలి తమ్ముండగుసుగ్రీవుండు ఋశ్యమూకంబున నున్నవాఁడు వాలిచ్యుతరాజ్యకళత్రుండై విధివశంబున నిందున్నవాఁడు. మీరాసుగ్రీవుని జూడఁదగునేని చనుదెండు.

రాము:—తప్పకవత్తుము. మీరాజుం జూడఁగోరియే యిచ్చటికి వచ్చితిమి. శబరి మీరాజువృత్తాంతమును జక్కఁగాఁ దెల్పెను.

౩౦. పాట.

హను:—క్షణమాత్రంబునమిమ్మటకుం గొంపోయెద. నాభుజములపైఁగూరుచుండుఁడు.

(అందఱు నిష్క్రమింతురు)

(తారయు వాలియు నేకాంతమునఁ బ్రవేశించుచున్నారు)

తార:—ప్రాణనాథా! అత్యద్భుతవిషాదముల నొసఁగూర్చువార్త యొకటి వినఁబడినది.

వాలి:—ఏ మావార్త?

తార:—రామలక్ష్మణులను దశరథునికొడుకులు దండకారణ్యమునకువచ్చి ఖరదూషణాదిదుష్టరాక్షసులం జంపి మునులకష్టములఁ దీర్చినట్లు, రావణుఁడు కపటవేషమున వారింట లేకుండుతఱుణమున వచ్చి రామునిభార్యను సీతను గొనిపోయినట్లు, వారు సీతజాడను గనుఁగొనుటకై యీప్రాంత్యములకు వచ్చి సుగ్రీవునితో సఖ్యముచేసి నిన్నుఁ జంపి యీరాజ్య మిప్పింతునని వాగ్దానము చేసినట్లు అంగదుఁడు వేఁటకుఁ బోయినప్పుడు వనచరులనుకొనుచుండఁగా విని నాతోఁ జెప్పినాఁడు. అప్పటినుండియు నాచిత్తము చింతాసముద్రమున మునిఁగియున్నది. ఇంకనైనను సుగ్రీవుని బిలిపించి యాతనిభార్యనిచ్చి విరోధము పోఁగొట్టుకొనుట మంచిది. రాముఁడు భగవదవతారమఁట.

వాలి:—(వీఁపుతట్టి) ఏలా! భయపడకుము. సుగ్రీవుఁడు నన్నేమిచేయఁగలఁడు? రాముఁడు భగవంతుఁడేకానీ! అతనికి నేనేమియపకారము నొనర్చితినని నన్నుఁ జంపును? విరోధమునకుఁ గారణము వలదా? నిష్కారణముగా నన్నుం జంపునేని భగవంతుఁ డెట్లగును? భగవంతుఁడు కాఁడేని నన్నుం జంప నెట్లు శక్యమగును? స్త్రీసహజమగు భీతిని బాసి యూరకుండుము.

తార:—దీర్ఘద్వేషము పనికిరాదను పెద్దలవాక్యమునైనఁ బాటింపఁగూడదా?

వాలి:—సుగ్రీవుఁడు శరణుచొచ్చినఁ గాపాడెద. యువరాజుం జేసెద. లేకున్న నూరకుండెద. అంతియకాని నేనుబోయి కాపాడుమా యని యడుగఁదగునా? అట్లడుగుదునా? ఏలయీలీల లేనిపోని భయహేతువులం జింతించి కుందెదవు. సంతోషముతో నుండుము.

(నేపథ్యమున గంభీరధ్వని)

తార:—(అదరిపడి) నాథా! ఏమీధ్వని?

వాలి:—(చెవియొగ్గి విని యెగిరిపడి) ప్రాణేశ్వరీ! అదె సుగ్రీవుఁడు యుద్ధమునకుం బిలుచుచున్నాఁడు. ఇదెపోయి యాతనియాటోపంబు మాన్పివచ్చెద.

౩౧. పాట.

తార.—(త్రోవ కడ్డమువచ్చి గడ్డముపట్టుకొని) ప్రాణేశ్వరా! ఇంతకాలము ఋశ్యమూకమును విడువనిసుగ్రీవుఁ డిపుడు నిర్భయుఁడై నిన్ను యుద్ధమునకుఁ బిల్చుట కేదియో గొప్పసాయము కల్గియుండును. లేకున్న రాఁగలఁడా? నేను విన్నమాటలే సత్యములైనట్లు తోఁచెడిని. ఇంతటనైన నామాట లాలకింపుఁడు. యుద్ధమును మానుఁడు. నేనుబోయి సుగ్రీవుని శాంతచిత్తుని జేసి రామలక్ష్మణులఁ బ్రార్థించి వచ్చెద.

వాలి:—(హుంకార మొనరించి) తారా! ఏమిపిఱికితనమును వెల్లడించుచున్నదానవు. వీరపత్నివగుట మఱచితివా యేమి? రాముఁడు భార్యను బోఁగొట్టుకొని రావణునిం జంప సుగ్రీవునాశ్రయించినవాఁడుకదా! ఎంతటిశూరుఁడు? ఇరువురు భార్యలఁ బోఁగొట్టుకొన్నవారు గాన సఖ్యము కుదిరియుండవచ్చు. అట్టిమహాశూరుఁడు నన్నేమిచేయఁగలఁడు?

(అని నిష్క్రమించును)

(పిదప రామలక్ష్మణులు కిష్కింధదగ్గఱ నుద్యానమును బ్రవేశించుచున్నారు.)

రాము:—[1]వత్సా! లక్ష్మణా! కబంధుఁడు శబరియుం జెప్పినరీతి సుగ్రీవునితో సఖ్యము కుదిరినది. వాలిం బడనేసితిమి. సుగ్రీవుఁ డిఁకఁ బట్టభద్రుఁడై వనచరులం బిల్వంబంచి మనకార్యము చేయఁగలఁడనియే తోఁచుచున్నది. హనుమదాదులు సజ్జనోత్తములు. కార్యము నెఱవేఱినట్లే యనుకొనవచ్చును. అందులకుఁదగు శుభచిహ్నములు కనఁబడుచునేయున్నవి.

౩౨. పాట.

లక్ష్మ:—[2]రామభద్రా! సుగ్రీవసఖ్యము కుదురుటయే కార్యమునకు సిద్ధికదా. వాలియుం బడియె. దేవతలు మీప్రతాపమును వినుతిచేయుచున్నారు ఇఁక రావణుండు పడుట కేమిసంశయము? ఇఁక రావణుఁ డెంత? మనకష్టములు గట్టెక్కినవి.

రాము:—(ముందు చూచి) వత్సా! సుగ్రీవుఁడు మనకొఱకై కాచియున్నట్లున్నది.

(అని యిరువురు ముందునకు నడచుచున్నారు)

సుగ్రీ:—(ఎదుర్కొని) మాయన్న యఖండపరాక్రమశాలి వాలి మీదర్శనమును మరలఁ గోరుచున్నాఁడు.

రాము:—మంచిది. (దగ్గఱకుంబోయి) మహేంద్రనందనా! మనస్సున నేసంశయము

---

1 కార్యదర్శనరూపమగుట నిది పూర్వభావము.

2 అద్భుతార్థప్రాప్తిరూపమగుట నిది యుపగూహనము.

లుంచుకొనకుము. నీచెప్పినరీతి నిఁక జరపుభారము నాది అంగదుఁడే యువరాజగు. సందియ మొందకుము

వాలి:—(సన్నని యెలుంగున) రామచంద్రా! నారాయణమూర్తీ! పరమపురుషా! నీసందర్శనమైనపుడె నాజన్మము పవిత్రమైనది. నాతపస్సులు ఫలించినవి. నాకోరికలు నెఱవేఱినవి. ఒక్కకోరిక యున్నది.

రాము:—(దేహమును హస్తమునఁ దడవి) మహాత్మా! నీకోరికను దీర్చుభారము నాది కోరుము. ఆలస్యమేల?

వాలి:—సుగ్రీవుని పట్టాభిషేకమును, అంగదుఁడు యువరాజగుటయు వినఁగోరి ప్రాణముల నిల్పుకొని యున్నవాఁడ ఆవార్త నాచెవులఁ జొనిపి యింకొక్కసారి మీరు దర్శనమిచ్చినఁ జాలు. ఇదియ నావాంఛ.

33. పాట.

రాము:—మంచిది. నీచెప్పినట్లే చేసెద. సుగ్రీవా! మీయన్నపలుకు లాలకించితివి గదా. వేవేగ కిష్కింధం బ్రవేశించి యభిషేకసంభారములం గూర్పనియమింపుము.

సుగ్రీ.—తమయానతి శిరసావహించెద.

(అందఱు నిష్క్రమింతురు)

(ఉద్యానమున రాజాస్థానమున రామలక్ష్మణులతోఁ బరివారముతో సుగ్రీవుఁడు ప్రవేశించుచున్నాఁడు.)

పురోహితులు.—కపీంద్రా! సుముహూర్తము సమీపమున నున్నది.

సుగ్రీ.—దీనికి బదులుచెప్ప నధికారము నాకు లేదు. శ్రీరాములవారితోఁ జెప్పుఁడు. .

రాము.—సుగ్రీవా! కపిరాజ్యమును బాలింప నంగీకరింపుము. ఇది పితృపితామహాది పారంపర్యముగాఁ గపులరాజ్యము కదా?

సుగ్రీ.—

చ. వనములు కాఁపురంబు తరు•వర్యములే గృహముల్ సుమంబులే
తనువున కెన్న భూషణవి•తానము పత్రఫలంబులే సతం
బును బ్రియమైన యోదనము • భూరిమృగావళి సేవకాళిగా
వనటఁ గృశించునన్నుఁ గృప • వర్ధిల రాజుగఁ జేసినాఁడ వీ
వనితరసాధ్యశక్తిని మ•హాత్తరవిక్రమ! యోరఘూత్తమా!। 12

క. దీనికిఁ దగు ప్రత్యుపకృతి, నే నీ కొనరింప నేమిం నేర్తు సతంబున్
శ్రీనిలయు పాదములకిదె, మానసమర్పింతుఁ గొనుము మానవ తేజా!

రాము:—సుగ్రీవా! నీ వాపద్బంధుఁడవు. నీ ఋణము నేఁ దీర్చుకొనఁజాల. ఇఁకఁ జేయఁదగు కార్యమును న్యాయరీతిం జేయుము.

సుగ్రీ.—(స్మరణ మభినయించి) దేవా! అంగదు నిపుడె యువరాజుగాఁ జేసెద. అంగదా! నీవు యువరాజవయి కృత్యముల యథామర్యాదగా నిర్వహించుచుండుము.

అంగ.—చిత్తము. పెద్దలయాజ్ఞ శిరసావహించెద.

రాము.—ఇఁకఁ ద్వరగా నభిషేకోత్సవ మొనరింపుఁడు

పురో.—(సింహాసనమున సుగ్రీవు నునిచి యథావిధి నభిషేకింతురు.)

రాము.—[1]కపిరాజా! సూర్యనందనా! కోరికలన్నియు ఫలించినవి. నీకోరిక యింకేమి?

సుగ్రీ.—త్రిజగత్సంరక్షకుఁడవగు నీచెలిమిం గాంచితి. రాజ్యము లభించె. ఇంక నాకుఁ గోరఁదగినవాంఛ యేమిగలదు. ఐన నిట్లగుఁగాక!

క. [2]ధరణియు బహువిధసస్యా
భరణాన్విత యగునుగాక పార్థివముఖ్యుల్
పరఁగుదురుగాక సతతము
స్థిరధర్మపథంబులందె చెలఁగెదు వేడ్కన్. 24

(అందఱు నిష్క్రమించుచున్నారు)

[3] (ఇది నిర్వహణసంధి.)

గద్య. ఇది శ్రీమత్త్రిపురసుందరీకరుణావాప్త గీర్వాణాంధ్రకవితాప్రాభవ కాశ్యపాన్వయప్రభవ జనమంచివంశాంబురాశికుముదినీమిత్ర శ్రీసుబ్రహ్మణ్య మనీషిపుత్త్ర తాండకృష్ణాపరాభిధేయ శేషాద్రినామధేయవిరచితంబగు శ్రీరామవనవాసంబను నాటకంబునందుఁ బంచమాంకము సంపూర్ణము.

1 కావ్యార్థోపసంహృతి యగుటచే నిది సంహృతి.
2 శుభప్రశంసనరూపమగుట నిది ప్రశస్తి.
3 ఫలప్రాప్తికార్యానుగుణంబుగ నిర్వహణసంధి సాంగంబుగఁ జెప్పఁబడినది.

గేయములు.

౧ పాట.

భైరవి - రూపకము.

పరమేశ - జగదీశ - పాపావళీవినాశ ||ప||
పరిపాలితదేవేశా - భక్తమనోనివేశ ||ప||
నారదముఖమౌనివరా - రాధనసంతతమోదా |
శ్రీరమణీవామాంక - స్థితబుధసర్వాభీష్టద ||ప||
నిగమాంత, సంచారా - నిర్మలభక్తవిచారా |
జగదానందప్రచారా - శాశ్వతసుఖకర, భయహర ||ప||

౨ పాట.

అసావేరిరాగము - ఆదితాళము.

ఓయనుజ, పలుకు, వినుమా - ప్రాయక ||ఓయ||
కైకకుమారుం | డేకరణిని బా | పకార్యమొందడు ||ఓ||
అతఁడు సర్వదా - హర్షముతో దగి | హరిమునీంద్రా |
శ్రితపథమందే | యనిశ - మెగుచున్ | హతవైరియునై |
యల్లరునుగాన | నెన్నగదగుమన ||కోయనుజ||

౩ పాట.

బేహాగ్ - ఆది.

మునిపతి, యాశ్రమ, మోరఘు రామా | కనంగానెసొంపౌ |
వినూత్నంబు | రామా ||ముని||
విరులను - నెంతయు - వింతగలతలున్ |
సుసుచిరకాంతులఁ, బరగెడుగనుమా ||
సరోజాళితోఁగడు - సొరుగనీ |
సరస్సులుగానంగా - సంతోషంబౌ ||ముని||

౪ పాట

మాండు.

శ్రీనిలయ, నిగమా - శ్రితయశా। లోకేశా ॥శ్రీ॥
నీమహిమ। గనలే, రేమునుల్। శ్రీరామా ॥శ్రీ॥
భవమే, సంద్రం - బౌగద, దానిఁ, వడిదాటింతువుగా ॥శ్రీని॥
దేవతల్-మానుల్ - నీపద-మాత్రఁ-స్థిరమంచెంతురుగా॥శ్రీని॥

---

౫ పాట.

కానడ - ఆది.

సురపతి పనిచెనునన్నుఁ। ఇట ॥సుర॥
సురలపని చేయదగు। నంచుఁ ॥సుర॥
దశరథభూపతి,తనయుఁడు,సతితో।దమ్మునితోజనునంచుఁ॥సుర॥
వరకరుణానిధి। నిరుపమ, గుణునీ। పాపవిదూరునిగనగఁ॥సుర॥

---

౬ పాట.

భీమప్లాస్ - ఏక.

ఓసఖా శ్రీసఖుడగు,రాఘవుడిట।భూసురులొగిత్రోవదెలుపవేడుకఁ॥ఓ॥
అనుజుఁడుతనతో। రా, గతోపముడదె॥ కాననమున। గామగ
తిఁ। జనువిరాధు, గనుచువే॥ కార్ముకముఁ। సారించుచుబోనీ।
యనంచుజంపి, నైచేఁగడంకతో ॥ఓస॥
ఈచరితము - నిటగనుగొని। వేచనియా।
యింద్రుంగని, ప్రాచుర్యము। గా జెప్పెద ॥నోసఖా॥

---

౭ పాట.

కాంభోజి - ఆది.

అనుజా, మునీంద్రుఁ। గనుమా యిటఁ ॥అనుజా॥
నిరతంబుముక్తిఁ। స్థిరంబంచు। నెఱిదలచెడు ॥అను॥
స్మరియించుశ్రీశుఁ। మదినెప్పుడుఁ। దరిజేరిమ్రొక్కఁ।
బరువెత్తు నఘవిసరము ॥అను॥

---

౮ పాట.

కల్యాణి - రూపకము.

జానకివినుమా, ప్రీతి॥ మానితంబులౌ నరముల ॥జాన॥
అనుపమంబు - లీవసనము। లనుదినంబు - నీవిధమున। హారివర్ణ
రాజితంబు। లగుఁగుసు। మాళి, రుచిఁవి-లసిలు ॥జాన॥
మదిని ప్రాణనాథునిహరి। సదమలాత్మ। గాదలతువు।
నేదలంచి నీకునిచ్చి। తినీవ, రముల్ద, గగ్గైకొ। నదగు ॥జాన॥

---

౯ పాట.

భూప్ - ఏక.

ఓసాధ్వీ। మోదముమీరఁ। బ్రసాదమును గొంటిఁ ॥ఓ॥
పతిఁమోద। మందగజేసెడునీ। హితోక్తుల్॥ బళి ॥ఓసా॥
వరంబిద్ది। పావనమాగదప్రా।భవం బీయనౌ॥ బళీ ॥ఓసా॥
మహాప్రీతి। గైకొననాపతి స।మ్మదం బిచ్చెనా ॥కోసాధ్వీ॥

---

౧౦ పాట.

కాఫి - త్రిశ్రగతి.

శ్రీసీ, తేశుం। డీఘనుడౌరా। వాసంబిటదగం।
జేసెఁమానీశులు। భాసిల్లన్ ॥శ్రీ॥
ఇంద్రుఁసురారులా। క్రందింపఁదేవత।
లానందసాంద్రులై। యింపొందఁ ॥శ్రీసీ॥
మానియగస్త్యుడు। దానైచాపమును। భూనాయకమణికిఁ।
బాణావలిఁ। అక్షయతూణీరంబుల్దయ।
గానంబడం బ్రసా। దించెంగా ॥శ్రీసీ॥

---

౧౧ పాట.

నాటకురంజి - ఆదితాళము.

ఔ।అరుదిదా।మోదదంబిదియా। ననుపమసుఖంబునిడు॥నా।అరు॥
ఎల్లయెడల వెల్లివిరియు। మల్లీలతలుండ॥ నుల్లసము।

మనమునందు । నురుతరంబు బొదలెను॥ నౌ ॥అరు॥
వినుముసీత । వనమునందు । గనుగొనగ౯ । మనపురంబు ।
నను జెలంగు । ఘనసుఖముల్ । మనముపొంద । జనువిధంబు ।
తనరెను॥ మనోజ్ఞమనజ,నుగాదె। బళిబళి॥ ఔ ॥అరు॥

---

౧౨ పా ట.

భీమ్పలాస్ - ఆది.

మనుజేశ మనము మోద మొందగ౯ । గనుబొల్చె గోదావరియీనది॥
అమలనీరము వెలయును । విమలతరోక్తుల్ । రమణవిలసిలెడు ।
పులుగులుపొల్చె౯ । సుమంబుల౯ । డెందం । బీమహిగను౯ ।
అమరేంద్రునగర । సుఖమును రామా ॥మను॥

---

౧౩ పా ట.

శంకరాభరణము - నోటు.

అకటాయి దేటికో। నాకుమారు। డిందు దెగియె। వీకమాయగా॥ అ॥
మునులనే । మానకే । మాయజేసెద౯ । బోనీయ, నేనింక।
నూనునకు । నపకృతినీ । మాడ్కి జేయ ॥అక॥
ఘోరయిటుల్ । వీరుడౌ । మారరూపుని౯ । వారాశి।
లోద్రోసి౯ । గూరిమిచే । కూరకయీ । తాపమోర్వ ॥అక॥

---

౧౪ పా ట.

కాంభోజి - చాపు.

భళిభళిరే । స్వాంతము చెలఁగెను ॥భళి॥
ఈతని౯ । బ్రీతిగా । గనుటను॥ భళి॥ అనుపల్లవి.
హరియో జయంతుడో । మారుండో యెవ్వడో ।
యీరీతినయనముల౯ ? విరతిపొందని । నిరుపమసుఖము ।
గనగబొలిచెనీ । కరణిని ॥భళిభళిరే॥

---

౧౫ పా ట.

భాగేశ్రీ - ఏక.

నినుంగనంగ । బొమ్మనె రాముఁడు । నెమ్మితగ౯ ॥నిను౯॥
కనుగొనజాలితి । గామునిరూపము । గాదగియొ ॥నిను౯॥
సుందరాంగ । సొగసుదూల౯ । విపినంబునం । దిందుండవలెనె ।
కటా । ననుమహా । సురూప । వినోద । మెసంగంగొన ।
సుఖములగోరిన గతిగల్గు౯ ॥నిను౯॥

---

౧౬ పా ట.

కల్యాణి.

కామిని - వినుమిఁక । భూమితనయుధవుని । నమలుగోరుము॥ కా॥
నేననుచరుండ । నిరతముసాతని । యానతిదాటక నేర్చినగతి౯ ।
బూనిక సేవలచేనత నిర్జరు । మానివినుతుగొల్తు । మానినీ ॥కామి॥
సేవకుగోరుట । క్షితిగలదేవిను । పోవిడుమాళినుబోయి మహా ।
పావనమూర్తిని। పాపవిదూరుని। నావిభులునిబొందుమో సతీ॥కా॥

---

౧౭ పా ట.

నోటు.

ఓసచివులార లోకేశుల్ । మము౯గొల్వ౯ వత్తురె ॥ఓస॥
న్నాదుశాసనం । బుదలదాల్తురే కాదా ॥ఓస॥
రత్నరాసుల౯ । రమణ దెచ్చుచున్నారే ॥ఓస॥

---

౧౮ పా ట.

భాగేశ్రీ - ఏక.

రావణపరాజితారిని కాయ । రమణనీ । పురినిరతక్షింతు। ॥రావ॥
దేవగణంబుల్ । దివినేవేళ౯ । దిరుగునిశాచరుల్ ।
దేకువలంక౯ । జేవనుగాంచగలారే ॥రావ॥

---

౧౯ పా ట.

నోటు.

ఓసోదరీ । ఓసోదరీ । యీసునుబూని।
యేజనుండు।గోసెముక్కులచెవుల్ ॥ఓసో॥
బ్రహ్మనే । విష్ణునే । బట్టివే । కట్టెదర్ ॥ఓసో॥
ఇంద్రునే। చంద్రునే । నిప్పుడే । చంపెదర్ ॥ఓసో॥
చెల్లెలా। తెల్పుమా। యల్లవాడెవ్వడో ॥ఓసో॥

---

౨౦ పా ట.

హిందూస్థానిభైరవి - ఆది.

వినందగు, దానవతిలక । యనుపమవిధమును ॥వినం॥
పరునినితంబిని । పరిభవపరచుటల్ ॥వినం॥
శ్రీరఘురాముని । భూరిబలాఢ్యుల్ । జిత్తమునందుల్ ।
శ్రీపతియంచుల్ । స్థిరముగనెంచుము । సిరిగనదలచిన ॥వినం॥
న్యాయవిచారముల్ । ఈయెడమానర్ । న్యాయమేనీకో ।
యీసురనాథా । అవనిత్రనూజను నతిజవమునవిడు ॥వినం॥

---

౨౧ పా ట.

కాపి - ఆది.

ప్రాణవిభూ । జగత్ప్రభూ । వేవే । రమ్మా ॥ప్రాణ॥
ఈమృగముల్ । భూమినిముల్ । ఎందే । కంటే ॥ప్రాణ॥
కనకాంగంబున । గానగసొగసై
కనువిందైకదు । జూపట్టెల్ ॥ప్రాణ॥
వరశృంగంబులు।వజ్రకాంతినిబెడగా।సురతైనల్। గొనగోరరె॥
ననుమోదంబును । బూనజేసెనదిగో । కనుమాదేజను బ్రీతితో॥

---

౨౨ పా ట.

కాపీరాగము - ఏక.

ఓ। నాతినీవునుభక్తిల్ ।గని । మానియైననా।
కిడుము భిక్షముల్ । గరుణన్ ॥ఓ॥

హర, పురారి, సురవరవినుతా । యనిసతంబు పలికెదునాకు॥నో॥
విను, సుశీల,యనుపము,బతినిల్ ।గదుగు వేగ।ధనమణి। రాశి॥నో॥

---

౨౩ పా ట.

చాపు - అసావేరి.

మనోనాథునిల్ వీడి । నేనెట్లు జీవింతునో ॥మనో॥
మనంబెట్లు సైరెంచు । భూనాయకా ॥మనో॥
నేనెప్పుడేనీదు । తనుసంగతి । మానంగలేనైతిగాయో ప్రియా॥
ఘోరాకృతింగొన్న।కుటిలుండితడీరీతినన్గాంచు।నేడేగెదు॥మనో

---

౨౪ పా ట.

చాపు - మాండు.

వినుమో సుమిత్రాసుత । వేవేగనీవో । విమలసుశీలా ॥విను॥
పురిజేరిమనవారి।భూరిప్రీతినిగోరి।నిరతంబుప్రోవల్ ।దగుల్ ॥విను॥
సతినాసురుడుదొంగ । చందంబూనిగ్రహించి।
యతివేగపోవల్ । విదీ॥ విను॥
జనకాత్మజనుగూర్చి। క్షేమంబుల్ ననుబ్రశ్న।సలుపంగ నేమందునో

---

౨౫ పా ట.

భీమపలాస్ - రూపకము.

ధీరరామ । దితిజభీమ । దివిజకీర్తితా ॥ధీర॥
సహజధైర్య । శాలివయ్య । శాంతినొంద। కిటుల।
జింతసల్పంగజనునే । నీవు సతతముల్ ॥ధీర॥
వలదుచింత । వైరిగాంచి । వానిద్రుంచు । వఱకు।
బూన్కి । బాయంగ । గలదే । కీర్తి । వరగుణా ॥ధీర॥

---

౨౬ పా ట.

భాగేశ్రీ - జంపె.

నామదిల్ । సమ్మదంబీదినం । బునెనలరె ॥నామదిల్॥
పరమేశు । గరుణాఢ్యు । బరమాత్ము । గననౌనా॥
సరిలేని । పరితృప్తిసారెకును । జేకురెడు ॥నామదిల్॥

చిరకాల । మురుభక్తి । హరిదివ్య,చరణాబ్జ ।
పరతంత్ర।మునుగన్న । పాటవము । జేరెనో కో ॥నామ॥

---

౨౭ పాట.

బేహాగ్ - ఆది.

ప్రమోదము । గంటిని । భారతీ ॥ప్ర॥
నీవిడు । నిర్మల । ఫలముల్ । నేదిని ॥ప్ర॥
కడుధన్యగా। నెంచి,నాడను । పడయుగ। రానివి। భావింపంజను॥ప్ర॥
వినుమేను । నీవిడు । పూజ । గాంచితి । విమలాంగి ।
ప్రాప్మిక । వేముక్తింగన ॥ప్ర॥

---

౨౮ పాట.

శంకరాభరణము - నోటు.

వినురాజాభయంబిదే।లనీకు, దాని మానుము ॥విను॥
మన్ననల్ దగఁవా । రున్నచటికే । ప్రసన్నరీ।తినేగియున్ని ।
గాంచి । వేగమరలెదఁ ॥విను॥
వారుజనవిభుల్ । సురూపులగుటచే । శరణ్యులై ।
సహాయులై । కరంబుప్రోతు । రరుదుగఁ ॥విను॥

---

౨౯ పాట.

ముల్తాఁ - రూపకము.

కమలమిత్ర । కావుమా । కడుంగృపఁ ॥కమ॥
అరుగుకార్య । మురుతరంపు । సరణిజేకురఁ ॥కమ॥
పరమా।త్మా-ని-న్నేశరణుబొందెదఁ ॥కమ॥

---

30 పాట.

కాంభోజి - ఏకతాళము.

సురపూజ్యులారా । యినసూనుఁడీ । భూరిశైలనాథ ।
చారుశృంగ । మునవెలఁగోను ॥సుర॥
దయచేయుటొప్పుఁ । మరియాదగా । దానుమిమ్ముజూచు ।

మానడాతడెపుడు, చెలిమి ॥సుర॥
భుజాశక్తిమీరల్ । త్రిజగన్నుతిఁ । బొందిరాజుశేర ।
బోయగౌరవమును । గనగ ॥సుర॥

---

3౧ పాట.

మాలకాంసీ - ఏక.

ప్రాణనాథ నాదు।పల్కునీవు । పాటింపఁ మేలు ॥ప్రా॥
వినునూత్నవార్త । వింటిమనుజ । విభుగణవరు ।
డనఘుడైన । రఘువిభుండు ॥ప్రాణ॥
వనికి ననుజుతో । జానకియునురా। దనుజనాయకుల।
దునుమవచ్చె ॥ప్రాణ॥
ఇనసుతునకుభూ । జానియతడునిఁ దునుమ
మాటయిడె । ననుచువింటి ॥ప్రాణ॥
చనగదగదునీ । వానరపతిమా । ర్కొనగలేరునుర।లనగవింటి॥
॥ప్రాణ॥

---

3౨ పాట.

బిలాహరి - త్రిశ్రగతి.

రా:--వాలియనిం । గూలెగదా । బాలిశుడై । గ్రాలుటచేఁ ॥వాలి॥
భానుసూను । డనఘుడునా । మానితాంగి । జనబనుపుఁ ॥వాలి॥
లక్ష్మ:—వాలియంత । వాడుతెగెఁ ।రావణుడో।గూలడో కో ॥వాలి॥
బాహుశౌర్య । పటిమనునీ। సాహసంబు । వసుధతగఁ ॥వాలి॥

---

33 పాట.

ముఖారి.

రఘుభూషణ । రక్షింపుము । యఘమోచనకరణా ॥రఘు॥
నినుజూడగ । మనమందిటు । ఘనభక్తినిగంటిఁ ॥రఘు॥
తనయుండిత । డనసూయుడు । గనుబొల్చెడు ॥రఘు॥
యువరాజుగ । నొగిజేయుమ । యవనీశ్వరయింకఁ ॥రఘు॥

చెన్నపురి: 'వావిళ్ల' ప్రెస్సున ముద్రితము.—1925.

కావ్యతీర్థ

శ్రీ జనమంచి శేషాద్రిశర్మగారి గ్రంథములు.

ఆంధ్రశ్రీమద్వాల్మీకిరామాయణము, నిర్వచనము, వ్యాఖ్యానముల లోని భావముకూడ విపులక తెనిఁగింపఁబడినది. ప్రతిశ్లోకమున కేపద్యమో తెలియుటకై శ్లోకసంఖ్యగూడఁ దెలుపఁబడినది. విశేషార్థములుండుతావులఁ గ్రింద వివరముగ వ్రాయఁబడినది. గొప్పపీఠికగలదు. 3 సంపుటములు గల ప్రతి	12	
7 సంపుటముల ప్రతి	14	0
ఆంధ్రబ్రహ్మాండపురాణము	5	0
హాలాస్యమాహాత్మ్యము, స్కాందపురాణమునుండి తెనిఁగింపఁబడినది మధురాపురమాహాత్మ్యమును దెలుపును. మీనాక్షీసుందరేశ్వరుల విలాసచరిత్రములు డెబ్బది రెండుకథ లిందుఁగలవు.	1	0
ఆంధ్రలలితోపాఖ్యానము. భండాసురుని లలితాదేవి చంపుట మొదలగు గాథలనేకములిందున్నవి. మంచిబైండు	1	8
విచిత్రపాదుకాపట్టాభిషేకనాటకము	0	10
పాండవాజ్ఞాతవాసనాటకము	0	12
శ్రీరామవనవాసనాటకము	0	12
సంగ్రహరామాయణము, వచనము, సులభశైలి	0	10
సంగ్రహభారతము ,, ,,	1	0
కలివిలాసము, విచిత్రప్రబంధము	(అచ్చగుచున్నది.)	
సంగ్రహభాగవతము	,,	
శ్రీకృష్ణావతారతత్త్వము. ఇది యనేకపురాణములనుండి మనోహరగాథల వచనరూపముగా వ్రాయఁబడినది.	,,	

నూతనపాఠ్యాంగములు సరసముగా దొరకును.

ఇంకను అనేక సంస్కృతాంధ్రగ్రంథములు మాయొద్ద దొరకును.

వావిళ్ల. రామస్వామిశాస్త్రులు అండ్ సన్స్,

292, ఎస్ప్లనేడ్, చెన్నపురి. ఈ,

...swata Niketanam
Acc. No.
...palem.

26 31

26 31

END OF
TITLE